సామాజిక

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో

ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 126 పేజీలు: 8+16 వెల: 6.50


**భారత్‌లో 'ఎయిర్ ట్రంక్' భారీ పెట్టుబడులు** 5లో

**కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాం: అన్నామలై**

**కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు** 5లో

**ఓ మంత్రి రాజీనామా**



**మోడీ మిత్రుడే.. అయినా సుంకాలు తప్పవు: ట్రంప్** 5లో



**రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు** 2లో



బెంగళూరులో రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేస్తున్న ఖర్గే

## క్యూర్ పరిధిలో ఎల్ఐజి, ఎంఐజి

# లక్ష ఇళ్లు

### ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్‌గా తీసు కొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పాదాయ (ఎల్ఐజి), మధ్య తరగతి వర్గాలు (ఎంఐజి)కు లక్షఇండ్లు నిర్మించ బోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలములో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందని, దీనిని దృష్టిలోపెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం >>2

## కోట్లు ఖర్చుచేసి కమీషన్లు కొల్లగొట్టారు

### మోడీ దిగిపోతే రాహుల్‌ని ప్రధాని చేస్తాం: సిఎం రేవంత్

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 5 ప్రభాత వార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కెసిఆర్ ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టిందని, పంపులు లిఫ్ట్ లకోసమే వేల కోట్లు ఖర్చు చేసి కమిషన్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఒక్క ఎకరాకు మీరు ఇవ్వకుండా ఎక్కడి దక్కడే వదిలేసి వెళ్లారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. బిఆర్ఎస్ నాయకులు తిన్నది అరిగేలా నడిస్తే వాళ్ల చేసిన పాపాలు కొన్నైనా పోతాయని.. కాశీ వరకు నడిస్తే ఇంకా మంచిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టుల బాట పట్టిన సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కర్వెన రిజర్వాయర్ సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో లక్షా,81 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో లక్ష కోట్లు కేవలం కాళేశ్వరం కోసమే ఖర్చు పెట్టారని తెలిపారు. అత్యంత కీలకమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. పాల >>2

# సభలో చర్చిద్దాం.. రా!



శుక్రవారం జడ్చర్ల బహిరంగసభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

### మీ పదేళ్ల, మా రెండేళ్ల పాలనలో జనానికి ఏది బాగుందో తేల్చుకుందాం

### కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్

- పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశారా?
- 26 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం..
- 15 లక్షల రేషన్ కార్డులందించాం..
- 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం
- 2034 దాకా కాంగ్రెస్‌దే అధికారం
- జడ్చర్ల బహిరంగసభలో సిఎం రేవంత్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 5 ప్రభాతవార్త:** మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం. కెసిఆర్ అసెంబ్లీకి రా ..అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నీపేరు కెసిఆర్ అయితే చర్చకు రా.. చర్చిద్దాం.. మాది తప్పైతే నేను క్షమాపణ చెబుతా అన్నారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నామనీ స్పష్టం చేశారు. 90 టిఎంసిల నీటిని సాధిస్తామని హామీ ఇచ్చారు. జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పాలమూరు వాసుల వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసనీ, పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరులేకపోయినా ఇక్కడికి రాజకీ >>2

## పిజి ఇసెట్-26లో

# 92% అర్హత

### మూడు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేసిన జెఎన్‌టియు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 5:** ఇంజనీరింగ్ పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పిజి ఇ సెట్-2026 పరీక్షల్లో 92.66 శాతం మంది అర్హత సాధించార. త్వరలోనే కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తిచేసి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. శుక్రవారం జెఎన్‌టియు కూకట్‌పల్లి క్యాంపస్‌లో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి పిజిఇసెట్-2026 ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు విసి ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్ రెడ్డి ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, జెఎన్‌టియు రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, పిజి ఇసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ >>2

**వచ్చే యేడాదినుంచి పిజి ఇసెట్ ఎంట్రెన్స్‌లో మార్పులు!** 7లో

## రూ. 1600 కోట్ల బొగ్గు మాయంపై

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి



### అఖిలపక్షాన్ని గనుల వద్దకు పంపండి..

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కెటిఆర్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస స్కాంలతో వణికిపోతున్న సింగరేణిలో రూ.1600 కోట్లు విలువచేసే బొగ్గు మాయం చేసి, సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీశారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 40 లక్షల మెట్రిక్‌టన్నుల స్కామ్‌జరగడం సంస్థ మనుగడనే ప్రమాదంలోకి నెడుతోంది. సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించకపోవడం ఈ కుంభకోణాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు.. 40లక్షలటన్నుల బొగ్గుమీద కోల్ సెస్‌తోపాటు, ఇన్ కమ్ టాక్స్ కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడంవెనక ఎవరిహస్తంఉందో తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి >>2



## ఎపి మాజీ ఎమ్మెల్యే

# బ్రహ్మానాయుడు అరెస్టు

- నకిలీ జీవోలతో గండిపేటలో పదెకరాల సర్కార్ భూమి కాజేసే కుట్ర
- ఇప్పటికే ఐదుగురు అరెస్టు
- పరారైన వైసిపి మాజీ ఎమ్మెల్యేను కాంచీపురంలో అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** నగర శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని సొంతం చేసుకునేందుకు నకిలీ పత్రాలు, నకిలీ జిఒలు సృష్టించిన కేసులో ఎపిలోని వినుకొండకుచెందిన వైకాపా మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మానాయుడు అరెస్టయ్యారు. తమిళనాడులోని కాంచీ పురంలో ఆయనను సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేసి అక్కడి కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తు న్నారు. గతనెల 23న వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్ల అరెస్టవగా ఆ తరువాత మరో ఇద్దరు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో అసలు నిందితుడు బ్రహ్మానాయుడు పారిపోగా ఆయన కోసం సైబరాబాద్ పోలీసులుఎపిలోని పలుచోట్ల గాలించినా >>2



## రెండు రోజుల్లో రాష్ట్రంలోకి

# 'నైరుతి'

### పది రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరణ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణలో మరో రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించను న్నాయి. ఈ నెల 7వ తేదీ లేదా 8వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు అందే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 4వ తేదీన కేరళ తీరాన్ని తాకాయని న్యూఢిల్లీలోని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అధికారికంగా ప్రకటించినప్పటికీ, తెలంగాణ సరిహద్దులను భౌతికంగా తాకడానికి ఇంకా కనీసం 3నుంచి 4రోజుల సమయం పడుతుందని తెలిపింది. రుతుపవనాలు మొదట తెలంగాణలోని దక్షిణ జిల్లాలను (పూర్వపు మహబూబ్ నగర్‌ప్రాంతం) తాకనున్నాయని అంచనావేస్తున్నట్లు ఐఎమ్‌డి అధికారులు పేర్కొన్నారు. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత, అవి రాష్ట్రమంతటా విస్తరించడానికి కనీసం మరో 10 రోజులు పడుతుందని భావిస్తున్నట్లు హైదరాబాద్‌లోని ఐఎమ్‌డి డ్యూటీ అధికారి ఒకరు తెలిపారు.

## తిరుమలలో భక్తుల

# క్రమబద్ధీకరణ భేష్

### ఎఐ ఆధారిత సేవలు బాగున్నాయి: కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** గోవిందా గోవింద నామంతో తిరుమలకు వస్తున్న పెద్ద సంఖ్యలో భక్తులకు సత్వర దర్శనం, వసతి సేవలందించడంలో నిత్యం పర్యవేక్షణ చేస్తున్న కృత్రిమ మేధస్సు(ఎఐ)ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. ఈ కేంద్రంనుండి అధికారులు, సిబ్బంది భక్తుల క్యూలైన్లు, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, ఆలయం పరిసరాలు,తిరుమల ఘాట్‌రోడ్లులో పరిస్థితి పర్యవేక్షిస్తూ తీసుకుంటున్న చర్యలు బావున్నాయని గోయల్ కితాబిచ్చారు. వైకుంఠం 1 క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల భక్తులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య,గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. తిరుమలలో భక్తుల సేవల నిర్వహణలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు.

శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనానంతరం వైకుంఠమ్ 1 లోని ఐసిసిసిని సందర్శించారు. అక్కడ టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒ భాస్కర్, డిప్యూటీ సిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడుతో కలసి ఎఐ ఐసిసిసి పనితీరును మంత్రి స్వయంగా పరిశీలించారు. భక్తులు విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతాన్ని కూడా ఇక్కడ నుండి మంత్రి పర్యవేక్షించారు.





ఫెన్సింగ్ వేస్తున్న దృశ్యం

## రూ. 30వేల కోట్ల భూమికి

# 'హైడ్రా' గొడుగు

- పుప్పాలగూడలో 200 ఎకరాలను కబ్జానుంచి కాపాడిన హైడ్రా
- హద్దులను గుర్తించి ఫెన్సింగ్ చేపట్టిన అధికారులు
- చారిత్రక బండరాళ్లకు ఇక పూర్తి భద్రత

**హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్ర రాళ్ల గుట్టలతో పాటు.. ఆతి పురాతన రాతి గుహలు, వాటి మధ్యన ఉన్న చెట్టూ చేమను కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ ఖాజాగూడ సరిహద్దుల్లో శుక్రవారం 200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 250 కోట్ల సంవత్సరాల చారిత్రక రాళ్ల గుట్టలు కూడా ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండిఎకు కేటాయించిన 200ల ఎకరాలు కూడా ఉన్నాయి. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా వీరు ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూమిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు హైకోర్టు ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాలకు ఆస్కారం ఇచ్చినట్టయ్యింది. ఇదే విషయాన్ని సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. >>2

## విపక్ష పార్టీల ఇండియా కూటమిలో విభేదాలు!

**న్యూఢిల్లీ, జూన్ 5:** కేంద్రంలో అధికార మార్పిడి లక్ష్యంగా ఏర్పడిన ప్రతిపక్షాల ఇండియా కూటమి భారీ సంక్షోభం ఎదుర్కొంటోంది. ప్రాంతీయ భాగస్వామ్య పక్షాలు ఒక్కొక్కటిగా కూటమికి దూరం జరుగుతుండటంతో, భవిష్యత్తు ఎన్నికల్లో కలిసికట్టుగా ఎలాపోరాడతారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈనెల 8న దేశ రాజధాని ఢిల్లీలో జరగబోయే ఇండియా కూటమి కీలక సమావేశాన్ని తాము బహిష్కరిస్తున్నట్లు తమిళనాడు అధికారపార్టీ డీఎంకే ప్రకటించింది. తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ తమకు కోలుకోలేని ద్రోహం చేసిందని డీఎంకేనేతలు మండిపడుతున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో అక్కడ రాజకీయ సమీకరణాలుమారాయి. దశాబ్దాలుగా నమ్మకమైన మిత్రపక్షంగాఉన్న డీఎంకేను కాంగ్రెస్ పక్కనబెట్టింది. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రముఖ నటుడు జోసెఫ్ విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీతో కాంగ్రెస్ చేతులు కలపడంతో డీఎంకే తీవ్ర ఆగ్రహంవ్యక్తంతోఉంది. కాంగ్రెస్ తమకు వెన్నుపోటు పొడిచిందని, రాజ్యసభ నామినేషన్లతో పాటు తమ కూటమి ద్వారానే సీట్లు గెలుచుకుని ఇప్పుడు వేరే పార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం దారుణమని డీఎంకే నేత టీకేఎస్ ఇలంగోవన్ఆరోపించారు. తాము ఇకపై ఇండియా కూటమిలో భాగంకాదని, లోక్‌సభలోకూడా కాంగ్రెస్ పక్కనకాకుండాతమకు విడిగాసీట్లుకేటాయించాలని డీఎంకే స్పీకర్‌ను కోరింది. కూటమి కష్టాలు కేవలం తమిళ నాడుకే పరిమితం కాలేదు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల పరాజయం తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అంతర్గతవిభేదాలు,తిరుగుబాట్లతో కొట్టుమిట్టాడుతోంది.



శుక్రవారం త్రిపురలోని భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న లంకాముర బోర్డర్ ఔట్‌పోస్టువద్ద బిఎస్‌ఎఫ్ అత్యాధునిక ఆయుధాలను తనిఖీ చేస్తున్న హోంమంత్రి అమిత్‌షా

# ‘హైడ్రా’ గొడుగు

>> ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు.

**ఈ భూమి విలువ రూ. 30వేల కోట్లు అంచనా...**

రెవెన్యూ రికార్డుల మేరకు..సర్వే నంబరు 452/1లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే 454/1 సర్వే నంబరులో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండిఎకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్‌ఎండిఎకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇలా ఎవరికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్‌ఎండిఎ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడినట్టయ్యింది.

# యుద్ధాన్ని ముగించేద్దాం చర్చలకు రండి

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ లేఖ

**క్వీవ్, జూన్ 5:** నాలుగేళ్లుగా కొనసాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కొంత మెత్తబడి శాంతి చర్చల ప్రాతిపాదన చేశారు. యుద్ధాన్ని ముగిద్దాం అంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ రాశారు. నేరుగా ముఖాముఖి చర్చలు జరపాలని ప్రతిపాదించారు. జెలెన్‌స్కీ లేఖను పుతిన్ పరిశీలించినట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అమెరికా ఆధ్వర్యంలో జరుగుతున్న శాంతి ప్రయత్నాలు నిలిచిపోయిన క్రమంలో జెలెన్‌స్కీ ఈ లేఖను విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 1800 పదాలతో ఉన్న ఈ లేఖలో జెలెన్‌స్కీ నేరుగా పుతిన్‌తో సమావేశం కావాలని ప్రతిపాదించారు. ఈ యుద్ధాన్ని మనిద్దరి మధ్య నేరుగా చర్చల ద్వారా ముగిద్దాం. మీతో సమావేశం కావాలని ప్రతిపాదిస్తున్నానని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. చర్చల కోసం స్విట్జర్లాండ్, టర్కీ లేదా ఏదైనా అరబ్ దేశాన్ని తటస్థ వేదికగా ఎంచుకోవచ్చని సూచించారు. చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లో ఉండాలని కోరారు. అలాగే ఇరు దేశాల మధ్య ఉన్న యుద్ధ ఖైదీలందరినీ పరస్పరం విడుదల చేసుకోవాలని, యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పౌరులు, పిల్లల తిరిగి పంపకంపై కూడా చర్చించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం రష్యాలో సెయింట్ పీటర్స్ బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదిక జరుగుతున్న తరుణంలో జెలెన్‌స్కీ ఈ లేఖను విడుదల చేశారు. ప్రపంచ దృష్టి ప్రస్తుతం ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతలపై కేంద్రీకృతమైందని, యూరప్ యుద్ధంపై మళ్లీ దృష్టి పడే వరకు వేచిఉండటం సరైనది కాదని పేర్కొన్నారు.

రష్యాలో పెరుగుతున్నధరలు, ఇంధనకొరత, దీర్ఘకాలిక యుద్ధ ప్రభావం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. ఇక లేఖలో జెలెన్‌స్కీ అసాధారణంగా వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారు. ఉక్రెయిన్‌రష్యా సంబంధాలను యుద్ధం, విధ్వంసం దిశగా మళ్లించారని పుతిన్‌పై ఆరోపించారు. 26 ఏళ్లుగా అధికారంలో ఉన్న నేపథ్యంలో వయసు ప్రభావం కనిపించడం ప్రారంభమైందంటూ విమర్శలు గుప్పించారు. అలాగే రష్యా సైన్యం పూర్తి స్థాయిలో డోనెట్స్క్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేదని, భవిష్యత్తులో కూడా అది సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం రష్యా ఈ ప్రతిపాదనను అంగీకరించ లేదని, పుతిన్‌కు లేఖ అందిందని క్రెమ్లిన్ ధృవీకరించింది. రష్యా మాత్రం నేరుగా శిఖరాగ్ర సమావేశం జరగాలంటే ముందుగా ప్రధాన అంశాలపై ఒప్పందం కుదరాలి. రష్యా ఆక్రమించిన భూభాగాలను ఉక్రెయిన్ అంగీకరించాలని, ఈయూలో చేరేప్రయత్నాలను విరమించు కోవాలని మాస్కో డిమాండ్‌చేస్తోంది. ఉక్రెయిన్ మాత్రం తన సార్వ భౌమాధికారం, భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ఉండే ఒప్పందానికే అంగీకరిస్తామని స్పష్టం చేస్తోంది.

# లోయలో పడిన టెంపో

## మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో ఘోర ప్రమాదం

### 25 మంది టూరిస్టులకు గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

**చింతూరు జూన్ 5 ప్రభాత వార్త:** చింతూరు మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శనివారం మిట్ట మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 25 మంది టూరిస్టులతో ప్రయాణం చేస్తున్న టెంపో వాహనం అదుపుతప్పి లోయలోకి పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న టూరిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చింతూరు నుంచి భద్రాచలం, భద్రాచలం నుంచి రాజమండ్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కడియం మండలం వేమగిరి, సామర్లకోట మండలం మేడపాడు, జగ్గంపేట మండపేట,గంటి పెద్దపుడి గ్రామాలకు చెందిన సుమారు 25 మంది వారి చిన్నారులతో కలిసి మారేడు మిల్లిలోని వాటర్ ఫాల్స్ వీక్షణ కోసం బయలుదేరారు.

మారేడుమిల్లిలో వాటర్ ఫాల్స్ వద్ద నీళ్లు లేకపోవడంతో, వారితో ఉన్న చిన్నారులు నీళ్లలో జలకాలాడాల్సిందే అని పట్టు పట్టడంతో అక్కడి నుంచి వారు చింతూరు వైపు ప్రయాణ మయ్యారు. ఘాట్ రోడ్డు మొత్తం క్రిందకు దిగిన తర్వాత పెద్దమ్మతల్లి గుడి దాటి చింతూరు వైపు వస్తుండగా రెండో మలుపు వద్ద వాహనము అదుపుతప్పి రైలింగును ఢీకొని లోయలోకి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో 12 మందికి కాళ్లు చేతులు విరగగా మరో 13 మందికి గాయాలయ్యాయి. హుటా హుటిన అంబులెన్స్‌లో స్కేతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించడంతో ఆసుపత్రి మొత్తం క్ష తగాత్రుల ఆహాకారాలతో తల్లడిల్లింది. తీవ్రంగా గాయాలైన 12 మందిని చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి భద్రాచలంతరలించారు.

# సభలో చర్చిద్దాం.. రా!

>> యంగా వలస వచ్చిన కెసిర్‌ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకొని పార్లమెంట్ సభ్యునిగా గెలిపించారని, కానీ పాలమూరుకు తిరిగి ఒక్కసారి రాలేదు, పార్లమెంటులో గొంతు వినిపించలేదన్నారు. ఒక తల్లిగా ఇక ఏ తల్లికి గుండెకోత ఉండొద్దని సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కానీ కెసిఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే.. పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్ట్ పూర్తి చేయలేదనీ విమర్శించారు. ప్రతిపక్ష సభ్యులు కొందరు పాదయాత్రలు చేస్తామంటున్నారని...పాదయాత్ర కాదు.. కాశీదాక పొర్లు దండాలు పెట్టినా మీరు చేసిన పాపాలు తొలిగిపోవు, ప్రజలు క్షమించరని చెప్పారు. జడ్పీటీసీగా మీరు నాటిన ఈ మొక్క ముఖ్యమంత్రిగా వృక్షమై తిరిగి మీ ముందుకు వచ్చాడనీ, పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్‌లో పోటీ చేసిన కెసిఆర్ పాలమూరు ద్రోహినా? పాలమూరును అభివృద్ధి చేస్తున్న తాను పాలమూరు ద్రోహినా? అని ప్రజలను ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నామనీ స్పష్టం చేశారు.పదేళ్లలో కాళేశ్వరం కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిన కెసిఆర్.. ఉదండపూర్ మునిగితే రూ.800 కోట్లు ఇవ్వలేదనీ.. ఇవ్వకపోగా నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించాడని గుర్తు చేశారు.అందుకే మట్టికి పోయినా మనోడే పోవాలని పెద్దలు చెప్పారన్నారు. ఈ 30 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టుల కొరకు రూ. 22 వేల కోట్లు ఖర్చు చేస్తే మీ పాలమూరు బిడ్డగా ఈ జిల్లాలో ప్రాజెక్టుల కోసం రూ. 8వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం. అందుకే ట్రిబుల్ ఐటీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామన్నారు. ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్‌లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని చెప్పారు. హనుమాండ్ల గుడిలేని తండా, గూడెం ఉన్నదేమో కానీ ఇందిరమ్మ ఇల్లు లేని గూడేలు లేవు తండాలు లేవని అన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారనీ..15 లక్షల రేషన్ కార్డులు అందించాం, 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం, పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికి ఖర్చు చేశామని చెప్పారు. గోదావరి పై తుమ్మిడిహట్టి కట్టి తీరుతామని పేర్కొన్నారు. 2029లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరులో బిఆర్‌ఎస్ జెండా ఎగరనివ్వమని చెప్పారు. ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్ అంటూ నినదించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు ఇదే టర్మ్‌లో పూర్తి చేస్తామని, సంవత్సర కాలంలో శ్రీశైలం నుండి ఉదండాపూర్ వరకు నీటిని తీసుకువస్తామని చెప్పారు. అదేవిధంగా ఉదండపూర్ నుండి లక్ష్మీదేవి పల్లి వరకు భూసేకరణ చేపడతామని తెలియజేశారు. 6 నెలల్లో భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పాలమూరులోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలియజేశారు. భూములు కోల్పోయిన రైతులకు నెలరోజుల్లోనే 630 కోట్లు విడుదల చేయడం జరిగిందని, ఇది ఒక అసాధారణ విషయమని చెప్పారు. గత పాలకులు 10 సంవత్సరాల్లో పండించిన వరి, కొనుగోలు చేసిన వరి కేవలం ఈ రెండున్నర సంవత్సరాల్లో పండించడం, వాటిని కొనుగోలు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రతి సంవత్సరం 40 వేల కోట్లు రైతులకు వరి కొనుగోలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ యాసంగిలో దేశం మొత్తంలో 60 శాతం వరి తెలంగాణలో కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ) చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణిక రెడ్డి, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి

>> ఆయన బహిరంగ లేఖ రాశారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం 1లో ఆరు లక్షలు, రామగుండం 2లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు. కానీ కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారం అని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలోనే బొగ్గు గనులపై నిలువలను తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం... చివరికి కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తున్నది. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షల టన్నుల తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా అనే బలమైన అనుమానం కార్మికలోకాన్ని వెంటాడుతోందన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిల పక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని, అప్పుడే సింగరేణిలో సాగుతున్న ఈ భారీ అక్రమాల పుట్ట బద్దలవుతుందన్నారు. ఈ కుంభకోణమే కాకుండా, ఇటీవల బిఆర్‌ఎస్ వెలుగులోకి తెచ్చిన నైని బొగ్గు గని టెండర్ల స్కాం కూడా దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలాంటి సింగరేణిని కబళించేందుకు సిఎం రేవంత్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికేట్ అనే నిబంధన పెట్టి, కోరుకున్న వారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలుచేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని తెలినా ఇప్పటిదాకా దీనిపై మీరు చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. నైని కోల్ స్కామ్‌ను బిఆర్‌ఎస్ బయటపెట్టగానే ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియను రద్దుచేస్తున్నట్టు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రకటించారు తప్ప టెండర్లలో అక్రమార్కుల భరతం పట్టే దిశగా ఒక్క అడుగు వేయలేదు. టెండర్ పోటీదారులను బెదిరించి, భయపెట్టి ప్రక్రియ నుంచి తప్పించే పన్నాగాలు సాగినా దీనికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదు. ఈ టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడానికి కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకూ ఏం తేల్చిందో కూడా పత్తాలేదు. నైని కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు మొద్దునిద్ర పోతోందో సమాధానం చెప్పాలన్నారు. నైని స్కామ్ తోపాటు.. 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల నిబంధనలకు పాతరేసి నేషనల్ ఆవరేజీని కూడా మించి అత్యధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడ్డారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి నేరుగా డీజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్ధాంతరంగా రద్దుచేసి అందులోనూ దోపిడీకి తెరలేపారు. అలాగే పేలుడు పదార్థాల కొనుగోళ్లలోనూ కోల్ ఇండియా కంటే 30 శాతం అధిక నిధులు చెల్లించి అనుయాయులకు కట్టబెట్టారు. ముఖ్యమంత్రితో మీకున్న రహస్య ఒప్పందాల కారణంగా సింగరేణి సంస్థను బలిచేయవద్దని కోరుతున్నాం. ప్రస్తుతం బిఆర్‌ఎస్ వెలుగులోకి తెచ్చిన రూ.1600 కోట్ల సింగరేణి బొగ్గు కుంభకోణంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కమీషన్లు కొల్లగొట్టారు

>> మూడు ఎత్తిపోతల పథకంతో 90 టిఎంసిల నీళ్లు అందించొచ్చని చెప్పారు. దీంతోపాటు జూరాల, భీమా నెట్టెంపాడు, కోయిల్ సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తిచేస్తే జిల్లాకు 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు అందే అవకాశం ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి 10 ఏళ్లలో కెసిఆర్ ప్రభుత్వం రూ.84,503 కోట్ల అప్పు కట్టిందని, కానీ తాము అధికారంలోకి వచ్చాక 30 నెలల్లోనే రూ. 52,120 కోట్ల అప్పు కట్టినట్లు సిఎం వివరించారు. ఇందులో ఎనిమిది వేలకోట్లు పాలమూరు ప్రాజెక్టుల కోసమే ఖర్చు పెట్టామని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా నాలుగువేల ఎకరాలభూసేకరణ చేయాల్సి ఉందని ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రెండేళ్లలో జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని కంకణ బద్ధులై పని చేస్తున్నారని స్పష్టం చేశారు.

**బిఆర్‌ఎస్‌వి పచ్చి అబద్ధాలు...**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90శాతం పూర్తయ్యాయని బిఆర్‌ఎస్ నాయకులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అంచనా వేయంలో 50% కూడా ఖర్చు చేయకుండా 90% పనులు ఎలా పూర్తయితాయని ప్రశ్నించారు. అందులో మ్యాథ్స్ ఏంటో తనకు అర్థం కావడం లేదని చమత్కరిం చారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసుకోలేమని, అలా చేస్తే చరిత్ర మనల్ని క్షమించదని, జిల్లాలోని ప్రాజెక్టులన్ని పూర్తి చేసేందుకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నానని మరోసారి స్పష్టం చేశారు. మోడీ ప్రధాని పదవి నుంచి దిగిపోతే తాము రాహుల్ గాంధీని ప్రధాని చేసి అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటామని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కూడా తెచ్చుకుంటామని చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎస్పీ జానకి, ఎమ్మెల్యేలు జీ. మధుసూదన్ రెడ్డి, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఉన్నారు.

## రక్షణరంగంలో ఆత్మనిర్భరతకు పుతిన్ మద్దతు

### సుఖోయ్ భారత్‌లోనే తయారీకి రష్యా సానుకూలం

**న్యూఢిల్లీ, మాస్కో, జూన్ 5:** భారత వైమానిక దళ ఆధునీకరణ, తగ్గుతున్న ఫైటర్ స్క్వాడ్రన్‌ల సంఖ్య భర్తీ, స్వదేశీ ఐదో తరం యుద్ధ విమానాల అభివృద్ధి వంటి కీలక లక్ష్యాల మధ్య రష్యా మరోసారి సు57 యుద్ధవిమాన ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావాలని భారత్‌కు ఆహ్వానం పలికింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన తాజా వ్యాఖ్యలు రక్షణ రంగంలో మళ్లీ చర్చకు దారితీశాయి. దశాబ్దానికి పైగా క్రితం భారత్‌రష్యా కలిసి ఐదో తరం యుద్ధ విమానం అభివృద్ధి చేయాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అప్పట్లో భారత్ వేచి చూసే విధానాన్ని ఎంచుకోగా, రష్యా స్వతంత్రంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది. ప్రస్తుతం సుఖోయ్ 57 సేవల్లో ఉండటంతో పాటు విదేశీ మార్కెట్లలో కూడా దానిని ప్రోత్సహిస్తున్న రష్యా, కొనుగోలు మాత్రమే కాకుండా ఉత్పత్తి మరియు భవిష్యత్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని భారత్‌ను కోరుతోంది. సుఖోయ్ డిజైన్ బ్యూరో అభివృద్ధి చేసిన సు57 రష్యా తొలి కార్యాచరణలో ఉన్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం. అమెరికా తయారీ ఎఫ్22 రాప్టర్, ఎఫ్35 లైట్నింగ్ వంటి విమానాలకు పోటీగా దీన్ని రూపొందించారు. రాడార్‌కు తక్కువగా కనిపించే స్టెల్త్ సాంకేతికత, సూపర్‌క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక సెన్సార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సదుపాయాలు, దీర్ఘ శ్రేణి దాడుల సామర్థ్యం వంటి లక్షణాలు ఇందులో ఉన్నాయని రష్యా చెబుతోంది. ఈ విమానం గగనతల ఆధిపత్యం సాధించడం, భూభాగ లక్ష్యాలపై దాడులు, ఎలక్ట్రానిక్ యుద్ధ చర్యలు, ఖచ్చితమైన దీర్ఘ శ్రేణి దాడులు వంటి పలు విధుల కోసం ఉపయోగించవచ్చని రష్యా చెపుతోంది.

## వారం - వర్జ్యం

06-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
షష్ఠి రా.2.39
శ్రవణ ఉ.6.03
వర్జ్యం : ఉ.10.21-మ.12.05
దు.తె.5.33-ఉ.7.13
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తి లాభాలు పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి.వస్త్రలాభం.

**వృషభం:** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి.

**మిథునం:** కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కారమవుతాయి. మానసిక వత్తిడుల నుండి బయటపడతారు.గృహనిర్మాణాలు చేపడతారు.

**సింహం:** ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

**కన్య :** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.వస్త్రలాభం.

**తుల:** ఆర్థికవరమైన లావాదేవీలలో మధ్యవర్తి వ్యవహారాలు లాభించవు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**వృశ్చికం:** బాధ్యతలు సమర్థవంతంగా నెరవేర్చి పలువురి ప్రశంసలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** చేపట్టిన పనులలో కొద్దిపాటి ఒడిదుడుకులు ఎదురవుతాయి. అయినా ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోరు.

**మకరం:** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుటుంబ పురోభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**కుంభం:** కార్యాలయంలో సానుకూల వాతావరణం నెలకొని ఉంటుంది. మానసిక ప్రశాంతత లాభిస్తుంది.

**మీనం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం సూరత్‌లోని హాజీరాలో ఉన్న ఎల్ అండ్ టి ప్లాంట్‌ను సందర్శించిన ప్రధాని మోడీ

# రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు

## రాహుల్ గాంధీ, సిఎం డికె శివకుమార్, సిద్ధరామయ్య హాజరు

**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విధాన సౌధలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి డికె శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. అంతకుముందు, ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో, నామినేషన్ పత్రాల దాఖలుకోసం రాహుల్‌గాంధీ, ఖర్గే శుక్రవారం బెంగళూరుకు చేరుకున్నారు. వారు రాగానే ముఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు బి.కె. హరిప్రసాద్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారికి ఘన స్వాగతం పలికారు. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీ ఒక మొక్కను నాటి, దానికి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా, సిద్ధరామయ్య, మంత్రి ఎంబి పాటిల్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పిజి ఇసెట్-26లో 92% అర్హత

>> కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మే 29న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 1తో ముగిశాయి. నాలుగు రోజులపాటు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ తెలిపారు. నాలుగు రోజులపాటు పరీక్షలను నిర్వహించిన అధికారులు పరీక్షల అనంతరం నాలుగో రోజునే ఫలితాలను విడుదల చేశారు. ఎంఇ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీ ఇసెట్-2026 పరీక్షలనను నిర్వహించిన సంగతి తెలిసిందే. 19 పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 26,077 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 23,637 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 21,958 మంది(92.66శాతం) మంది అర్హత సాధించారు. మహిళలు 14,722 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 13,468 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 12,702 మంది(94.31శాతం) అర్హత సాధించారు. పురుషులు 11,355 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 10,169 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 9256 మంది(91.02శాతం) అర్హత సాధించారు. జెఎన్‌టియు యూనివర్సిటీ పరిధిలో 136 ఇంజనీరింగ్ కాలేజీలు, 72 ఫార్మసీ కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరం అనుబంధ గుర్తింపుకోసం దరఖాస్తు చేసుకున్నాయని విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. వాటిలో ఇప్పటికే తనిఖీల ప్రక్రియను ముగించామని.. కాలేజీల్లో ఉన్న లోపాలను సరిచేసుకోవడానికి నేటి (జూన్6) వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఆయా కాలేజీల్లో ఉన్న లోపాలను సరిచేసుకుంటే ఆయా కాలేజీలకు 2026-27 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపును ఇవ్వనున్నట్టు వీసీ స్పష్టం చేశారు. కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ ముగిసిన వెంటనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేయనున్నట్టు తెలిపారు.

# ఎల్ఐజి, ఎంఐజి లక్ష ఇళ్లు

>> పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని అన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదన్నారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలి పోయాయని పేర్కొన్నారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమంకోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు.పేదల అవసరాలనుదృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపుఅడుగుల విస్తీర్ణంఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎపి సిఎం చంద్రబాబు

# బ్రహ్మానాయుడు అరెస్టు

>> ప్రయోజనం లేకుండా పోయింది. అయితే బ్రహ్మానాయుడు తమిళనాడు పారిపోయి కాంచీపురంలో తలదాచుకున్నట్లు సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఒక హోటల్‌లో వుండగా పట్టుకున్నారు. గండిపేట్ మండలంలోని సర్వే నంబర్ 18లో గల పదెకరాల సర్కారు భూమిని కాజేసేందుకు బ్రహ్మానాయుడు తనకు తెలిసిన న్యాయవాదులు, రియల్టర్ల సహాయంతో తప్పుడు పత్రాలతో పాటు నకిలీ జిఒలు సృష్టించడం తెలిసిందే. అనంతరం ఐదు వందల కోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఈ భూమి తనదంటూ బోర్డులు పాతేందుకు యత్నించి, ఏకంగా మరో వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై గండిపేట్ తహసీల్దార్ నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గత నెల 23వ తేదీన కేసు నమోదయ్యింది. దీని తరువాత కేసును విచారించగా బ్రహ్మానాయుడు ఈ గోల్‌మాల్ వ్యవహారానికి సూత్రధారిగా తేలింది. నకిలీ పత్రాలు, నకిలీ జిఒల తయారీకి బ్రహ్మానాయుడు తన ముఠాలోని సభ్యులకు ఎనిమిది కోట్ల రూపాయలు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. ఆయన ముఠాలో ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నకిలీ పత్రాలతో పాటు నకిలీ జిఒలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు కాగానే బ్రహ్మానాయుడు పారిపోయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేసింది. దీని తరువాత తన అరెస్టు ఖాయమని భావించిన బ్రహ్మానాయుడు అజ్ఞాతంలో వెళ్లి పలుప్రాంతాలనుమార్చి చివరకు శుక్రవారం నాడు కాంచీ పురంలో పట్టుబడ్డారు. బ్రహ్మానాయుడును శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ తీసుకువచ్చిన తరు వాత వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక న్యాయస్థానంఎదుట హాజరుపరచి కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు తరలిస్తారు. కాగా ఈ కేసులో మరింత సమాచారం సేకరించేందుకు బ్రహ్మానాయుడును వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరనున్నారు. ఈ పిటిషన్ శనివారం లేదా సోమవారం దాఖ లయ్యేవీలుంది. ఈ కేసులో కొందరు రెవెన్యూఅధికారులు, మాజీ అధికారులపాత్రపై ఆరోపణలు రావడంతో బ్రహ్మానాయుడును విచారిస్తే అసలువిషయం వెలుగుచూసేవీలుందని సైబరాబాద్ పోలీసులు భావిస్తున్నారు.

# డిఇసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు నేటి వరకు పొడిగింపు

### నేటి నుంచి 8 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యు కేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్)-2026కి సంబంధించి అర్హత సాధించిన వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నేటి(శనివారం) వరకు పొడిగించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి మొదట ఈ నెల 5(శుక్రవారం) వరకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అయితే అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నేటి వరకు పొడిగించారు. డీఈఈ సెట్-2026లో అర్హత సాధించిన వారికి రాష్ట్రంలోని 10 డైట్ కాలేజీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్లు కన్వీనర్ తెలిపారు. డీఈఈసెట్-2026లో అర్హత సాధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన వారు నేటి (శనివారం) నుంచి ఈ నెల 8 వరకు వెబ్ ఆప్షన్ల ఇవ్వడానికి అవకాశం కల్పించినట్లు కన్వీనర్ రమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) మైనారిటీ,నాన్‌మైనారిటీతో సహాలో రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశానికి డీఈఈ సెట్‌ను నిర్వహించిన విషయము తెలిసిందే. టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో ప్రవేశాలను తీసుకోనున్నారు. డీఈఈ సెట్‌ను మే 21న ఫలితాలను మే 30న విడుదల చేశారు. పరీక్షకు 32,592 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 25,054 మంది హాజరయ్యారు. వారిలో 21,137 మంది(84.36శాతం) అర్హత సాధించారు. తెలుగు మీడియం పరీక్షకు 12,373 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 9612 మంది హాజరుకాగా అందులో 7918 మంది(82.37శాతం) మంది అర్హత సాధించారు. పరీక్ష రాసిన వారిలో బి ఆనంద్ 76 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించాడు. ఇంగ్లీష్ మీడియం పరీక్షకు 18,985 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 14,414 మంది హాజరయ్యారు. అందులో 12,784 మంది(88.69శాతం) అర్హత సాధించారు.



# మలేసియా చేరుకున్న కెటిఆర్

### ఘనస్వాగతం పలికిన ఎన్నారైలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుటుంబ సమేతంగా మలేషియా రాజ ధాని కౌలాలంపూర్ చేరుకున్నారు. మలేషియా తెలంగాణ అసోసి యేషన్ (మైటా), బీఆర్ఎస్ మలేషియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6న(శనివారం) కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనను న్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇక్కడికి విచ్చేశారు. కౌలాలం పూర్ విమానాశ్రయానికి చేరుకున్న కేటీఆర్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు ప్రవాస తెలంగాణ ప్రతి నిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. స్వాగతం పలికిన వారిలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిశోర్ కుమార్, మైటా అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతితో పాటు ఇతర ముఖ్య నేతలు, ఎన్నారైలు ఉన్నారు.

# పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి

### రేవంత్‌రెడ్డిపై ధర్మపురి అరవింద్ విమర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.... తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు.

వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు.

# మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీని పరామర్శించిన కవిత

**హైదరాబాద్ (కొంపల్లి), జూన్ 5, ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ప్రస్తుతం దేవ్ జీ కొంపల్లిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కవిత శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను స్వయంగా కలిసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవ్ జీకి అందుతున్న వైద్య సేవల గురించి అక్కడ ఉన్న నిపుణులైన డాక్టర్లతో కవిత మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్న టీఆర్ఎస్ చీఫ్.. దేవ్ జీకి మెరుగైన వైద్యం అందించాలని, ఆయన త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. దేవ్ జీ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. కాగా, కొన్ని నెలల క్రితమే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ(62) సుమారు 40 ఏళ్ల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికి పోలీసులు ఎదుట లొంగిపోవడం ద్వారా జనజీవన స్రవంతిలోకి వచ్చిన విషయం తెలిసిందే.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంపి చామలకు సిట్ పిలుపు

### కమాండ్ కంట్రోల్‌లో నేడు విచారణ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యా పింగ్ కేసులో బాధితుల విచారణ, వాంగ్మూలం సేకరణ కొనసా గుతోంది. ఇప్పటికే అనేక మందిని విచారించిన సిట్ అధికారులు తాజాగా భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డికి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్‌రూంలో సిట్ ఎదుట విచారణకు హాజరు కావాలని అందులో కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని సిట్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఆయనను విచారించేందుకు నిర్ణయించి నోటీ సులు ఇచ్చారు.

# దేశంలో అశాంతిని సృష్టిస్తున్న కాంగ్రెస్

### సూరత్‌లో ప్రధాని మోడీ

**సూరత్, జూన్ 5:** కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అందుకే ముఖ్యమంత్రి మార్పుల్ని వచ్చిందని ప్రధాని మోడీ విమర్శించారు. శుక్రవారం గుజరాత్‌లోని సూరత్ నగరంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోడీ ప్రారంభించిన సందర్భంగా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ఇప్పుడు ప్రతికూలతలను దాటి సరికొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ప్రధాని స్పష్టం చేశారు. దేశ పౌరులు తమ కలలను, సంకల్పాలను నిజం చేయడానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. గడిచిన 12 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల మధ్య అశాంతిని, అనిశ్చితిని సృష్టించిందని ప్రధాని మోడీ ఆరోపించారు. గుజరాత్ ప్రజలు కాంగ్రెస్‌ను పూర్తిగా పక్కన పెట్టారని, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సైతం ప్రజలు ఆ పార్టీ అవినీతి, దుష్పరిపాలన పట్ల తీవ్ర విసుగు చెందారని మండిపడ్డారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు మునిసిపల్ కార్పొరేషన్లలో మూడింటిని బీజేపీ కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీ సాధించిందని మోదీ గుర్తు చేశారు. ఈ ఫలితాలు హిమాచల్ ప్రదేశ్ ప్రజలు సైతం కాంగ్రెస్ తప్పుడు పరిపాలనను పూర్తిగా తిరస్కరించారని నిరూపిస్తున్నాయని ఆయన వివరించారు. హిమాచల్ ప్రదేశ్ కంటే ముందే హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైందని, పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశాన్ని పంపించారని ప్రధాని మోడీపేర్కొన్నారు. సమాజంలో అశాంతిని సృష్టించి, ఆ గందరగోళం నుండి రాజకీయ ప్రయోజనాలను పొందాలని చూసే కాంగ్రెస్ పప్పులు ఇకపై ఉడకవని ఆయన హెచ్చరించారు.

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఒఎల్ఎస్ సర్వే కోసం

# రూ.48.49 కోట్లు విడుదల

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అభివృద్ధి పరుస్తున్న రక్షణశాఖ, సివిల్ ఏవియేషన్ ఉమ్మడి ఎయిర్‌పోర్టు కోసం అబ్‌స్టాకిల్ లిమిటేషన్ సర్వే నిర్వహించడానికి తెలంగాణ ఆర్ అండ్ బి శాఖ రూ.48.49కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆదిలాబాద్‌లో మెగా కమర్షియల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అత్యంత త్వరలోనే డిసెంబర్‌లోగా ఆదిలాబాద్ విమానాశ్రయం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 1930 నిజాం కాలంలో సైనిక అవసరాల కోసం నిర్మించిన ఎరోడ్రోమ్ దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్నది. మొత్తం 1,062 ఎకరాల్లో ఈ మెగా ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకోనున్నది.362 ఎకరాల రక్షణశాఖ భూమి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం 700 ఎకరాల భూసేకరణను వేగవంతం చేసింది. ఒఎల్ఎస్ సర్వే కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదలచేయడంతో ఒక కీలక అడుగు ముందు పడింది. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 450 ఎకరాల స్థలాన్ని అప్పగించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఏప్రిల్ 8న ఢిల్లీలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుపై కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో సమీక్ష చేశారు. తెలంగాణలో ఒకే విమానాశ్రయం ఉందని, మరికొన్ని ప్రాంతాల్లోనూ విమానాశ్రయాలు ఉండాలనేది రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఆదిలాబాద్‌ను ఎంపిక చేశామని ఇది పౌరవిమానయానంతోపాటు రక్షణశాఖ అవసరాలను తీర్చబోతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆదిలాబాద్‌లో 360 ఎకరాలకు సంబంధించిన డిఫెన్స్ స్థలంలో విమానాశ్రయ నిర్మించాలనుకున్నామని, అదనంగా మరో 700 ఎకరాల స్థలం అవసరమవుతుందని ఆ సమావేశంలో నిర్ణయించారు. పౌర విమానయాన, రక్షణశాఖలు, రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 17న క్షేత్రస్థాయిలో ఒఎల్ఎస్ అబ్‌స్టాకిల్ లిమిటేషన్ సర్వే ప్రాథమికంగా చేశారు. రన్‌వే ఓరియంటేషన్‌పై నిర్ణయం తీసు కోవడానికి సమగ్రంగా ఒఎల్ఎస్ సర్వే చేయాల్సి ఉంటుంది.

# డివైఇఒ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

### 24 పోస్టులకు 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### జూలై 19 వరకు తుదిగడువు.. నోటిఫికేషన్‌ను జారీ చేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమి షన్(టిజిపిఎస్‌సి) నిరుద్యోగుల కోసం మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున 290 పోస్టుల భర్తీ కోసం మూడు నోటిఫికేషన్లను జారీ చేశారు. శుక్ర వారం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీ సర్ల(డివైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 నియామకాలకు కమిషన్ నోటిఫికేషన్‌ను విడుద చేసింది. మొత్తం 24 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వాటిలో మల్టీ జోన్-1లో 10, మల్టీజోన్-2లో 14 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు 18 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాల వయోపరిమితిని విధించింది. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి జులై 19 వరకు స్వీకరించనున్నారు. యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బాచిలర్ డిగ్రీ కలిగి ఉండాలి. కనీసం 55 మార్కులతో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు అవసరం.

పరీక్ష విధానం పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ అబిలిటీస్ 150 ప్రశ్నలు -150 మార్కులు, పేపర్-2 పార్ట్-ఏలో బేసిక్ ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ - 75 ప్రశ్నలు - 150 మార్కులు, పార్ట్-బిలో ఎడ్యుకేషనల్ లీడర్షిప్, అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ - 75 ప్రశ్నలు - 150 మార్కులతో మొత్తం 450 మార్కులకి పరీక్షను నిర్వహించనున్నారు. అర్హులైన అభ్యర్థులు టిజిపిఎస్‌సి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ఓటీఆర్ నమోదు చేసుకున్న వారు తమ టిజిపిఎస్‌సి ఐడీ ద్వారా లాగిన్ అయి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం

### లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

### కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వల్ల కాళేశ్వరం గాయత్రి పంపింగ్ స్టేషన్‌తో పాటు దేవాదుల తదితర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు, మోటార్లు దెబ్బతిన్నాయని, భారీ మోటార్లను పదేపదే ఆన్‌ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని ముందుగానే మేం హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కీలక సాగునీటి మౌలిక వసతులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నష్టపోతుండటం శోచనీయం.ప్రాజెక్టులను బలహీనపరచి ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నమా అన్న అనుమానం కలుగుతుంది. సోలార్ విద్యుత్ అందుబాటులో ఉండే పగటి వేళల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ పంపులు నడపాలని ట్రాన్స్‌కో సూచించడం వల్ల, భారీ పంపులను తరచూ స్టార్ట్, స్టాప్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పంపులు, మోటార్ల నష్టం ఈ విధానాల వల్ల జరిగి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందే.ఈ నిర్ణయాలకు ముందు సాంకేతిక అధ్యయనం జరిగిందా లేదా అనేది అసలు ప్రశ్న. జీఓ ఎంఎస్ నం.8 ద్వారా టీజీఆర్‌పీడీసీఎల్‌కు అధిక పునరుత్పాదక (సోలార్) విద్యుత్ కేటాయింపు.సోలార్ విద్యుత్ ప్రధానంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటుంది.దీంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పంపింగ్ కార్యకలాపాలు పరిమిత సమయానికే కట్టుబడే ప్రమాదం.నీటి ఎత్తిపోతలు తగ్గి, కృష్ణాగోదావరి జలాల వినియోగ సామర్థ్యం దెబ్బతింటాయి.కాళేశ్వరం, దేవాదుల, పాలమూరు ఇతర ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం తెలం గాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకోవడం.విద్యుత్ లభ్యత ఆధారంగా పంపింగ్‌ను పరిమితం చేయడం రాష్ట్ర జల హక్కులకు విరుద్ధం.నీటి వినియోగం తగ్గితే వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాలు, చేపల పెంపకం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. తెలంగాణకు కేటాయించిన తాత్కాలిక వాటా 34 కాగా, ఆంధ్రప్రదేశ్‌కు 66 .202425లో ఆంధ్రప్రదేశ్ 72.73 శాతం నీటిని విని యోగించగా, తెలంగాణ కేవలం 27.27శాతం మాత్రమే వినియోగించింది. 2025-26లో ఆంధ్రప్రదేశ్ వినియోగం 74.90శాతంకు పెరగగా, తెలంగాణ వినియోగం చారిత్రక కనిష్టమైన 25.10శాతంకు పడిపోయింది. నీటి లభ్యత అధికంగా ఉన్నప్పటికీ తెలంగాణ తన వాటా నీటిని కూడా పూర్తిగా వినియోగించుకోలేకపోయింది.తెలంగాణ జల హక్కులను, రైతుల ప్రయోజనాలను కాపా డడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఇది మరో నిదర్శనం. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పంపింగ్ సీజన్‌లో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి.తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల పూర్తి వినియోగం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలి. రైతు డిస్కం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి. కాళేశ్వరం, దేవాదుల తదితర ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునీకరణకు తగిన బడ్జెట్ కేటాయించాలి. వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి తదితర రంగాలకు తగిన నీటి లభ్యతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. .

# ఉమ్మడి నిజామాబాద్‌లో విషాదం

### రెండు ఘటనల్లో నీటమునిగి ఆరుగురి మృతి

### పిట్లంలో మంజీరాలో మునిగి మహిళసహా ఇద్దరు బాలికల మృతి

### భీంగల్‌లో నీటికుంటలో మునిగి ముగ్గురు చిన్నారుల మరణం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ఉమ్మడి నిజామాబాద్‌లో రెండు వేరు వేరు ప్రాంతాలలో జరిగిన దుర్ఘటనల్లో ఒక మహిళ సహా ఐదుగు రు చిన్నారులు నీటిలో మునిగి మరణించారు. మొదటి ఘటనలో నిజామాబాద్ జిల్లా భీంగల్‌లోని లింబాద్రిగుట్ట బ్రాహ్మణ కుంటలో ఆడుకునేం దుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు అందులో మునిగి చనిపోయారు. మరో ఘటనలో కామారెడ్డి జిల్లా పిట్లంలోని బొల్లపల్లి మంజీర నదిలో ము నిగి ఒక మహిళతో పాటు మరో ఇద్దరు బాలికలు మరణించారు. ఈ ఘటనలో మరో ముగ్గురిని స్థానికులు రక్షించారు. వివరాలు ఇలావున్నాయి. భీంగల్‌లో వడ్డెర బస్తీకి చెందిన హరీష్ (11), వర్షిణి (6), అరవింద్ (5) శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటి నుంచి ఆ డుకునేందుకు బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో వీరి కోసం మధ్యాహ్నం వరకు ఎదురు చూసిన తల్లిదండ్రులు భీంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సమీప ప్రాంతాలలో గాలించి చివరగా సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో బ్రాహ్మణ కుంటలో చూడగా ముగ్గురు చిన్నా రుల మృత దేహాలు కనిపించాయి. వెంటనే పోలీసులు నీటికుంటలో దిగి చిన్నారుల మృతదేహాలను వెలికితీసి పోస్టుమా ర్టం నిమిత్తం మార్చురీకి తరలిం చారు. ఈ ఘటన వడ్డెర బస్తీలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**పిట్లం బొల్లపల్లిలో మంజీర నదిలో మునిగి ముగ్గురి మృతి**

కాగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొల్లపల్లి వద్ద మంజీరా నదిలో మునిగి ఒక మహిళ సహా ఇద్దరు చిన్నారులు మరణించారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. బొల్లపల్లికి చెందిన నాలుగు కుటుంబాలు శుభకార్యం నిర్వహించేందుకు బొల్లపల్లి బ్రిడ్జి వద్దకు వచ్చాయి . అందరు కలిసి భోజనం చేశాక కొందరు సరదాగా అక్కడే ప్రవహిస్తున్న మంజీర నదిలో దిగారు. అయితే వీరు దిగినచోట లోతు ఎక్కువగా వుండడంతో ఆరుగురు మునిగిపోయారు. వీరిలో ముగ్గురిని కాపడగా మరో ముగ్గురు నీటిలో మునిగి మరణించారు. మరణించి వారిలో పర్మాల గ్రామానికి చెందిన అనిత (35), శివాని (13), తుపాకుల పవనశ్రీ (15) వున్నారు. కాగా నీటిలో మునిగి రక్షించబడ్డ భాను ప్రసాద్ (15) ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముగ్గురి మృతదేహాలను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పిట్లం పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

### సిఎం బందోబస్తుకు వెళ్లి తిరిగొస్తూ

# పిడుగుపాటుకు గురై ఎఆర్ కానిస్టేబుల్ మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త:** ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి వద్ద పిడుగుపాటుకు గురై సీఎం బందోబస్తు విధులు ముగించుకొని తిరిగి వస్తుండగా మద్దమల్ల రాజు(35) అనే ఎఆర్ కానిస్టేబుల్ శుక్రవారం మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉల్పర గ్రామానికి చెందిన మద్దమల్ల రాజు 2014 బ్యాచ్ ఏఆర్ కానిస్టేబుల్ గా ఎంపికై నాగర్ కర్నూల్ ఆర్మ్‌డ్ రిజర్వులో విధులు నిర్వర్తిస్తున్నారు. గత 2 రోజులుగా సీఎం బందోబస్తు నిమిత్తం సోమ శిలలో విధులు నిర్వర్తిస్తు న్నారు. శుక్రవారం సాయంత్రం సీఎం బందోబస్తు విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా మామిళ్ళపల్లి గ్రామ సమీపంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఉప్పునుంతల పోలీసులు మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజుకు భార్యతో పాటు ఐదేళ్లలోపు ఇద్దరు సంతానం ఉన్నారు. ఎఆర్ కానిస్టేబుల్ రాజు మృతి పట్ల నాగర్‌కర్నూల్ ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రాజు కుటుంబాన్ని పోలీసు శాఖ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.



ఎఆర్ కానిస్టేబుల్ రాజు (ఫైల్)

# ప్రశాంతంగా ప్రారంభమైన ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### మొదటిరోజు పరీక్షలకు 76.92 శాతం హాజరు

### ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె.లింగయ్య

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** శుక్రవారం నుంచి రాష్ట్రంలో 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొ దట రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు పరీక్షలకు 76.82 మంది హాజరైనట్టు తెలిపారు. ఈ నెల 12 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. మొదటి రోజు జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 76,82 శాతం హాజరయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 93 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన పరీక్షకు 6086 మంది హాజరు కావల్సి ఉండగా, వారిలో 4,675 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరగనున్నాయి. నేడు(జూన్7) సెకండ్ లాంగ్వేజ్, ఈ నెల 7న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లిష్), ఈ నెల 8న గణితం, ఈ నెల 9న సైన్స్ పార్ట్-1 (ఫిజికల్ సైన్స్), ఈ నెల 10న సైన్స్ పార్ట్-2 (బయాలాజికల్ సైన్స్), ఈ నెల 11న సోషల్ స్టడీస్, ఈ నెల 12న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాం గ్వేజ్ పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు పరీక్షల్లో ఒక్క మాల్‌ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని లింగయ్య తెలిపారు.

# గాదె ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్

### చంచల్‌గూడ జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** జాతీయ దర్యాప్తు సంస్థ నమోదు చేసిన ఉపా కేసులో అరెస్ట యి చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ హక్కుల సంఘం (టిపిఎఫ్) నేత గాదె ఇన్నయ్యకు నాంపల్లి కోర్టు శుక్రవారం రెండు నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జనగాంలో ఒక ఆశ్రమం నిర్వహిస్తున్న ఇన్నయ్య ఎన్ఐఎ నమోదు చేసిన కేసులో మూడు నెలలకుపైగా చంచల్‌గూడ జైల్లో వుండడం తెలిసిందే. అయితే అనారోగ్య కారణాలతో ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచా రించిన నాంపల్లి కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఇన్నయ్యను చంచల్‌గూడ జైలు అధికారులు మధ్యాహ్నం విడుదల చేశారు. మధ్యంతర బెయిల్ గడువు ముగిసిన తరువాత ఆయన జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది.

# పిసిబికి తెలంగాణ బిసి కమిషన్ లేఖ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) కార్యదర్శికి తెలంగాణ బీసీ కమిషన్ లేఖ రాసింది. తెలం గాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సహాయ శాస్త్రవేత్త (ఎన లిస్ట్ గ్రేడ్-2) ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమి షన్(టిజిపిఎస్‌సి) విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, బీసీలకు అన్యాయం జరుగుతుందని కొంతమంది అభ్యర్థులు బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులను కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బీసీ కమిషన్ తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిని సమస్యపై వారం రోజులలో సవివరమైన నివేదిక అందజేయాలని కోరుతూ లేఖ రాసినట్టు కమిషన్ ప్రకటించింది.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.15/2026-27/CE(GVMC)/SE(W-II)/EE (PW-MDW)/DB, dt. 03-06-2026

Number of works : 01 Work, Value of work: Rs.3,38,90,269.00

Starting Date : Dt.04-06-2026, Ending Date: 19-06-2026.

Note: Further details at http://www.tender.apeprocurement.gov.in

O/o. the EE(PW-MDW) Cell No. 99480 95518 For Commissioner

బంగారం వేలం నోటీసు

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు,
అకుర్ది, పూణె 411035

BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలుకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసి గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది:

1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు); 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి; 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి, 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి.

వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-07-26) అర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా: PB56SGL20100804, 21677192. బాన్సువాడ - బస్ స్టాండ్: PCV9SGL20731694, 22727826, 23580682. భద్రాచలం - ఆర్టీసీ బస్ స్టాండ్: PEK5SGL23144269. భైంసా - నిర్మల్ రోడ్: PPA4SGL19085374, 19139821, 19424163, 20096636, 20485787, 20499253, 21837509, 21827442, 22791375, 22956865, 23007363, 23540198. భూపాలపల్లి - మైన్ రోడ్: PCW2SGL18487731, 19138437, 19321008, 21605408, 21810404, 21779372, 22990988. గద్వాల్ - రాజీవ్ మార్గ్: PCW4SGL18870272, 19444044, 20931572, 20902565, 20944043, 22231369. (13-07-26) గజ్వేల్ - పిడ్చేడ్: PEJ6SGL17110274, 20680133, 20863015, 20961555, 20963578, 20965422, 20967100, 21410722, 22414843. గోదావరిఖని - కళ్యాణ్ నగర్: PEK6SGL18977538, 20678605. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్: PGC7SGL19293904, 21139106, 22061724, 22953573. హుజూరాబాద్ - వరంగల్ రోడ్: PJH1SGL18858697, 20924221. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్: PGM7SGL23140722. కామారెడ్డి - నిజాంసాగర్ రోడ్: PB6QSGL20395378, 23001873, 22957980, 23399176. కామారెడ్డి - విద్యా నగర్: PKQ4SGL22959307, 23451121. (14-07-26) కరీంనగర్ - సీవీఆర్ఎన్ రోడ్: PCW8SGL18544742, 19653242, 20118747, 20931284, 22222797. కాజీపేట్ - మెయిన్ రోడ్: POH7SGL21787147. ఖమ్మం - గాంధీ చౌక్: PB54SGL18642627, 19477461, 23002105. ఖమ్మం - జమ్మిబండ రోడ్: PGG1SGL17284351, 22245226, 23557352. ఖమ్మం - ఖానాపురం హవేలీ: POH9SGL22957601. కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్: PJV4SGL20393670. (15-07-26) కోరుట్ల - బీజీఎల్: PNU4SGL19585446, 22764449. కోస్గి - శివాజీ చౌక్: PJH6SGL18561936, 19318059, 20505946, 22952215. మహబూబ్ నగర్ - జడ్చెర్ల: POI2SGL18399767, 18924914, 21451064. మూల్ - బస్ స్టాండ్: PKL9SGL19795119, 22001580. మంచేరియల్ - హైదరాబాద్ రోడ్: PCW9SGL18937062, 21596842. మణుగూరు - అశోక్ నగర్: PCX1SGL18815745. మెదక్ - టిఎల్ బ్రాహ్మణ్ స్ట్రీట్: PCX2SGL21432842. (16-07-26) మెట్‌పల్లి - మైన్ రోడ్: PEF7SGL20483549, 21116313, 23213261, 23378782. మిర్యాలగూడ - బీజీఎల్: PNT9SGL18493847, 20876067, 23169807, 23197721. ములుగు - గాంధీ చౌక్: PJV5SGL18497930, 18815791, 21089493, 21453044, 23611831. నల్గొండ - ఆర్పీ రోడ్: PNT8SGL16895281. నారాయణపేట్ - సర్వీ రెడ్డి చౌరాస్తా: PJH5SGL20528938, 21384582, 21783758, 22016592, 22982802. నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్: PCX3SGL19815300, 22942198, 23026040. నిర్మల్ - గోరా కాంప్లెక్స్: PCX4SGL21445672, 22237802. (17-07-26) నిజామాబాద్ - కపిలా హోటల్ రోడ్: PB94SGL17309506, 19416414, 21412110, 23591621. నిజామాబాద్ - వినాయక నగర్: PCX5SGL18545260, 18589986, 20542987. పరిగి - బహార్ పేట్: PMK2SGL18393775. పర్కల్ - బస్ స్టాండ్: PJG8SGL19466527, 20476576, 20714936, 23364271, 23365597. పట్టన్‌చెరు - బీజీఎల్: PNY4SGL18870554, 19589904, 20711994, 20907179, 20911046. పెద్దపల్లి - సుభాష్ నగర్: PEO3SGL20166957, 20930860, 21658257, 22242382, 23573359. సదాశివపేట్ - రావయ్య నగర్: PCX6SGL18861141. (20-07-26): సహద్‌నగర్ - వెంకటేశ్వర కాలనీ: PCX7SGL23175330. సంగారెడ్డి - బీజీఎల్: P4D3SGL15698395, 18627641, 19285693, 21865091, 23141415, 23205640. సత్తుపల్లి - సూపర్ మార్కెట్: PCX8SGL18550124, 19668579, 19857390, 22009518, 23343483. శంశాబాద్ - బీజీఎల్: POA8SGL15797284, 20726960, 21377794, 23348584, 23591983. సిద్దిపేట్ - మెదక్ రోడ్: PGM8SGL18484313, 20524331, 20536612, 20905956, 21492107, 21784300, 23571550. సిరిసిల్లా - మెయిన్ రోడ్: PB66SGL19498286, 19611647, 19745881, 19758480, 19745171, 20166156, 22208332, 23004939. సూర్యాపేట్ - గాంధీ విగ్రహం: PJG4SGL18467648, 18557966, 18553427, 19430799, 19829205, 20367170, 20493121, 20687498, 20729447, 20901220, 21436366, 23211785, 23350394. (21-07-26) తాండూర్ - ఇందిరా చౌక్: PDA6SGL19595111, 20701096, 21054611, 21393732, 21641886, 23632269, 23594240. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్: PJT5SGL19282866, 20567183. వనపర్తి - రాజీవ్ చౌక్: PCX9SGL20519945, 20721953, 21148003, 22211040, 23556416. వరంగల్ - స్టేషన్ రోడ్: PO4ISGL20517355, 20876588. యెల్లందు - బుగ్గవాగు: PGC4SGL18379073, 19449581, 19803844, 23420948. జహీరాబాద్ - ఆర్టీసీ బస్ స్టాండ్: PER4SGL23377371.


బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

పరుగెత్తేవారు వెనక్కి చూడకుండా ఎలా పరుగెడతారో, విజయం వైపు పయనించేవారు కూడా ముందుకే కానీ వెనక్కి చూడకూడదు.

- దిబ్రేలి


# 'వెట్టి'కి సుంకమే ప్రాయశ్చిత్తమా!

ఉన్నట్టుండి శ్వేతసౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్‌కు వెట్టి చాకిరీ మీద కరుణరసం పుట్టుకొచ్చింది. 'వెట్టి' అనాదిగా ఉన్నా రానురాను ప్రపంచం అధునాతన రూపం సంతరించుకుంటున్న కొద్దీ వెట్టిచాకిరి ఏ రూపంలో ఉన్నా దాని అసలు రూపాన్ని మార్చుకుం టోంది. ట్రంప్ ఏ సందర్భంలో ఇలాంటి ప్రస్తావనలు తెచ్చినా హాస్యాస్పదంగానే ఉంటాయి. బానిసత్వం గురించి అమెరికాలో పాతతరం వారు ఎన్నో విషయాలు చెబుతారు. అక్కడ బానిసత్వం ఏ స్థాయిలో ఉండేదో'రూట్స్' పుస్తకం చదివితే తెలుస్తుంది. బానిస శృంఖలాలలో ఎవరెలా మగ్గిపోయారో స్పష్టం చేసిన పుస్తకమది. ఏడు తరాల బాధామయ కథ అది. భారత్‌తో మధ్యంతర వాణిజ్య ఒపనపందాలు ఓ కొలిక్కి రానప్పుడల్లా ఔరంగజేబు విధించిన 'జిజియా' పన్ను వంటి కొత్త ఆలోచనలు చేయడం ట్రంప్‌కు అలవాటుగా మారింది. ఈసారి ఆయన మదిలో భారత్ వంటి 54 దేశాలపై 12.5 శాతం అదనపు టారిఫ్ విధించడానికి సిద్ధపడ్డారు. దానికి కారణం బహు విచిత్రంగా ఉంది. వెట్టిచాకిరీతో కార్మికుడు తయారు చేసిన వస్తువులను తమ దేశానికి సరఫరా చేసిన నేరానికన్నట్లు వినడానికే విచిత్రంగా అనిపిస్తోంది. విశేషమేమిటంటే ఇదే ఆరోపణలపై అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించి జరుగుతున్న ఆందోళనలపై భారత్ తదితర 60 దేశాలపై మొన్న మార్చి 11న యుఎస్‌టిఆర్ (అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం) ప్రారంభించింది. ఆ విచారణ పర్యవసానంగా వెల్లడైన వివరాలను కూడా అమెరికా వెల్లడించింది. భారత్‌తోపాటు చైనా,జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఇజ్రాయెల్, ఖతార్, రష్యా, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక తదితర దేశాలపై 'వెట్టి చాకిరి' బాపతు ఆరోపణలపై యూఎస్‌టిఆర్ రాయబారి జెమీసన్ గ్రీన్ పలు అంశాలను ఏకరువుపెడుతూ కొన్ని రకాలు సుంకాలను విధించాలని సూచించింది. ఆమేరకు 54 దేశాలపై 12.5 శాతం, పాకిస్థాన్‌తో సహా ఆరు దేశాలపై 10 శాతం సుంకాలను విధించమని ప్రతిపాదిస్తూనే బ్రెజిల్ దేశంపై కాస్త ఎక్కువే 25శాతం వడ్డించింది. కార్మికుల స్వేదాన్ని ఉపయోగించుకొని ఆయా దేశాల తయారీరంగం బతికేస్తోందని అమెరికా అభ్యంతరం. బలవంతపు శ్రమ శక్తి లేకుండా ఏ దేశమూ తమ తయారీ రంగాన్ని అభివృద్ధి పంచుకుందన్న దాఖలేవీ లేవు. అధునాతన యంత్రాలెన్నో ఉన్నా శ్రామిక శక్తి వంతు పాత్ర దానికీ ఉంటుంది. యంత్రాలలో పని చేయించారన్న మిషతో దాని మీద, రేపెపుడో కృత్రిమ మేధలో చేశారని వాటి మీద, సుంకాలు విధించడం, ఇకపై అమెరికాకే చెల్లుతుందేమో! అగ్రరాజ్యం ఇలాంటి చిత్ర విచిత్ర విన్యాసాలకుకారణమవుతూ 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు! అన్న మాదిరి ట్రంప్ వ్యవహరిస్తుంటే నివ్వెరపోవడం తక్కిన ప్రపంచానిది అన్నట్లుంది. భారత్ వంటి దేశం కూడా వేతన, భద్రతా ప్రమాణాలుపాటించట్లేదన్నది అమెరికా పాట. అసలు సిసలు వస్తు కొనుగోలుదారు కేవలం వస్తు నాణ్యత మాత్రమే చూసుకుంటాడు కానీ ఎలా తయారైంది?ఎవరితో తయారు చేయించారు? అనే సందర్భాలపై దృష్టిసారించడు. కానీ ఇక్కడ అమెరికా వ్యవహారం మరోలా ఉంది. పక్క వారు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులు నాణ్యత లేనివనో, నాసిరకంగా ఉన్నాయనో సరుకును తిరస్కరించడం ఓ వాణిజ్య పద్ధతి. అంతేతప్ప వాటి తయారీలో లోపభూయిష్టతను స్పష్టం చేయకుండా ఆరోపణలు చేయడం, సుంకాలు వడ్డించడం అమెరికాకే చెల్లింది. జగతంతా ఇదెక్కడి వాదన? అని ప్రస్తావించుకోవాల్సిన అగత్యమేర్పడింది. ఒకపక్క భారత్‌ను తమకు అత్యంత ప్రధాన భాగస్వామిగా ఉన్నదేశంగా ప్రస్తుతిస్తూనే ఎగుమతి నిబంధనలను ఎవరూ ఉల్లంఘించినా ఒప్పుకోమంటూ నిబంధనల ఉల్లంఘనకు భారత్ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని అమెరికా హుంకరిస్తోంది. భారత ప్రధాని నరేంద్రమోడీ తనకిష్టుడని, ఆయన వల్లే తమకు బోలెడంత ఆదాయం వస్తోందని ట్రంప్ చెప్పడం చూస్తే భారత్ మీద ఆయనకెలాంటి ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఒకపక్క ఇరాన్‌తో యుద్ధ విరమణ ఒప్పందమేమీ ఖరారు కాక సతమతమవుతున్న ట్రంప్ ఆటవిడుపుగా భారత్‌పై సుంకాల విధింపు వంటి చర్యలకు పాల్పడుతున్నారేమో!.ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యలు చేపట్టి మరికొన్ని ఉద్రిక్తతల ద్వారా మరింత పరాభావం పొందకూడదన్న అభిప్రాయంతో అలాంటి చర్యలేమీ వద్దని ట్రంప్‌ను కాంగ్రెస్ ప్రతినిధుల సభ నిలువరించింది. ఈ సందర్భంలో కూడా ట్రంప్ కొందరు సొంత పార్టీ వారి మీద అక్కసు వెళ్లగక్కారు. ఈ సమయంలో తీర్మానమేంటని విరుచుకుపడుతూ, వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడానికే వెనుకాడలేదు. సభలో మెజార్టీ ఉన్నా కొందరు అధికార రిపబ్లిక్ పార్టీ సభ్యులు సైతం అమెరికన్ అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించారు. ఆమేరకు ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోద ముద్రపడింది. నలుగురు రిపబ్లికన్ పార్టీ సభ్యులు తనకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆ తీర్మానం నెగ్గింది తప్ప ప్రత్యేకత ఏమీలేదని ట్రంప్ సరిపెట్టుకున్నారు. దూకుడు స్వభావం తొందరపాటు నిర్ణయాలే తప్ప తనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న వారి మనోగతం తెలుసు కోవడానికి ఏమాత్రం ఆయన ముందుకు రావడం లేదు. ఈ తీర్మానం ఆమోదంతో ఇరాన్‌పై అమెరికా చేసిన యుద్ధానికి ఆమోదం లభించనట్లే. ఈ పరిస్థితు ల్లో అమెరికా తన ప్రేలాపనలన్నీ ఉపసంహరించుకుని తోకముడవడం ఒక్కటే తక్షణ కర్తవ్యం. 'ది వార్ పవర్ యాక్ట్' 1973 ప్రకారం అమెరికా ఏ ఇతర దేశంపైనైనా యుద్ధం ప్రకటిస్తే 60 రోజుల్లోగా ఆమోదం పొందాలి. కానీ ఇప్పుడది వీగిపోయింది కనుక ఇరాన్‌పై అమెరికా యుద్ధం ముగిసినట్లే.



చెడును వేలెత్తిచూపడం కాదు, ఆ స్థానంలో మంచిని ప్రతిష్ఠించటమే అసలైన సంస్కరణ.

జి.ముర్రే



దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

హెచ్. లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



### యోగా చేద్దాం రండి..

మనం 2026లో జీవిస్తున్నాము. అత్యంత ఆధునిక జీవితాన్ని ప్రపంచ ప్రజలు అనుభవిస్తున్నారు. కానీ మనం మాత్రం మన ఆలోచనలు చేష్టలు వెనక్కి వెనక్కి పోతున్నట్లుగా ఉంది. పూర్వకాలంలో మన కథలలో చెప్పుకునే ఋషులుమునులు, గోచీలుపెట్టుకొని, కమండలం చేతపట్టి అడవులకు వెళ్ళితపస్సు,ద్యానం చేసుకునేవారు. అలాంటిదేయోగా. పతంజలి క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల క్రితం యోగాను ప్రతిపాదించాడు. మొదటిలోనే చెప్పుకున్నాడు. యోగా అనేది ఈ జీవాత్మను పరమాత్మలో లీనం అయ్యేందుకుదగ్గరి మార్గంయోగాఅని. జీవాత్మ పరమాత్మలో కలవడంఅంటే చనిపోవడం. మరి అలాంటి యోగాను బీజేపీ వారు ప్రచారం చేస్తున్నారు. యోగా చేసే క్రమంలో మెదడుకు ఆక్సిజన్ శాతంతగ్గి, కార్బన్ డయాక్సైడ్ శాతంపెరిగి ఇలాంటి భ్రమలు వస్తాయని తెలియక ఇవన్నీ తన యోగవలనే వస్తాయని తన యోగా శాస్త్రంలో రాసుకున్నందున , అది చదివిన వారు యోగ వలన ఈ శక్తులు వస్తాయని భ్రమించి ప్రచారం చేస్తున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రవర్తన నియమావళి పాటించాలి

ఇటీవల దిగ్భ్రాంతి కలిగిస్తున్న రోడ్ ప్రమాదాల్లో ఆర్‌టిసికి చెందినవి కొంత తక్కువే అని చెప్పొచ్చు. డ్రైవర్ విధులు తన ఆరోగ్యం, కంటిచూపుతోపాటు ఎంతో ఏకాగ్రత, ముందుచూపుతోఉంటాయి. ప్రత్యేక అవసరమైనది కొంత నియమిత దూరం, కాలంతర్వాత అదనపు డ్రైవర్ అందుబాటు, సిబ్బంది కొరతఉన్నా, రాబోయే సమయం, పొరపాటు అనూహ్యమైనది. వీటి దృష్ట్యా సిబ్బందికి వైద్య పరీక్షలు కార్పొరేషన్ స్వయంగా చేసేది మంచి విధానం. దానితో పాటు ఇతర నియమాలు, ట్రాఫిక్ అధికారులు ప్రతీనెలతనిఖీ చేస్తే దుస్సంఘటనల నివారణ సాధ్యమే. ఉద్యోగులు వారి ప్రవర్తన నియమావళి పాటించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### భక్తులకు వసతులు కల్పించాలి

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో నిరంతరం దేవాలయ సందర్శనానికి విచ్చేసే భక్తులకు సరైన వసతులు అయినటువంటి నీరు, పరిశుభ్రత లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి భక్తులకు సరైన వసతులు కల్పించి భక్తుల సమస్యలను పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అగ్నికి అలసత్వమే ఆజ్యం

ఢిల్లీలో ఒకహోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించి, 21 మంది ప్రాణాలు కోల్పోవడం, మరికొంత మంది తీవ్ర గాయాలు పాలవ్వడంశోచనీయం. అగ్నిప్రమాదానికి కారణాలు ఏవైనా, ఇంత స్థాయిలో ప్రాణ నష్టం జరగడం, అదీ దేశ రాజధాని నడిబొడ్డున జరగడం ఆక్షేపణీయం. అధికార గణం అవసరమైన నిబంధనల్నివాణిజ్య సముదాయాలు పాటించేలా చూడకపోవడం వల్లనే ఇలా మాటిమాటికీ ప్రమాదాలు, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి. కాబట్టినేరంలో అధికభాగం వాటా వారిదే. ఆ 21 మందిలో విదేశీయులు కూడా ఉన్నట్లు, వారు చికిత్సనిమిత్తమై వచ్చినట్లువార్తలు చెబుతున్నాయి. భారత్‌లో నాణ్యమైన వైద్యం చవకగా దొరుకుతుందని ఆశించి వచ్చిన వాళ్ళు ఇలా అగ్నికి ఆహుతికావడం మాటల్లో చెప్పలేని విషాదం. సదరు హోటల్‌కిరాకపోకలకు ఒకటేదారి. ప్రవేశమైనా, బయటకుపోవడమైనా ఆ ఒక్క ద్వారమే గతి. ఎలాంటి అనుమతులూ లేకుండా నడుస్తున్నట్లు అధికారులిప్పుడు చెప్తున్నారు. ఈఅంతర్జాల యుగంలో, దేశానికేరాజధానిలో అంత కష్టమా?తెలిసిన తర్వాతనైనా చర్యలు తీసుకోవాలి కదా!

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### మనవతా విలువలు గొప్పవి

ఆప్తులు అర్థాంతరంగా మరణిస్తే రాజకీయాలకు స్వస్తి పలికిన వారు, పదవులను తృణప్రాయంగా భావించి వాటిని వదులుకున్నవారు చాలా తక్కువగా ఉంటారు. కానీ వారి వారసులమంటూ రాజకీయాల్లోకి వస్తున్న వారు ఎక్కువ. ఇలాంటి వారు ఎన్నికల్లో పోటీ చేస్తూ, గెలిచిన మూడో రోజు మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న వారు, పదవుల కోసం అధికారం కోసం ఆప్తులైన వారికి వెన్నుపోటు పొడుస్తున్నవారు కోకొల్లలుగా ఉంటున్నారు. అయితే ధనం, పదవులు, అధికారం కన్నా మానవతా విలువలు గొప్పవి. పదవులు ఈ రోజు ఉంటాయి, రేపు పోతాయి. కనుక పదవుల కోసం ఆరాటపడేవారు ప్రజలను ఎక్కువ పట్టించుకోరనే భావన ప్రజల్లో ఉంది. దీనిని రూపుమాపాలి.

- శాస్త్రి, హైదరాబాద్

### పెండింగ్ కేసులను పరిష్కరించాలి

తెలంగాణా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లోన్యాయం జరుగుతుంది అని భావించిన ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణం గురించి దరఖాస్తు చేసి సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నారు. రెవిన్యూ అధికారులు భూమి రికార్డుల్లే అని తపిస్తున్నారు. పోలీసులు కూడా ఏం న్యాయం చేయడం లేదు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# బలిపీఠంపై విద్యార్థి లోకం!

**తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజుల రూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సుకు ఎక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక, ఇటు బోధన చేస్తున్న అధ్యాపకులతో మనస్సు విప్పి తమ బాధను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. అయితే కొందరు అధ్యాపకులు కొన్ని సందర్భాల్లో విద్యార్థుల ఒత్తిడి, ఇబ్బందులు అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా పాలకులు ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగా మేధావులు అడుగులు వేయాలి. విద్యార్థి లోకాన్ని ఈ బలవంతపు చావుల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది.**

దామెర్ల సాయిబాబ

మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచేవారు మహర్షి అన్నారు. మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనస్సును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అలుముకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు బలైపోతున్నారు. దీనికితోడు పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు ప్రధానంగా అధికార గణం అసమర్థత, అలక్ష్యం,అవినీతి తదితర కారణాలు ఎన్నో విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఏదో కిందిస్థాయిలో పరీక్షల నిర్వహణ కాదు కీలకమైన, విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే, 'నీట్, సిబిఎస్‌ఇ' లాంటి పరీక్షలు కూడా సమర్థవంతంగా నిర్వహించలేకపోవడం దురదృష్టకరం. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. పాలకుల చేతగాని తనానికి నిర్లక్ష్యానికి, అసమర్థతకు విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావిభారత పౌరులను చూసి దేశం నివ్వెరపోతున్నది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏటా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుండడం సర్వత్రా ఆవేదన, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రుల ఆశల, ఆకాంక్షలను నెరవేరుస్తూ కుటుంబాల్లో కాంతులు వెదజల్లి భవిష్యత్‌లో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆరిపోతున్నాయి. కని, పెంచిన వారిఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడి తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనేది కాదనలేని వాస్తవం. మొన్న 'నీట్' పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవలు పరాకాష్ఠగా చెప్పొచ్చు. ఒక్కసారి పరీక్షలు రాసి ఊపిరిపీల్చుకొని సెలవుల్లో బంధుమిత్రులతో గడిపేందుకు వెళ్లిన విద్యార్థులకు మళ్లీ పరీక్షలు రాయడమనేది ఎంత కష్టమో, మరెంత ఒత్తిడికి గురవుతారో మాటల్లో వర్ణించలేం. గత నెల మూడో తేదిన జరిగిన నీట్ పరీక్షలను రద్దుచేసి మళ్లీ ఆ పరీక్షను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు పాలకులు ప్రకటించారు. దీంతో మళ్లీ పరీక్ష రాయాలనే ఒత్తిడి పెరిగి మధ్యప్రదేశ్‌కు చెందిన నీట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం అందరిని కదిలించి వేస్తున్నది. కేవలం కుమార్తె ఆకాంక్ష చతుర్వేదిని డాక్టర్‌ను చేయాలనే లక్ష్యంతో వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే ఆ కుటుంబం నాగపూర్ చేరుకొని కోచింగ్ ఇప్పించారు. వంటవాడిగా మారి సంపాదించిన డబ్బు సరిపోకపోవడంతోమరో మూడు లక్షలరూపాయలకు పైగా అప్పులు చేశాడు. గత నెలలో జరిగిన నీట్ పరీక్షల్లో బాగా రాసానని, ఎక్కడో దగ్గర మెడికల్ సీటు వస్తుందని కుమార్తె చెప్పడంతో ఆ కుటుంబం ఎంతో సంతోషపడింది. ఈ తరుణంలో నీట్ పరీక్షాపత్రాలు లీక్ కావడంతో రద్దు చేయడం మళ్లీ పరీక్షలు పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిస్పృహకు గురైన ఆకాంక్ష తనకు మళ్లీ పరీక్షలు రాసే శక్తి లేదని, కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చలేకపోతున్నాననిఅందుకు క్షమించాలని తల్లిదండ్రులను కోరుతూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకొంది. ఇక పోతే ప్రతిష్ఠాకరమైన సిబిఎస్‌ఇలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు కొంతకాలంగా వినిపిస్తున్నా అంతగా పట్టించుకోలేదు. ఈ అవకతవకలపై

### ఒక్క మాట

ఆన్‌లైన్ మూల్యాంకన సేవలు అందించే సంస్థ ఎంపికలో చోటు చేసుకున్న అక్రమాలపై బాధితుడైన ఒక విద్యార్థి పార్లమెంట్ స్థాయీ కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ సంస్థ ఛైర్మన్, కార్యదర్శులపై బదలీవేటు వేసి కొత్తవారిని నియమించింది. సిబిఎస్‌సి వ్యవహారాలపై కూడా నీలి నీడలు కమ్ముకొంటున్నాయి. ఉన్నత స్థాయిలో పరీక్షలేకాదు దేశంలో పరీక్షలు నిర్వహణ ఒక మిథ్యగా మారిపోతున్నది. ఏది ఏమైనా దేశంలో రానురాను విద్యార్థుల ఆత్మహత్యలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. శుక్రవారం నాడు కూడా ఇంటర్మీడియేట్ సెకండియర్ విద్యార్థి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కాలేజీలో ఆత్మహత్య చేసుకున్నాడు. జాతీయ నేర గణాంకాల విభాగం (ఎన్‌సీఆర్‌సీ) లెక్కల ప్రకారమే 2023లో దేశవ్యాప్తంగా పదమూడువేల ఎనిమిది వందల తొంభై మందికిపైగా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. భారత్‌లో 1995-2019 మధ్యకాలంలో వివిధ కారణాలతో లక్షాడెబ్బైవేల మందికిపైగా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ప్రతిగంటకు సగటున ఒక విద్యార్థి మరణానికి పాల్పడుతున్నాడని గతంలో ఎన్‌సీఆర్‌బి పార్లమెంటుకు నివేదించింది. పోనీ పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై పోటీ పరీక్షల్లో ర్యాంకులు సంపాదించి ఐఐటీల్లో సీట్లు పొందిన వారు సైతం ఈ చదువుల ఒత్తిడికి బలైపోతున్నారు. ప్రతిష్ఠాకరమైన ఐఐటీ, మెడిసిన్ సీట్లు వచ్చాయని ఆనందంగా చేరుతున్న విద్యార్థులు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. కారణాలు పాలకులకు తెలియనివి కావు. ప్రాచీన భారత విద్యావిధానంలో కళలకు చక్కని స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. మారుతున్న కాల,మాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వపరంగా విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. విధానాలు, ఆలోచనలు ఎన్నో ఉన్నాయి. కానీ అమలుకు నోచుకోవడంలేదు. ఫలితంగా ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క పిల్లల చదువులకై తల్లిదండ్రులలో ఆరాటం, ఆసక్తి అంతకంతకు పెరిగిపోతున్నది. వారిని చదివించుకోవడం ఒక్కటే జీవిత లక్ష్యంగా మారి అందుకోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సిందే. పిల్లల చదువుల కోసం పుట్టి పెరిగిన ఊరును వదిలి కడుపు చేతపట్టుకొని పట్టణాలకు, నగరాలకు వలసవచ్చి చిన్నచితక ఉపాధితో జీవనం సాగిస్తున్నారు. వచ్చే కొద్దిపాటి జీతంతో అర్థాకలినైనా భరిస్తూ పొదుపు చేసి ఫీజులు కడుతున్నారు. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చదువుకుంటేనే తాము కోరుకున్న కాలేజీల్లో కావాల్సిన కోర్సులో సీటు దొరుకుతుందనే ప్రచారం పెరిగిపోయింది. ఇంజినీరింగ్, ఐఐటి, మెడికల్లాంటి ప్రొఫెషనల్ విద్యను అభ్యసించే పిల్లలకు వెంటనే ఉద్యోగం దొరకడం, లేక విదేశాల్లో జీవనోపాధి లభించడం చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా అలాంటి జీవన సుఖం అందాలని ఆరాటపడుతున్నారు. ఈ బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి కొన్ని కార్పొరేట్ కాలేజీలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉంది. ఇక పిల్లలపై పడుతున్న ఒత్తిడి అంతా ఇంతాకాదు. ఆటపాటలు లేవు. మరో ధ్యాసా వ్యాపకానికి అవకాశం లేకుండా చదివే లక్ష్యంగా రాత్రింబవళ్లు వారిపై ఒత్తిడి పెంచి చదివిస్తున్నారు. అటు మానసిక ఒత్తిడిని భరించలేక ఇటు తల్లిదండ్రులను ఒప్పించలేక తమలో తాము నలిగి నలిగి విపరీతమైన టెన్షన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తాము ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సివచ్చిందో స్పష్టంగాలేఖలు రాసి తనువు చాలిస్తున్నారు. తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజులరూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సుకు ఎక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక, ఇటు బోధన చేస్తున్న అధ్యాపకులతో మనస్సు విప్పి తమ బాధను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు.అయితే కొందరు అధ్యాపకులు కొన్ని సందర్భాల్లో విద్యార్థుల ఒత్తిడి, ఇబ్బందులు అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు.ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా పాలకులు ఆలోచించాలి.స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగా మేధావులు అడుగులు వేయాలి.విద్యార్థిలోకాన్ని ఈ బలవంతపు చావుల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ●

# రైతు డిస్కంతో మెరుగైన వ్యవ'సాయం'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగం ఎన్నో దశాబ్దాలుగా అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. రైతు శ్రమతో దేశానికి అన్నం అందుతున్నప్పటికీ, అతని జీవితంలో స్థిరత్వం మాత్రం ఇప్పటికీ కలగలేదనే వాస్తవం మన ముందుంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పలు సంస్కరణలు చేపడుతున్నాయి. ఆ క్రమంలో 'రైతు డిస్కం'ఏర్పాటు అనే ప్రతిపాదన ఇప్పుడు చర్చనీయాంశమైంది. విద్యుత్ సరఫరా వ్యవస్థను రైతు అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో తీసుకొస్తున్న ఈ ఆలోచన వ్యవసాయ రంగానికి ఎంతవరకు మేలు చేస్తుందన్నది విశ్లేషణీయ అంశం. ప్రస్తుతం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అనేది సాధారణ డిస్కంల పరిధిలోనే కొనసాగుతోంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్రాల్లో డిస్కంలపై భారీ ఆర్థిక భారం పడుతోంది. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందకపోవడం, లో వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ దెబ్బతినడం, పంట కాలంలో సరైన సమయానికి విద్యుత్ అందకపోవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ అవసరాలను ప్రత్యేకంగా చూసుకునే విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేయాలనే ఆలోచన ముందుకు వచ్చింది. రైతు డిస్కం ఏర్పాటుతో వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ పంపిణీ వ్యవస్థరూపొందే అవకాశం ఉంది. దీని ద్వారా వ్యవసాయ అవసరాలను ప్రాధాన్యంగా తీసుకొని సరఫరా నిర్వహణ జరగవచ్చు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పంపింగ్ సెట్లకు తగిన వోల్టేజ్ అందుబాటులో ఉంచడం, విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి ప్రయోజనాలు కలగవచ్చు. ముఖ్యంగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగాన్ని పునరుత్పాదక ఇంధనాల వైపు మళ్లించే అవకాశమూ ఉంది. అయితే రైతు డిస్కం ఏర్పాటు అంత సులభమైన ప్రక్రియ కాదు. ప్రత్యేక సంస్థ ఏర్పాటు అంటే అదనపు పరిపాలనా వ్యయం, కొత్త మౌలిక వసతులు, సిబ్బంది నియామ



కాలు, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధి వంటి అంశాలు అవసరం అవుతాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థల పరిస్థితిలో కొత్త డిస్కం ఏర్పాటు ఆర్థికంగా ఎంత వరకు సాధ్యమన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ అందించే రాష్ట్రాల్లో ప్రభుత్వ బకాయిలు పెరుగుతున్న తరుణంలో రైతు డిస్కం ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సమగ్ర ప్రణాళిక అవసరం. ఇంకో ముఖ్యమైన అంశం విద్యుత్ వినియోగ నియంత్రణ. వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ కారణంగా నీటి వనరుల అధిక వినియోగం జరుగుతోందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. భూగర్భ జలాలు క్షీణిస్తున్న పరిస్థితుల్లో విద్యుత్ వినియోగాన్ని శాస్త్రీయంగా నియంత్రించడం కూడా అవసరమే. రైతు డిస్కం ఈవిషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్మార్ట్ మీటరింగ్, సమయపాలిత సరఫరా, సౌర పంపుల వినియోగం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాల ప్రయోజనాలు కలగవచ్చు. అయితే ఏ సంస్కరణైనా రైతు ప్రయోజనాలను కేంద్రంగా ఉంచుకుని అమలు కావాలి. రైతు డిస్కంపేరుతో భవిష్యత్తులో ఉచిత విద్యుత్ విధానాన్ని క్రమంగా ఉపసంహరించుకునే ప్రయత్నాలు జరగకూడదు. విద్యుత్ ఛార్జీల భారం రైతులపై మోపే పరిస్థితి రాకూడదు. ఇప్పటికే వ్యవసాయం లాభసాటిగా లేక ఇబ్బందులుపడుతున్న రైతుకు అదనపుభారం మోపితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. రైతు డిస్కం విజయవంతం కావాలంటే కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. మొదట విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచాలి. సౌర విద్యుత్ ఆధారిత వ్యవసాయ విధానాలను విస్తరించాలి. రైతుసంఘాలు, నిపుణులు, విద్యుత్ రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి పారదర్శక విధానాలు రూపొందించాలి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీల విషయంలో స్పష్టతఉండాలి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను రక్షించే విధంగా విధానాలు ఉండాలి. వ్యవసాయ రంగం దేశ భవిష్యత్తుకు ఆధారం. రైతు సంక్షేమం లేకుండా ఆర్థికాభివృద్ధి అసంపూర్ణమే. కాబట్టి రైతు డిస్కం ఏర్పాటు కేవలం పరిపాలనా మార్పుగా కాకుండా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే సంస్కరణగా మారాలి. దీనికి రాజకీయ సంకల్పం, ఆర్థిక ప్రణాళిక, సాంకేతిక సామర్థ్యం, ముఖ్యంగా రైతుల విశ్వాసం అవసరం. రైతు కేంద్రంగా ఆలోచిస్తే రైతు డిస్కం వ్యవసాయ రంగానికి నూతన దిశా నిర్దేశం కావచ్చు. ●

# దేశ ఆర్థిక స్థిరత్వానికి విదేశీ మారక నిల్వలు

ఇస్కా రాజేష్ బాబు

విదేశీ మారక నిల్వలు అంటే ఒక దేశ కేంద్ర బ్యాంకు వద్ద భద్రపరిచే విదేశీ కరెన్సీలు, బంగారం అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆస్తుల మొత్తం. ఇవి అంతర్జాతీయ వాణిజ్యానికి,దేశ ఆర్థిక స్థిరత్వానికి అత్యంత కీలకం. విదేశీమారక నిల్వల భాగాలు భారతదేశ ఫారెక్స్ నిల్వలు ప్రధానంగా అమెరికన్ డాలర్, యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపనీస్ యెన్ వంటి ప్రధాన విదేశీ కరెన్సీలు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ అకస్మాత్తుగా పడిపోకుండా లేదా హెచ్చు తగ్గులకు గురికాకుండా నిరోధించడానికి డాలర్లను విక్రయించడం ద్వారా ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటుంది. ముడి చమురు, ఇతర అత్యవసర వస్తువులను విదేశాల నుండి దిగుమతి చేసుకునేందుకు చెల్లింపులు చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. ఏదైనా అత్యవసర ఆర్థిక సంక్షోభం లేదా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు బాహ్య రుణాలను తీర్చడానికి ఈ నిల్వలు దేశానికి భరోసానిస్తాయి. భారతదేశ విదేశీ మారక నిల్వలు ఏప్రిల్ 2026లో 551.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి, అంతకు ముందు నెలలో ఇవి 552.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. మిలియన్ల డాలర్ల డేటా నెలవారీగా నవీకరించబడుతుంది. ఇది ఏప్రిల్ 1989 నుండి ఏప్రిల్ 2026 వరకు అందుబాటులో ఉంది. ఈ డేటా సెప్టెంబర్ 2024లో 617.1 బిలియన్ డాలర్ల సర్వకాలిక గరిష్ట స్థాయికి, జూన్ 1991లో 1.1 బిలియన్ డాలర్ల రికార్డు కనిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలవారీ విదేశీ మారక నిల్వలను డాలర్లలో అందిస్తుంది. తాజా నివేదికల ప్రకారం, అక్టోబర్ 2025 నాటికి భారతదేశ విదేశీ మారక నిల్వలు 7.4 నెలల దిగుమతులకు సమానంగా ఉన్నాయి. మార్చి 2026లో దీని ద్రవ్య సరఫరా ఎం 2 గతేడాదితో పోలిస్తే 882.4 బిలియన్ డాలర్లు పెరిగింది. మార్చి 2026నాటికి భారతదేశ దేశీయ రుణం 3,504.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది, ఇది గతేడాదితో పోలిస్తే 14.2 శాతం పెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది 2.8 శాతంగా ఉన్న దేశ నిరర్థక రుణాల నిష్పత్తి, 2025 మార్చిలో 2.2 శాతానికి తగ్గింది. భారత దేశ గృహరుణం మార్చి 2025 నాటికి 17.6 శాతానికి చేరుకుంది.ఇది దేశ నామమాత్రపు జీడీపీలో 17.6 శాతంగా ఉంది. ప్రపంచ దేశాల మాదిరిగానే భారత్ కూడా బంగారాన్ని కీలక రిజర్వ్ ఆస్తిగా కొనసాగిస్తోంది. రిస్క్ మేనేజ్‌మెంట్, రిజర్వ్ డైవర్సిఫికేషన్, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత లక్ష్యంగా భారత విధానాలు కొనసాగుతున్నాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. బ్లూమ్‌బర్గ్ కథనం నేపథ్యంలో వెలువడిన ఊహాగానాలను కేంద్రం ఖండించడంతో మార్కెట్ వర్గాలు మళ్లీ దేశ ఆర్థిక ప్రాథమిక అంశాలపైదృష్టి సారించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం భారత్ బంగారం నిల్వలను విక్రయించలేదని, విదేశీ మారక నిల్వలుబలంగానే ఉన్నాయని అధికారిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్ తన విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి, రూపాయి విలువను నిలబెట్టేందుకు బంగారం నిల్వలను విక్రయించిందంటూ వెలువడిన వార్తలను కేంద్ర ప్రభుత్వంఖండించింది. అంతర్జాతీయ వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ కథనం నేపథ్యంలో మార్కెట్‌లో చర్చకు దారితీసిన ఈ అంశంపై అధికార వర్గాలు స్పష్టత ఇచ్చాయి. దేశ బంగారం నిల్వలను విక్రయించలేదని, అలాంటి వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నాయి. బ్లూమ్‌బర్గ్ ప్రచురించిన కథనంలో భారత్ ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో తన విదేశీ మారక నిల్వలకు మద్దతుగా కొంత బంగారాన్ని విక్రయించి ఉండొచ్చని సూచించడంతో మార్కెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. దీంతో పెట్టుబడిదారులు, ఆర్థిక విశ్లేషకులు, వ్యాపారవర్గాలు భారత ఆర్థిక స్థితిగతులపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారిక వర్గాలు మాత్రం ఈ ప్రచారాన్ని పూర్తిగా కొట్టిపారేశాయి. విదేశీ మారకనిల్వలను రక్షించేందుకు లేదా రూపాయి విలువను నిలబెట్టేందుకు బంగారం విక్రయించిన దాఖలాలు లేవని స్పష్టం చేశాయి. భారత రిజర్వ్ నిర్వహణ వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ స్థాయి ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొనే సామర్థ్యం దేశానికిఉందని పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి కారణాలతో కేంద్ర బ్యాంకుల రిజర్వ్ వ్యూహాలపై దృష్టి పెరిగింది. ఈ క్రమంలో బంగారం నిల్వల తరలింపు, రిజర్వుల పునర్వ్యవస్థీకరణ లేదా అకౌంటింగ్ మార్పులను కొందరు తప్పుగా అర్థం చేసుకుని విక్రయాలుగా భావించి ఉండొచ్చనిఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. అధికారికంగా ధృవీకరించని వార్తల ఆధారంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం స్థిరమైన వృద్ధి,ఎగుమతులు,విదేశాల నుంచి వచ్చేనగదు ప్రవాహాలు, బలమైన బ్యాంకింగ్‌వ్యవస్థతో ముందుకు సాగుతోందని చెబుతున్నారు. విదేశీ మారకనిల్వలు దేశానికి బలమైన రక్షణ కవచంలా పనిచేస్తున్నాయని పేర్కొంటున్నారు. కొన్ని వారాలుగా ఒత్తిడిని ఎదుర్కొన్న భారత విదేశీ మారక నిల్వలు మళ్లీ భారీగాపెరిగాయి. మే 8తో ముగిసిన వారానికి దేశ విదేశీమారక నిల్వలు 6.295 బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ తాజా గణాంకాల్లో వెల్లడించింది. ●

# భారత్‌లో ‘ఎయిర్‌ట్రంక్’ భారీ పెట్టుబడులు



## - 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు
## - రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతోంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 5:** భారత్‌లో ‘ఎయిర్‌ట్రంక్’ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టబోతోంది. సుమారు రూ.3 లక్షల కోట్లు (దాదాపు 30 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టే ప్రణాళికలను ఎయిర్‌ట్రంక్ ప్రకటించింది. 5 గిగావాట్ల (జిడబ్ల్యు) డేటా సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇది భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అతిపెద్ద పెట్టుబడులలో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన డేటా సెంటర్ సంస్థ ఎయిర్‌ట్రంక్ పెట్టిన రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాలలో భారతదేశాన్ని ఒక ప్రపంచ కేంద్రంగా బలోపేతం చేస్తుందని, అదే సమయంలో ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తుందని, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తుందని ప్రధాని మోడీ వివరించారు. భారీ స్థాయిలో ప్రపంచ పెట్టుబడులు దేశంలోకి ప్రవహిస్తుండటంతో భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం బలమైన ఊపందుకుంటోందని అన్నారు. “భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం అద్భుతమైన ఊపందుకుంటోంది. భారతదేశంలో సుమారు రూ.3 లక్షల కోట్లు (30 బిలియన్లు) పెట్టుబడి పెట్టడానికి, 5 గిగావాట్ల (జిడబ్ల్యూ) డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఎయిర్‌ట్రంక్ ప్రణాళికలను ప్రకటించింది“ అని ప్రధాని మోడీ అన్నారు. వివిధ పరిశ్రమలలో క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా స్టోరేజ్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఈ పెట్టుబడి భారతదేశ డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు గణనీయంగా ఊపునిస్తుందని భావిస్తున్నారు. “దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ఎకోసిస్టమ్‌లో ప్రతిపాదించిన అతిపెద్ద పెట్టుబడులలో ఇది ఒకటి“ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేస్తాయని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. ఇలాంటి పెట్టుబడుల పెరుగుదల భారతదేశ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌పై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. విధానపరమైన మద్దతు, ఆవిష్కరణలు, విస్తృత ప్రతిభావంతుల కారణంగా భారతదేశం తదుపరి తరం డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక గమ్యస్థానంగా స్థిరంగా ఎదుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. “ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐకి ప్రపంచ కేంద్రంగా భారతదేశ స్థానాన్ని బలోపేతం చేస్తాయి, అదే సమయంలో ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తాయి. ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయి. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు భారతదేశంలోనే ఎక్కువగా రూపుదిద్దుకుంటోందన్నది స్పష్టం“ అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# ప్రధాని మోడీ మంచి మిత్రుడే..
## అయినా 12.5 శాతం సుంకాలు తప్పవు
# స్పష్టం చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ తనకు మంచి మిత్రుడని చెప్పారు. త్వరలో భారత్, యూఎస్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని కూడా తెలిపారు. భారత్‌లో యూఎస్ వాణిజ్య బృందం పర్యటన పూర్తైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై తుది దశ చర్చల కోసం వచ్చిన యూఎస్ బృందం భారత అధికారులతో నాలుగు రోజుల పాటు కీలక సమావేశాల్లో పాల్గొంది. ఇక భారత వాణిజ్య విధానాలను మాత్రం ట్రంప్ మరోసారి విమర్శించారు. అమెరికా విధానాలతో భారత్ లాభపడిందని చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై మాత్రం భారీగా సుంకాలు విధించేదని అన్నారు. కానీ పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా మారిందని అన్నారు. ఇపుడు భారత్ వల్ల యూఎస్ భారీగా లాభపడుతోందని చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకుఆయన జవాబిస్తూ మోడీ నాకు మంచి మిత్రుడేనని అయితే సుంకాలు మాత్రం కొనసాగుతాయని, 12.5 శాతం తప్పదని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ట్రంప్, మోదీ ఫోన్ కాల్ అనంతరం ఇరు దేశాల మధ్య తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు చేసారు. రష్యా చమురు కొంటున్నందుకు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాన్ని తొలగించడంతో పాటు తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాన్ని 18 శాతానికి తగ్గించేందుకు యూఎస్ అంగీకరించింది. ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు రాజ్యాంగవిరుద్ధమని యూఎస్ సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. ట్రంప్ గతసుంకాల స్థానంలోఅన్ని దేశాలపైనా 10 శాతం సుంకం విధించారు. ఇది 150 రోజుల పాటు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు మరోసారి చర్చలు జరిపాయి. భారత బృందం అమెరికాలో పర్యటించగా తాజాగా అమెరికా బృందం భారత్‌కు వచ్చింది. డీల్ దాదాపు కుదిరినట్టే అని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా చర్చల అనంతరం ప్రకటించారు.

## నాకు 41 యేళ్లు.. మా ఇంట్లో పెళ్లి చేయడం లేదు..



ఉత్తరప్రదేశ్‌లో పోలీసులను ఆశ్రయించిన ఓ మహిళ!

**లక్నో, జూన్ 5:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. 41 ఏళ్ల మహిళ తన పెళ్లి జరగకపోవడానికి కుటుంబ సభ్యులే కారణమంటూ నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. బాధిత మహిళ ఫిర్యాదు ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా తనకు అనేక వివాహ సంబంధాలు వచ్చినప్పటికీ, తన కుటుంబ సభ్యులు వాటిని పదే పదే తిరస్కరించారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన సోదరుడు, వదిన కావాలనే తన పెళ్లిని అడ్డుకున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, పెళ్లి విషయంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా, మానసికంగా కూడా వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఇరు పక్షాలతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన పెళ్లి, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీసింది. ఒక వ్యక్తి వివాహం జరగకపోవడం కేవలం కుటుంబ సమస్యేనా? లేక మానసిక వేధింపులు ఉంటే చట్టపరమైన జోక్యం అవసరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం పోలీసుల ఫిర్యాదుపై విచారణ కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావల్సి ఉంది.

## అసెంబ్లీ ఓటమితో ఢిల్లీ వైపు దృష్టి మళ్లించిన మమత
### లోక్‌సభకు పోటీచేసేందుకు సన్నాహాలు



**కోల్‌కత్తా, జూన్ 5:** రాష్ట్ర మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీఎన్నికల ఓటమి, పార్టీలో తిరుగుబాటు, లోక్‌సభ ఎంపిలుసైతం ప్రత్యేకకూటమిగా ఏర్పాటుకు తిరుగుబాటుచేస్తున్న క్రమంలో దీదీ లోక్‌సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆమె దృష్టి ఇపుడు ఢిల్లీ రాజకీయాలవైపు మళ్లింది. అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది. అటు పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాలనుకుంటున్నారు. ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. అయితే ప్రస్తుతం టీఎంసీ తరఫున ఎంపీగా మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహారాంపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన టీఎంసీ తరఫున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు. ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించారని ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరఫున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసార్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు. కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది ఆసక్తిగా మారింది.

# కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నా!
### వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం: అన్నామలై ప్రకటన
### రాజీనామాను ఆమోదించిన బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్



**చెన్నై, జూన్ 5:** తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై శుక్రవారం భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, యువతపై దృష్టి సారించే ‘వి ది లీడర్స్‘ అనే కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం భవిష్యత్తులో రాజకీయ పార్టీగా రూపాంతరం చెందుతుందని, తదుపరి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. తనను ప్రజా జీవితంలోకి ఆకర్షించిన లక్ష్యాన్ని కొనసాగించాలనే కోరికతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నామలై పేర్కొన్నారు. తమిళనాడులో సానుకూల మార్పు తీసుకురావడానికి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తాను బిజెపిలో చేరానని, అయితే ఇప్పుడు భిన్నమైన రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నానని ఆయన చెప్పారు. డిసెంబర్ 2025లో పార్టీని వీడాలనే తన ఉద్దేశాన్ని బిజెపి నాయకత్వానికి ముందే తెలియజేసినట్లు అన్నామలై తెలిపారు. తమిళనాడు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీలోనే కొనసాగాలని సీనియర్ నాయకులు కోరారని, అందుకే అధికారికంగా తప్పుకునే ముందు ఆ సమయం వరకు వేచి చూశానని ఆయన వివరించారు. తుది నిర్ణయం తీసుకునే ముందు బిజెపి అగ్రనేతలతో సంప్రదింపులు జరిపినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల అత్యంత గౌరవాన్ని ప్రకటిస్తూనే, గత 18 నెలలుగా అనేక అంశాలపై బిజెపితో తనకు విభేదాలు ఉన్నాయని అన్నామలై వెల్లడించారు. పార్టీకి సమస్యగా మారడం తనకు ఇష్టం లేదని, అందుకే వేరే మార్గాన్ని ఎంచుకున్నానని, తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరి పోరాటంగా అభివర్ణించారు.

# కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు!
## మంత్రిత్వ శాఖలపై పలువురిలో అసమ్మతి
## మంత్రి రామలింగారెడ్డి రాజీనామా



**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు తర్వాత కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మంత్రుల్లో సీనియర్లు తమకు తగిన ప్రాతినిధ్యంఇవ్వలేదని గుర్రుగా ఉన్నారు. వీరిలో అత్యంత సీనియర్ అయిన రామలింగారెడ్డి ఏకంగా రాజీనామాచేసారు. నూతన వారంతా ఢిల్లీ లాబీయింగ్‌కు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకోగా, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత నమ్మకస్తుడైన సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గేకు హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించిన అధికారిక జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖతో పాటు సిబ్బంది పరిపాలనా సంస్కరణల శాఖ, కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్ (అంతర్గత భద్రత), మరే ఇతర మంత్రికి కేటాయించని శాఖలను తన నియంత్రణలోనే ఉంచుకున్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలపై ఆయన పట్టు సాధించారు. ఇక అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గేకు హోం శాఖతో పాటు ఐటీ, బయోటెక్నాలజీ, ఈ గవర్నెన్స్ బాధ్యతలను కట్టబెట్టారు. డిప్యూటీ సీఎం జి.పరమేశ్వరకు రెవెన్యూ, యువజన సేవలు, క్రీడల మంత్రిత్వ శాఖ దక్కింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కీలక శాఖలు నిర్వహించిన పలువురు సీనియర్ మంత్రులు ఈ కేబినెట్‌లోనూ తమ పాత పోర్ట్‌ఫోలియోలను నిల బెట్టుకున్నారు. ఎంబీ పాటిల్ పరిశ్రమలు, కేహెచ్ మునియప్ప పౌర సరఫరాలు, సతీష్ జార్కిహోళి పబ్లిక్ వర్క్స్, డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ వైద్య విద్యలు యథాతథంగా కొనసాగుతున్నారు. కాగా, గతంలో డీకే శివకుమార్ నిర్వహించిన బెంగుళూరు నగరాభివృద్ధి శాఖను ఈసారి కృష్ణా బైరేగౌడకు అప్పగించారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్యకు పట్టణాభివృద్ధి శాఖ లభించింది. బెంగళూరు అభివృద్ధి వంటి కీలక శాఖల కోసం మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరగడం, సీనియర్ నేత రామలింగారెడ్డి వంటి వారు అసంతృప్తి వ్యక్తం చేయడంతో శాఖల ప్రకటన ఆలస్యమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేస్తూ అధిష్ఠానం ఈ కేబినెట్ కూర్పును ఖరారు చేసింది. రానున్న వారాల్లో ఈ మంత్రివర్గాన్ని మరింత విస్తరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంత్రి రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో రేగిన కలకలంపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. రామలింగారెడ్డి తమకు సీనియర్ నేత మాత్రమే కాదని, తనకు అత్యంత ఆప్తమిత్రుడని సీఎం పేర్కొన్నారు. శాఖల కేటాయింపుపై ఆయనకున్న అసంతృప్తి నేపథ్యంలో, తానే స్వయంగా మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తానని వెల్లడించారు.

## 12 మందితో హిమంత బిశ్వశర్మ అసోం కేబినెట్ విస్తరణ

**గువాహతి, జూన్ 5:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి వర్గం 17కు చేరింది. కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కిష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హాజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. అస్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

## సంక్షిప్తంగా..

### మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస - ముగ్గురు మృతి, పలు ఇళ్లకు నిప్పు



**ఇంఫాల్, జూన్ 5:** మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. సాయుధ దుండగులు ఒక గ్రామంపై దాడి చేశారు. పలువురిపై కాల్పులు జరిపారు. పలు ఇళ్లకు నిప్పంటించారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో న్యూకీథెల్మాన్బి ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుఝామున 4 గంటల సమయంలో సాయుధులైన దుండగులు లోయిబోల్ గ్రామంపై దాడి చేశారు. సాయుధ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలు ఇళ్లకు వారు నిప్పంటించగా అవి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

### బీహార్ మాజీ సిఎంలు లాలూ, రబ్రీదేవికి జెడ్ ప్లస్ భద్రత ఉపసంహారణ



**పాట్నా, జూన్ 5:** బీహార్ ప్రభుత్వం రాష్ట్ర మాజీ సిఎంలు, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు కల్పిస్తున్న అత్యున్నత స్థాయి జెడ్ ప్లస్ భద్రతను ఉపసంహరించుకుంది. విఐపి భద్రతపై జరిపిన సమీక్షల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జనశక్తి జనతాదళ్ అధినేత, ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ పెద్ద కుమారుడు అయిన తేజ్ ప్రతాప్‌కు కల్పిస్తున్న వై కేటగిరీ భద్రతను కూడా ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు ఇకపై బీహార్ ప్రత్యేక సాయుధ పోలీసులు భద్రత కల్పిస్తారు. ఎంపి మీసా భారతికి, తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీ యాదవ్‌కు ఉన్న ప్రస్తుత భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

### భారత్ విదేశాంగ విధానానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో బంధం అంశంపై భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత్ వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు.

### అసోంలో గిరిజన తెగల 48 గంటల బంద్



**గువాహతి, జూన్ 5:** అస్సాంలోని మోరాన్, మోటోక్ సామాజిక సంఘాలు 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. కొత్తప్రభుత్వ మంత్రివర్గంలో తమ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఈ రెండు ఆదిమవాసుల వర్గాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా కల్పించాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం టిన్సుకియా, దిబ్రూగఢ్ జిల్లాల్లో ఆల్ మోరన్ స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం మోటోక్ యూత్ స్టూడెంట్స్ అసోసియేషన్, పలు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో 48 గంటల బంద్ ప్రారంభించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని ఆ సంఘాల నేతలు హెచ్చరించారు. నిరసనకారులు పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. టిన్సుకియా జిల్లాలోని రూపాయ్ సైడింగ్‌కాకోపతార్ టిని ఆలీ వద్ద ప్రధాన సమావేశం జరిగింది.

# ‘సుప్రీం’ తీరుపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి
### - ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలంటారు - మార్గదర్శకాలిస్తారు, కట్టుబడి ఉండాలి కదా!
### - ఇలా అయితే, నిరంకుశత్వానికి దారితీస్తుంది: జస్టిస్ జి.జయచంద్రన్ ధర్మాసనం వ్యాఖ్య

**చెన్నై, జూన్ 5:** తిరునెల్వేలి జిల్లాలోని రాధాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 2016-2021 కాలానికి జరిగిన ఎన్నికలలో, మాజీ స్పీకర్ అప్పావును విజేతగా మద్రాస్ హైకోర్టు ఇటీవల ప్రకటించింది. సుప్రీంకోర్టులో ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండటం వల్ల తీర్పు వెలువడటంలో 10 యేళ్ల దురదృష్టకర జాప్యం జరిగిందని పేర్కొంటూ, జస్టిస్ జి. జయచంద్రన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి కింది కోర్టు తీర్పుపై అప్పీల్ సుప్రీం కోర్టులో యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన కేసుల్లో ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని సుప్రీం స్వయంగా గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఈ మార్గదర్శకాలకు సుప్రీం కోర్టు కట్టుబడకపోతే దేశంలో నిరంకుశత్వానికి దారితీస్తుందని హెచ్చరించింది. ‘ప్రజా ప్రాతినిధ్య చట్టం‘ ప్రకారం త్వరితగతిన విచారణ జరపాలన్న నిబంధనను న్యాయస్థానాలు పాటించనప్పుడు, అది ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు నిజమైన స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. “దేశంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలతో సమన్వయంతో వ్యవహరించాలి. తద్వారా, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్రం పొంది ప్రజాస్వామ్య పాలనను స్వీకరించిన దేశాలలో, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో ఒకటిగా మన దేశం గౌరవాన్ని నిలబెట్టాలి. ‘ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951‘లోని సెక్షన్ 86(7)లో ఉన్న ఆదేశాలను పాటించకపోవడం ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు స్ఫూర్తిని బలహీన పరుస్తుంది. ‘మహ్మద్ అక్బర్ కేసు‘లో (పైన పేర్కొన్నది) న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను విస్మరించడం కొనసాగిస్తే, మనతో పాటే సుమారు 75 యేళ్ల క్రితం స్వాతంత్రం పొందిన ఇతర నిరంకుశ దేశాల పరిస్థితి మనకూ పట్టవచ్చని ఆందోళన చెందుతున్నాను“ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2016 నాటి ఎన్నికల్లో ఎఐఎడిఎంకె అభ్యర్థి ఐ.ఎస్. ఇన్‌బదురై రాధాపురం నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గెలిచారు. అయితే, ఈ ఫలితాన్ని అప్పావు మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు అప్పావుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇన్‌బదురై ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో, ఇన్‌బదురై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది.



## సైనిక నియంతృత్వంలో ఆసిమ్‌మునీర్ టాప్!

**కరాచి, జూన్ 5:** పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం కేవలం కాగితాలకే పరిమితమైందని, తెరవెనుక అంతా సైనిక నియంతృత్వమే నడుస్తోందని అంతర్జాతీయ నిఘా ఏజెన్సీలు సర్వేచేసాయి. పాక్ సైన్యానికి సర్వ సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇప్పుడు దేశంలోని ప్రతి రక్షణ, పౌర సంస్థను తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఈ క్రమంలో దేశంలో తీవ్ర తిరుగుబాటు ముప్పు పొంచి ఉందని అక్కడి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశ అత్యున్నత నిఘా సంస్థ ఐఎస్ఐను శాసిస్తున్న మునీర్ దేశంలోని అన్ని పోలీస్ బలగాలను కూడా సైన్యం పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. రక్షణ, అంతర్గత భద్రతకు సంబంధించిన అన్ని విభాగాలను ఒకే కమాండ్ కిందకు తెచ్చి తానే సర్వాధికారిగా మారాలనేది ఆయన వ్యూహం. ఈ ప్రతిపాదన గనుక అమల్లోకి వస్తే పాకిస్థాన్‌లోని ప్రాంతీయ ప్రభుత్వాలపై కూడా పౌర అధికారులకు కాకుండా నేరుగా సైన్యానికే పూర్తి పట్టు దక్కుతుంది.

## మహారాష్ట్రలో రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ

**ముంబయి, జూన్ 5:** మహారాష్ట్రలోని రైతులకు దేవేంద్ర ఫడ్నవీస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించింది. పుణ్యశ్లోక్ అహిల్యాదేవి హోల్కర్ షేట్కారి కర్జ్‌ముక్తి యోజన పథకం కింద ఈ మాఫీ జరగనుంది. ఈ నిర్ణయం వల్ల మహారాష్ట్రలోని 56 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. దీనివల్ల మొత్తం 65 లక్షల వరకు రుణాలు మాఫీ అవుతాయి. ప్రభుత్వం రూ.36,585 కోట్లు కేటాయించనుంది. రైతులు ఇప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. వీరికి రూ.50 వేల వరకు సాయం అందనుంది. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయి. ఇందుకోసం భూయాజమాన్య డాక్యుమెంట్లు వంటివేమీ అక్కర్లేదు. రూ.2 లక్షలకు మించి రుణాలు ఉన్నవారికి వర్తిస్తుంది. వారు అదనపు డబ్బు ముందుగానే బ్యాంకులకు చెల్లించాలి. అంటే రూ.2 లక్షలకంటే ఎక్కువగా లోన్ తీసుకుంటే రూ.2 లక్షలు మినహాయింపు.

# అంగన్‌వాడీ లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారమే లక్ష్యం

## ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ప్రభుత్వ ప్రత్యేకదృష్టి

## రేపు రాష్ట్రవ్యాప్తంగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్‌వాడీ సిబ్బందికి మరింత అవ గాహన కల్పించేందుకు ఈ ఆదివారం (జూన్ 7) వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే ను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం శిక్షణ ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు భవిష్యత్ తరాల ఆరోగ్యానికి పునాది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే ప్రతి ఆహార పదార్థం నాణ్యంగా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా అందించే సేవల నాణ్యతను మరింత పెంచడం, పోషకాహార లోపాలను తగ్గించడం, లబ్ధిదారుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.



## ప్రధానమంత్రి మోడీ పిలుపునకు మద్దతుగా మొక్క నాటిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా ఇచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపు స్ఫూర్తితో, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శుక్రవారం ఉదయం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రకృతిని కాపాడటం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం మనందరి కర్తవ్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, అది తల్లిపట్ల గౌరవాన్ని వ్యక్తపరుస్తూనే ప్రకృతిని కాపాడుకోడం పట్ల సమాజంలో అవగాహన పెంపొందించే ఒక మహత్తర ప్రజా ఉద్యమమని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాల నివారణ, జీవవైవిధ్య సంరక్షణ (బయోడైవర్సిటీ) కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుకు స్పందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సుస్థిరాభివృద్ధి, హరిత అభివృద్ధి (గ్రీన్ గ్రోత్) లక్ష్యాలతో దేశం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరూ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగస్వాములై, హరిత భారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మహిళా శక్తి రైతు కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు

### జనగాం జిల్లాలో 62 కేంద్రాలకు లైసెన్స్ జారీ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళా శక్తి రైతు కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించే బాధ్యతలను అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అవసరమైన అన్ని సేవలు వేగంగా, సులభంగా అందేలా ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని భావిస్తోంది. రైతులకు అవసరమైన అన్ని సేవలు ఒకే వేదికపై అందించడమే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతలో జనగాం జిల్లాలో రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించేందుకు తెలంగాణ ప్రభుత్వం 62 మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలకు లైసెన్సులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీని నిమిత్తం లావాదేవీలు, స్టాక్ పర్యవేక్షణ, పంపిణీ, ధరల నిర్ధారణ కోసం ఈ మహిళా శక్తి రైతు కేంద్రాలకు ఈపీఓఎస్ (ఈ పోస్) యంత్రాలను అధికారులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాలు నడుపుతున్న ఎరువుల దుకాణాలకు ఇంత పెద్ద సంఖ్యలో లైసెన్సులు జారీ చేయడం ఇదే మొదటిసారి అని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రికార్డుల నిర్వహణను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు బహుళ సేవలు అందించేందుకు వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఒకే చోట సేవలు అందించేందుకు, కేంద్రాల సభ్యులకు రైతు వేదికలలోని వ్యవసాయ విస్తరణ అధికారులు శిక్షణ ఇస్తారని అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రాలకు కేవలం ఎరువుల లైసెన్స్ లు మాత్రమే కాకుండా విత్తన లైసెన్సులు, పురుగు మందుల లైసెన్సులు కూడా అందించినట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి లావాదేవీకి సంబంధించి రికార్డులు ఖచ్చితంగా నిర్వహించాలని, నిల్వలు, పంపిణీ వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు.



గాంధీ ఆస్పత్రి

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిలిచిన ఒపి సేవలు

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ సేవలు నిలిచి పోయాయి. ప్రభుత్వ వైద్యుల బదిలీ ప్రక్రియలో ప్రభుత్వం జీవో నెం. 38 నిబంధనలను తుంగలో తొక్కుతూ ఏకపక్షంగా వ్యవహరించారని నిరసిస్తూ తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ ఆస్పత్రి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలను నిలిచిపోయాయి. అత్యవసర సేవలు, ఇన్పేషెంట్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38 ప్రకారం బదిలీలు జరగకపోవడం లేదని డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్పౌజ్ కోటాలో దరఖాస్తు చేసుకున్న వారికి, అనారోగ్య సమస్యలు ఉండి ప్రాధాన్యత కోరుతున్న వారికి న్యాయం జరగడం లేదని టీజీజీడీఏ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏల్లుగా మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తూ, వ్యక్తిగత కారణాలతో బదిలీలు కోరుతున్న వైద్యుల వినతిని అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. గుర్తింపు పొందిన సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలనే నిబంధనను కూడా అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

# ఆర్థిక వ్యవస్థపై రాహుల్ నిరాధార వ్యాఖ్యలు

## స్వార్థ రాజకీయాల కోసం అసత్యపు వాదనలు

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రభుత్వం అన్ని షాక్ అబ్జార్బర్‌లను (ఆటంకపరిచే వ్యవస్థలను) తొలగించడం వల్ల భారతదేశం 'ఆర్థిక సునామీ' వైపు వెళుతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం చేసిన అసత్యపు వాదన నిరా ధారమైనది మా త్రమే కాదు, అది నిజంగా దేశ ప్రజలలో లేని భయాందోళనలను రెచ్చగొట్టడమే అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశపు ఆర్థిక వ్యవస్థ షాక్ అబ్జార్బర్‌లను నిజంగానే తొలగించి ఉంటే, అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతంగా పెరిగిన ముడి చమురు ధరలు, పశ్చిమ ఆసియాలో సంఘర్షణ, దిగుమతులు, ఎగుమ తులపై సప్లై చైన్‌లో అంతరాయాలు, ఆర్థికంగా ప్రపంచం అనేక రకాల సవాళ్ళు ఎదుర్కొం టున్నప్పటికీ, నిరంతర భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలకడగా కొనసాగుతుందని ప్రశ్నించారు. భారతదేశం ఒక బాహ్య ఒత్తిడిని ఎదుర్కొంటోంది, కానీ నిస్సహాయ స్థితిలో లేదు. ప్రభుత్వం ఏ రకమైన షాక్ అబ్జార్బర్‌లను తొలగించలేదు. 140 కోట్ల భారత ప్రజల సహకారంతో గత దశాబ్ద కాలంలో మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేశారు. ఈ సందర్భంగా మనం కొన్ని తాజా గణాంకాలను పరిశీలించినట్లయితే బలమైన ఆర్థిక కార్యకలాపాలను ప్రతిబింబిస్తూ, ఏప్రిల్, 2026లో ఇవే బిల్లుల జారీ 11.8శాతం ఉండగా మే, 2026లో అది 12.9శాతానికి వృద్ధి చెందిందన్నారు. తయారీ రంగ పిఎంఐ ఏప్రిల్‌లో 54.7 వద్ద స్థిరంగా విస్తరణ పరిధిలో కొనసాగి, మే నెలలో 56.6కు మెరుగుపడిందన్నారు. ప్రపంచ దేశాలలో సేవల రంగం పిఎంఐ భారీగా పతనమైనా మనదేశంలో ఏప్రిల్‌లో 58.8 కాగా, మే నెలలో అది 58.9 వద్ద మరింత బలంగా ఉందని, ఏప్రిల్‌లో విద్యుత్ వినియోగం 3.5శాతం ఉండగా, మేలో అది 5.9శాతం పెరిగిందని, ఏప్రిల్‌లో పట్టణ వాహన అమ్మకాలు 11.8శాతం పెరగ్గా, గ్రామీణ వాహన అమ్మకాలు అంతకంటే బలంగా 13.8శాతం పెరిగాయన్నారు. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 వద్ద అదుపులో ఉందని, ఇది ఎఫ్‌డిఐ నిర్దేశించిన 4శాతం లక్ష్యం కంటే తక్కువ ఏప్రిల్ చివరి నాటికి బియ్యం, గోధుమల బఫర్ నిల్వలు 817.53 లక్షల టన్నులుగా ఉన్నాయన్నారు. ఇవి బలమైన దేశ ఆహార భద్రతా కవచాన్ని అందిస్తున్నా యన్నారు.

## కొందుర్గు-పరిగి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తో హైదరాబాద్‌కు తాగునీరు లభ్యత

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** కొందుర్గు, పరిగి లక్ష్మీదేవిపల్లి రిజ ర్వాయర్‌తో హైదరాబాద్‌కు తాగునీరు లభించడమే కాకుండా ఈ ప్రాంతంలోని సాగునీటి అవసరాలు కూడా తీర్చే అవకాశం ఉంటుం దని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చేవేళ్ల ప్రాణహిత ప్రాజెక్టు కోసం గతంలో శంకరపల్లి మండలంలో పెద్ద ఎత్తున టన్నల్ ను తొవ్వినప్పటికి గత ప్రభుత్వం ఆ పనులు రద్దుచేసి వదిలేసిందని ఆరోపించారు. జూరాల నుంచి నీళ్లు తీసుకొని ఉంటే మా ప్రాంతానికి నీటి సమస్య తీరేదనీ, గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు చుక్కనీరు కూడా ఇవ్వలేదనీ ఆవేదన చెందారు. కొందుర్గు , పరిగి, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం భూసేకరణ జరిపి 2.8 టిఎంసిలతో రిజర్వాయర్ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడం నిజంగా గతంలో నేను అనేక పోరాటాలుకు సానుకూల స్పందన సిఎం ఇచ్చారని కొనియాడారు.

గత ప్రభుత్వం లోపభూయిష్టమైన విధానాల వల్ల అనేక ప్రతిపాదిత నీటి ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేకపోయాయనీ అన్నారు. పాలమూరు రంగారెడ్డి ని తాగునీటి ప్రాజెక్టుగా చూపించి శ్రీశైలం నుంచి సోర్స్ పాయింట్ పెట్టడం వల్ల అంతరాష్ట్ర వివాదాలు తలెత్తాయనీ ఆయన వివరించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో 90 శాతం పనులు పూర్తి చేశామని బిఆర్ఎస్ నాయకులు అబద్దాలు చెపుతున్నారనీ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తి అయ్యాయనీ ఆయన తెలిపారు. కొందుర్గు, పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు 670 మీటర్ల ఎత్తులో ఉందనీ దీని వల్ల హైదరాబాద్‌కు తాగునీరు ఇవ్వొచ్చు ఈ రిజర్వాయర్ నుంచి తెలంగాణలో ఏ ప్రాంతానికైనా నీళ్లు ఇచ్చే అవకాశం ఉందనీ ఆయన తెలిపారు.

# ప్రపంచ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యుతవకు నైపుణ్యం

## జపాన్-తెలంగాణ సహకారానికి కొత్త దిశ

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చలు: మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రపంచ ఆర్థిక అవసరాలకు అను గుణంగా తెలంగాణ యువతకు సాంకేతిక, సమాచార వినిమ యశిక్షణ ఇస్తూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ సౌజన్యంతో తెలంగాణ ప్రభుత్వం మంచి మానవ వనరులను తయారిస్తున్నామని రాష్ట్రకార్మిక ఉపాధి గనులు భూగర్భశాఖ మంత్రి జి వెంకటస్వామి అన్నారు. జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు ,భూగర్భశాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తో జపాన్ ప్రతినిది బృందం సమా వేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) సమన్వయం చేసింది. సమావేశంలో జపాన్ ప్రతినిధులు వివిధ పరిశ్రమలు, రంగాల్లో భారత యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి మంత్రికి వివరించారు. తెలంగాణ- జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అం శాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. హైదరాబాద్‌తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం 20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు.

రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించ డంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో టామ్‌కామ్ అత్యంత వృత్తిపరమైన, లక్ష్యబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. జపాన్ సాంకేతిక నైపుణ్యం, పని సంస్కృతి తనను ఎంతో ఆకట్టుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. జపాన్ యంత్రాల కచ్చితత్వంతోపాటు అక్కడి ప్రజల వినయం, క్రమశిక్షణ తనను ప్రభావితం చేశాయని అన్నారు. ఈ సమావేశంలో లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ నైపుణ్యాల పెంపు, అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ అవకాశాల గురించి వివరించారు. అలాగే తెలంగాణ-హిరోషిమా ప్రిఫెక్చర్ మధ్య సహకారం, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు సంయుక్త కార్యాచరణ బృం దం (జాయింట్ వర్కింగ్ గ్రూప్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హిరోషిమా ప్రిఫెక్చర్ నారా జపాన్ హబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వచ్చిన బృందంలో డైరెక్టర్ ఫునైషి , ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ కోగా యుయా , ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ డివిజన్ హారజోనో యోషిహిరో – సూపర్వైజర్, లోకల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్ టోయి మారియా – ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టిని నిర్మిస్తే కాంగ్రెస్ బలపడుతుందని బిఆర్ఎస్, బిజెపి ఆందోళన

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టిని నిర్మిస్తే కాంగ్రెస్ బలపడుతుందని బిజెపి, బిఆర్ఎస్ ఆందోళన పడుతున్నాయని, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఉనికి కోసం, పార్టీని బతికించుకోవడం కోసం అడ్డదిడ్డంగా మాట్లాడుతు న్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. సిఎల్‌పిలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రాణహిత మీద బ్యారేజ్ నిర్మిస్తే ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 16 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని, ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్ట్ కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, 71 కిలో మీటర్ల కెనాల్ వర్క్ కూడా పూర్తి అయిందని మహారాష్ట్రతో అనుమతి ఇప్పించడానికి రామచంద్రరావు తుమ్మిడి హట్టి పైన ఎందుకు నోరుమెదపడటం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రాణహిత మీద తుమ్మిడి హట్టి మీద బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 100 టిఎంసిల నీళ్లను వినియో గించు కోవచ్చనీ గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. తుమ్మిడిహట్టి పైన మాట్లాడటానికి ఇరిగేషన్ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సిఎంకు లేఖ రాస్తే ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన చెందారు. బిజెపికి తెలంగాణ రైతులపైన చిత్తశుద్ధి లేదన్నారు. అతి తక్కువ ముంపుతో తుమ్మిడిహట్టి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. మహారాష్ట్రలో భూములు కోల్పోయేవారికి పరిహారం ఇవ్వడానికి ప్రయత్నం సిద్ధంగా ఉన్నా తెలంగాణ బిజెపి స్పందించలేదనీ ఆరోపించారు. మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ ఇప్పించడానికి బిజెపి ఎందుకు స్పందిచడం లేదని ప్రశ్నించారు. 70 యేళ్ల కాంగ్రెస్ పాలనలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం, మానేరు, కడెం ఇలా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిందనీ పదేళ్ల పాలించిన బిఆర్ఎస్ హయాంలో 8 లక్షల కోట్ల అప్పు చేసి కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు..అది కూడా కూలిపోయిందని ఆదిశ్రీనివాస్ అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మా వాటా ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోమని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల పైన రాజీ లేదనీ అన్నారు. కర్ణాటకతో ఏమైనా సమస్యలు ఉంటే చర్చించుకుని పరిష్కరించుకుంటామని అన్నారు.

# పర్యావరణం నాశనం దిశగా 'అభివృద్ధి' తగదు

## ఆదానీకి నికోబార్ ఐలాండ్ అప్పగింతకు కుట్ర

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** అభివృద్ధి అవసరమే కానీ, అది పర్యావరణాన్ని నాశనంచేసే విధంగా కాకుండా ప్రకృతిని కాపాడే దిశగా సాగాలనీ తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పిలుపుకు మద్దతుగా, అండమాన్ నికోబార్ దీవుల పరిరక్షణ కోసం మా సంఘీభావం తెలియ జేస్తున్నామనీ తెలిపారు. ప్రకృతి పరంగా, భౌగోళికంగా ఎంతో పేరు గాంచిన నికోబార్ ఐలాండ్‌ను అదానీకి అప్పగించే కుట్ర సాగుతోందనీ ఆరోపించారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో దీన్ని నాశనం చేస్తున్న పరిస్థితులను రాహుల్ గాంధీ తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని భారత ప్రజలు ఆయనకు బాసటగానిలిచి ప్రకృతిని కాపాడుకోవాలని కోరారు. అక్కడ ఉన్న నావికాదళ స్థావరం విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పర్యావరణానికి సంబంధించిన వేలాది మొక్కలను, వృక్షాలను కొట్టేస్తూ ప్రకృతికి తీవ్రవిఘాతం కలిగిస్తున్నారనీ ఆయన ఆవేదన చెందారు. పర్యావరణాన్ని సమతుల్యం చేస్తూ సాగే అభివృద్ధి అయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, కేవలం అదానీని సంతృప్తి పరచడానికే ఒక పూర్తి ఐలాండ్‌ను అప్పగించి, దాన్ని పాడుచేసే ప్రయత్నం జరగడం సరైంది కాదనీ అన్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, రాహుల్ గాంధీ స్ఫూర్తికి, ఆయన చేస్తున్న పోరాటానికి అందరూ సామాజికంగా తమ మద్దతుగా నిలవాలని కోరుతున్నామని తెలిపారు.

## అండమాన్ నికోబార్ దీవుల రక్షణ.. రాహుల్ పిలుపునకు సంపూర్ణ మద్దతు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణహితంగా కొనసాగే అభివృద్ధికే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ నికోబార్ ఐలాండ్ ఆదానికి వాణిజ్య అవసరాలకోసం అప్పగింతను అడ్డుకోవడానికి దేశ ప్రజలు రాహుల్‌గాంధీకి బాసటగా నిలవాలని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. అండమాన్ దీవుల పరిరక్షణకు రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపుకు టిపిసిసి తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అండమాన్ నికోబార్ దీవుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ ప్రియులు మద్దతు పలుకుతు న్నారని ఆయన తెలిపారు.. ప్రకృతి సంపదలను కాపాడుతూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్నది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని ఆయన తెలిపారు, పర్యావరణాన్ని ధ్వంసం చేసే అభివృద్ధి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు.



పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో డిజిపి ఆనంద్. చిత్రంలో పిఅండ్ఎల్ ఐజి గజారావు భూపాల్ తదితరులు

## పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణ పోలీసులకు పతకాలు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** హరియాణాలోని మధుబన్‌లో జరిగిన అఖిల భారత మూడో పోలీసు వెయిట్ లిఫ్టింగ్, క్లస్టర్ (వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా) పోటీల్లో తెలంగాణ పోలీసు క్రీడాకారులు మూడు పతాకాలు సాధించారు. మహిళల 84 కిలోల విభాగంలో మల్కాజిగిరి సిసిఎస్ మహిళా కానిస్టేబుల్ రేణుక రతజం పతకం సాధించగా పురుషుల పవర్ లిఫ్టింగ్ 59 కిలోల విభాగంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా సాయుధ బలగం కానిస్టేబుల్ వంశీ కాంస్య పతకం అందుకున్నారు. కాగా యోగాలో మహి ళల జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ జట్టులో ఈగల్ డిఎస్‌పి లక్ష్మీ, భద్రాచలం కానిస్టేబుల్ రత్నకుమారి, మహబూబ్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ సౌభాగ్య, రామగుండంకు చెందిన కానిస్టేబు ల్. శ్రీలత, ఇల్లందు కానిస్టేబుల్ రాణి పాల్గొన్నారు. కాగా వెయిట్ లిఫ్టింగ్, క్లస్టర్ పోటీల్లో పత కాలు సాధించిన పోలీసు క్రీ డాకారులను డిజిపి ఆనంద్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందిం చారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆయన కోరారు. క్రీడాకా రులకు వెన్ను దన్నుగా వున్న కోచ్ రాము, ఏఆర్ఎస్ఐ రమేష్‌లను కూడా డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పి అండ్ ఎల్ ఐజి గజారావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు త్వరగా నిర్వహించాలి: డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు త్వరగా నిర్వహించాలని సంబంధిత అధికారులను డిజి పి ఆదేశిం చారు. పోలీసు అధికారుల సంఘం ప్రతి నిధులు శుక్రవారం నాడు డిజిపి ఆనంద్‌ను కలిసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చే శారు. పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నిక కావాల్సి వుందని డిజిపి తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం పోలీసు అధికారుల సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వ హించాలని ఆయన ఆదేశించారు. డిజిపిని కలిసిన వారిలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి సహా ఇతర నాయకులు వున్నారు. వారు డిజిపి ఆనంద్‌కు ఒక వినతిపత్రాన్ని అందించారు.

## పర్యావరణ స్పృహతో పుడమిని రక్షిద్దాం

### సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్పృహతో భూమి తల్లి రక్షణకు పూనుకోవాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణకు దోహదపడాలని సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలోను, తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్ఫూర్తిని పాటించాలన్నారు. అనంతరం అందరితోను పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గౌతమ్ పోట్రు, ఈడీ బి. వెంకన్న, జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్ పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో కూడా అంత ర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు, పలుచోట్ల మొక్కలు నాటారు.

# ఖజానా నింపుకోవడానికే భూముల ధరల పెంపు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** ఎటువంటి ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయత లేకుండా భూముల మార్కెట్ విలువలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను దూరం చేసేలా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, భూయజమానులకు న్యాయబద్ధంగా లబ్ధి చేకూరడాన్ని పార్టీ తరఫున తాము ఎల్లప్పుడూ స్వాగతిస్తాం. కానీ, ప్రస్తుత మార్కెట్ విలువల పెంపు వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం ప్రజలకు మేలు చేసేలా లేదని, కేవలం రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాను నింపుకోవడానికే అన్నట్లు ఉందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని, ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలతో మరింత సంక్షోభంలోకి నెడుతోందని ఆయన విమర్శించారు. ఎలాంటి శాస్త్రీయత లేకుండా భూముల విలువలను 50 శాతం నుంచి 100 శాతం వరకు, కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 300 శాతానికి పైగా పెంచడం వల్ల సామాన్యుడు భూమి కొనాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా రిజిస్ట్రేషన్ ఫీజుల కోసమే లక్షలాది రూపాయలు అదనంగా భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎకరం కనీస ధరను రూ. 2.75 లక్షలుగా, మున్సిపాలిటీల్లో రూ.5 లక్షలుగా, హెచ్ఎండిఏ పరిధిలో రూ.10 లక్షలుగా నిర్ణయించి మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని ఆయన దుయ్యబట్టారు. వీటికి తోడు, ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకుని, పాత ధరల ప్రకారం చలాన్లు కట్టిన వారికి కూడా పెంచిన ధరలనే వర్తింపజేస్తామని చెప్పడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి, మొండివైఖరికి పరాకాష్ట అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆఫీసులోనే మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను 30 సార్లు పొడిచి చంపిన లవర్

## ఆ తర్వాత ఆత్మహత్యకు యత్నం..

**న్యూఢిల్లీ, జూన్ 5:** పంజాబ్‌లోని మొహాలీలో ఓ అమ్మాయి మాజీ లవర్ దారుణహత్యకు పాల్పడ్డాడు. తన మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను ఆఫీసులోనే కిరాతంగా చంపేశాడు. తోటి ఉద్యోగుల ముందే ఈ ఘాతుకం జరిగింది. రిలేషన్‌షిప్ అంశంలో ఇద్దరి మధ్య ఇటీవల గొడవ జరిగినట్లు తెలిసింది. అయితే ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న ఆ మహిళను ఆమె ఆఫీసుకు వెళ్లి చంపేశాడు. నిందితుడిని హర్విందర్ మాన్ అలియాస్ హ్యారీగా గుర్తించారు. లవర్‌ను పొడిచి చంపిన తర్వాత అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆఫీసులో అమర్చిన సీసీటీవీ కెమెరాలకు ఈ మర్డర్ దృశ్యాలు చిక్కాయి. రాత్రివేళ 7.40 నిమిషాలకు నిందితుడు ఆఫీసులోకి ప్రవేశించి కుర్చీలో కూర్చుని పనిచేస్తున్న తన లవర్ వద్దకు వెళ్లాడు. దింపుల్ అనే మహిళను వెనక నుంచి కత్తితో పొడిచాడు. అతని నుంచి తప్పించుకునేందుకు ఆమె ప్రయత్నించింది. కానీ జుట్టు పట్టుకుని ఆమెను లాగేశాడు. కత్తితో కసిగా పొడిచేశాడు. అక్కడ ఉన్న ఉద్యోగులు అడ్డుకునే ప్రయత్నం చేసినా అతను తగ్గలేదు. డింపుల్‌ను దాదాపు 20 సార్లు పొడిచాడు. ఆ తర్వాత నిందితుడు ఆఫీసులో బాధితురాలు కూర్చున చోటుకు వెళ్లాడు. అక్కడే ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గొంతును కోసుకున్నాడు. సుమారు 30 సార్లు కత్తితో పొడుచుకున్నాడు. డింపుల్ సొంతూరు పాటియాలా. అయితే ఇద్దరి మధ్య మూడేళ్ల రిలేషన్ ఉంది. కానీ ఇటీవల ఆ జంట బ్రేకప్ అయ్యింది. అయితే డింపుల్‌తో మళ్లీ మంచి రిలేషన్ కొనసాగించేందుకు హ్యారీ ప్రయత్నించాడు. కానీ సక్సెస్ కాలేకపోయాడు. ఆ ఎమోషన్‌లో ఉన్న హ్యారీ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ సాంస్కృతిక వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్5:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్, న్యూఢిల్లీలో శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి,క్రీడల సలహాదారు ఏ.పీ. జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు జితేందర్ రెడ్డి తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సంస్కృతి, హస్తకళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపన అనంతరం తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెసిడెంట్ కమిషనర్ డా. శశాంక్ గోయల్ స్వాగత ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి, తెలంగాణ రైజింగ్-2047 విజన్, దేశ రాజధానిలో తెలంగాణ భవన్ పోషిస్తున్న కీలక పాత్రను ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహబూబాబాద్‌కు చెందిన నాట్యశ్రీ ఉదయశ్రీ మనోజ్ సారథ్యంలో వారి తాండవకృష్ణ నృత్యాలయ బృందం ప్రదర్శించిన వినాయక కౌత్వం, వందేమాతరం, జయ జయహే తెలంగాణ, రుద్రమదేవి నృత్య రూపకం మరియు దేవీ స్తుతి ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్,తెలంగాణ భవన్ అధికారులు, ఢిల్లీలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వ్యక్తికి ఎబోలా నెగెటివ్

## మరో ఇద్దరికి ఎబోలా!.. గాంధీ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** ఎబోలా ప్రభావిత ప్రాంతం ఆఫ్రికాలోని సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన 35 ఏళ్ల వ్యక్తికి ఎబోలా నెగటివ్‌గా తేలింది. రెండు రోజుల కిందట ఆ వ్యక్తిని ఎయిర్ పోర్టు నుంచి గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అతని నుంచి శాంపిల్స్ తీసుకొని వైద్య పరీక్షల కోసం పంపారు. కాగా, ఆ వ్యక్తికి ఎబోలా నెగటివ్ వచ్చిందని పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ గాంధీ ఆసుపత్రికి సమాచారం అందించింది. కాగా, ఒక్క రోజులోనే మరో రెండు అనుమానిత కేసులు పెరిగాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆసుపత్రి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో వారికి చికిత్స అందిస్తున్నారు. ఒకే విమానంలో నగరానికి వచ్చిన




ముగ్గురిలో ఎబోలా లక్షణాలు కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. మరోవైపు ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలలో ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బుండిబుగ్యో అనే వేరియంట్ కారణంగా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అప్రమత్తమై.. ఇంటర్నేషనల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం కూడా అప్రమత్తమై పలు సూచనలు చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు.. అలాగే ఆ దేశాల మీదుగా భారతదేశంలోకి వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచించింది.

# నాలుగో త్రైమాసికంలో జిడిపి వృద్ధిరేటు 7.8% మాత్రమే!

## పశ్చిమాసియా ఉద్రిక్తతలే ప్రధాన కారణం

**న్యూఢిల్లీ, జూన్ 5:** భారత్ జిడిపి నాలుగో త్రైమాసికంలో 7.8శాతంగా ఉందని కేంద్రంప్రకటించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికిగాను 7.7శాతంగా ఆర్థిక వృద్ధి ఉన్నట్లు కేంద్ర అర్థగణాంక పథక అమలు శాఖ మోస్పీ వెల్లడించింది. గత ఏడాది ఇదేకాలంలో ఏడు శాతం మాత్రమే వృద్ధి ఉంది. అలాగే మూడోత్రైమాసికంలో ఉన్న 8శాతం వృద్ధినుంచి మాత్రం తగ్గింది. సవరించిన అంచనాలనుచూస్తే జిడిపి 2025-26 సంవత్సరానికి అంతకుముందు అంచనాలతోపోలిస్తే స్వల్పంగాపెరిగి 7.6శాతంగా ఉన్నట్లు తేలింది. ఆర్థికవృద్ధి విభిన్న విభాగాల వృద్ధిని అనుసరించి ఉంటుందని ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంతనాగేశ్వరన్ అన్నారు. వాస్తవ జిడిపి అయితే 2025-26 సంవత్సరానికిగాను 323.12 లక్షలకోట్లుగా ఉంది. సవరించిన అంచనాలు 2025-25లో చూపించిన 299.89 లక్షలకోట్లకంటే గరిష్టంగా ఉందనిమోస్పీ వెల్లడించింది. నామమాత్రపు జిడిపి కూడా అంతకుముందు సంవత్సరంతోపోలిస్తే పెరిగిందని 8.9శాతానికి చేరినట్లు వెల్లడి అయింది. పరోక్ష పన్నులు, ప్రభుత్వ సబ్సిడీలు మినహాయించిస్థూల విలువలజోడింపును పరిగణిస్తే 7.9శాతంగా ఉంది. అంటే 80.18 లక్షలకోట్లుగా మార్చి త్రైమాసికంలో ఉన్నట్లు మోస్పీ డేటా చెపుతోంది. ఇక స్థూల విలువలజోడింపు(జీవీయే) 2026 సంవత్సరానికిగాను 294.91 లక్షలకోట్లు అని అంచనావేసారు. అంతకు ముందు ఏడాది 7.9శాతం వృద్ధిరేటుతో రూ.273.36 లక్షలకోట్లకంటే ఎక్కువగానే ఉంది. నాలుగోత్రైమాసికంలో వృద్ధిరేటు ప్రభావానికి మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు కూడా కొంతకారణం. హార్ముజ్ జలసంధి నిలిపివేయడం వంటి వాటితో ఇంధనసరఫరాచెయిన్ దెబ్బతినన సంగతి తెలిసిందే. అంతకుముందు ఎంపిసీ సమీక్షలో ఆర్బీఐ జిడిపి వృద్ధిని 6.9నుంచి 6.6శాతానికి తగ్గించింది. ద్రవ్యోల్బణం ప్రస్తుత సంవత్సరంలో 4.6శాతంనుంచి 5.1శాతానికి పెరుగుతుందని కూడా వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం, ధరల పెరుగుదల, ఇంధన సరఫరాలోను, కమోడీటీ రంగంలోను పెరిగిన ఒత్తిళ్లతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని కూడా ఆర్బీఐ అంచనావేసింది. ఆర్బీఐ అంచనావేసినట్లు ఏడుశాతం దిగువకు వెళ్లినా, సరఫరా సమస్యలు తొలగిపోయి, స్థూల ఆర్థికవ్యవస్థలో స్థిరత్వంపెరుగుతుండటంవల్ల మళ్లీ 7శాతానికిపైగా ఆర్థికవృద్ధి ట్రాక్‌లోకి వస్తుందని బాహ్య సమస్యలు కుదుటపడితే 2028 ఆర్థికసంవత్సరంలో వృద్ధి




7శాతానికి మించుతుందని ఆర్థిక సలహాదారు అనంతనాగేశ్వరన్ వివరించారు.

# వచ్చే యేడాది నుంచి పిజిఇసెట్ ఎంట్రెన్స్‌లో మార్పులు!

## 19 సబ్జెక్టులకు మూడు పరీక్షలు

## ప్రతిపాదనలు సిద్ధం చేసిన జెఎన్‌టియు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పీజీ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవే శాల కోసం నిర్వహి స్తున్న పీజీ ఈ సెట్ ప్రవేశ పరీక్షలో మార్పులు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటి వరకు పీజీ ఈ సెట్ పరీక్షను నిర్వహిస్తున్న జేఎన్‌టియు సిద్ధం చేసింది. పీజీఈసెట్ ఎంట్రెన్స్‌లో కొత్తగా రీజనింగ్, అర్థమెటిక్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్‌ను కూడా చేర్చనుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న 19 సబ్జెక్టులకు ఒక్కో పరీక్ష కాకుండా ఓవరాల్‌గా మూడు పరీక్షలను నిర్వహించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జేఎన్‌టియు రూపొందించిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలికి పంపించినట్టు తెలిసింది. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (పీజీఈసెట్) పరీక్ష విధానంలో కొత్తగా అర్థమెటిక్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ సబ్జెక్టులను అంతర్భాగం చేయనున్నారు. ఎంట్రన్స్ రాసే వారంతా ఈ రెండు సబ్జెక్టులకు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టుకు 25శాతం చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నారు. సంబంధిత సబ్జెక్టులకు 50శాతం వెయిటేజీ ఉంటుంది. పీజీఈసెట్‌లో ఉన్న 19 సబ్జెక్టులను ఒకే గొడుగు కిందికి తీసుకొస్తారు.

మూడు లేదా నాలుగు సబ్జెక్టులుగా విభజిస్తారు. సీఎస్ఈ, ఎలక్టికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ సబ్జెక్ట లను సర్క్యూట్ సబ్జెక్టులుగా పరిగణిస్తారు. వాటిల్లోని కామన్ సబ్జెక్టులకు పరీక్షలుంటాయి. మెకానికల్, సివిల్, కెమికల్, మెటలర్జీ వంటి సబ్జెక్టులను నాన్ సర్క్యూట్ బ్రాంచిలుగా పరిగణిస్తారు. వాటిల్లోని కామన్ సబ్జెక్టులకు ఒకే కామన్ ఎగ్జామ్ ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోమెడికల్ సైన్స్‌సహా సైన్స్ సబ్జెక్టులన్నింటికీ ఒకే ఎగ్జామ్ ఉంటుంది.

ఫార్మసీ విభాగానికి ప్రత్యేక పరీక్ష ఉంటుంది. పేపర్లను కుదించడం ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్నట్టు నాలుగు, ఐదు రోజులు కాకుండా పరీక్షలను రెండు రోజుల్లోనే పూర్తిచేయవచ్చని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జేఎన్‌టియు పంపిన ప్రతిపాదనలను ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆయా ప్రతిపాదలను సర్కారు ఆమోదిస్తే 2027-28 విద్యాసంవత్సరం నుంచే కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశముంది.


# అసెంబ్లీ, కౌన్సిల్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం

## సిఎం రేవంత్ విజన్‌తో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి: చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** జపాన్ దేశం, హిరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం శుక్రవారం తెలంగాణ శాసన మండలి, శాసన సభలను సందర్శించింది. హిరోషిమా రాష్ట్రం నుండి వచ్చిన ప్రతినిధులకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ, శాసన మండలి సభలను సందర్శించిన అనంతరం చైర్మన్ ఛాంబర్ లో సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రము భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని తెలిపారు. రాష్ట్ర రాజధాని నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారని, తమ బిజినెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఉన్న శాసన సభ, శాసన మండలి సభ్యులు చట్టాలను రూపొందించడంలో విజయవంతంగా పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నట్లు సుఖేందర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్‌తో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు. హిరోషిమా ప్రతినిధులు తమ రాష్ట్రాన్ని సందర్శించడం శుభపరిణామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్‌లు అద్దంకి



దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు టి రామ్మోహన్ రెడ్డి , పాల్వాయి హరీష్ , శాసన మండలి సెక్రెటరీ డా. నర్సింహాచార్యులు, శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ పళ్ల మార్కెట్

## నేడు సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన

## మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఈ నెల 6వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం వాటి పనులను మంత్రి పరిశీలించినట్లు ఒక ప్రకటనలో మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3,367.35 కోట్ల వ్యయంతో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, ఆధునిక మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రైతు పండించిన ప్రతి ఉత్పత్తికి మార్కెట్ హామీ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడం, రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు దశాబ్దాల వరకు మార్కెట్ అవసరాలను తీర్చగలిగే విధంగా ఈ మార్కెట్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.65 లక్షల మంది పండ్ల రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రస్తుతం 5.30 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న మార్కెట్ సామర్థ్యం 15.53 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగనుండగా, పండ్ల వ్యాపార పరిమాణం రూ.1,277 కోట్ల నుంచి రూ.7,765 కోట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 206 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, 79 ఉప మార్కెట్ యార్డుల ద్వారా ఏటా సుమారు రూ.80 వేల కోట్ల విలువైన వ్యవసాయ వాణిజ్య కార్యకలాపాలు జరుగుతున్నాయని వివరించారు.

# జిఒ 38 ప్రకారం పారదర్శకంగా బదలీలు చేపట్టాలి

## మంత్రి దామోదర రాజనర్సింహాకు టిజిజిడిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రభుత్వ జారీ చేసిన జీవో 38 ప్రకారం పారదర్శకంగా బదలీలను చేపట్టాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీజీజీడీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. 2024లో అమలు చేసిన విధంగా పూర్తి పారదర్శకతతో జీవో నెం. 38 ప్రకారం బదలీలు చేపట్టాలని టీజీజీడీఏ ప్రభుత్వాన్ని కోరింది. జీవో 38 నిబంధనల ప్రకారం ఒకే స్టేషన్‌లో 4 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వైద్యులతోపాటు, 3 సంవత్సరాల ప్రాధాన్యత కలిగిన వైద్యులు, జీరో స్పౌజ్ కేటగిరీ అభ్యర్థులకు కూడా ఆర్డర్ వారీగా బదిలీలు నిర్వహించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. జీవో నెం. 38 ప్రకారం గుర్తింపు పొందిన అసోసియేషన్‌గా ఎన్నికైన తమ నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. తమ సంఘం గతంలో ఉన్న పరిస్థితుల కంటే భిన్నంగా ప్రస్తుతం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకుని, ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులకు బదలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్, నాయకులు డాక్టర్లు బొంగు రమేష్, భూపేందర్, శ్రీనివాస్, మురళి, రాజశేఖర్, రాధాకృష్ణ, వినోద్, సంతోష్, క్రాంతి, శివ రామ్, ధీరజ్ పాల్గొన్నారు.

# పశ్చిమాసియా యుద్ధ ప్రభావం.. ఎగుమతులు లేక నష్టాల్లో మామిడి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో ఈ ఏడాది మామిడి కాయలు ఎగుమతి చేసే పరిస్థితి లేకుండా పోయింది. రాష్ట్రంలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపరి (కలెక్టర్ కాయలు), చిన్నరసాలు, పెద్దరసాల సాగు అధికంగా ఉంటుంది. ఇవి దేశ, విదేశాలకు ఎగుమతి అయ్యేవి. యుద్ధం కారణంగా ఇప్పుడా ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది దేశీయ మార్కెట్‌కే మామిడి పరిమితమైంది. దీనివల్ల సరైన ధర లభించడం లేదు.

రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం తదితర జిల్లా నుంచి ప్రధానంగా బంగినపల్లి, తోతాపరిలు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుంటాయి. చిన్నరసాలు, పెద్దరసాలు ఆంధ్రప్రదేశ్‌లో విక్రయాలు సాగుతుంటాయి. ఈ క్రమంలో గతంలో బంగినపల్లి రకం టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేలు, తోతాపురి టన్ను రూ.13 వేల నుంచి రూ.15 వేల ధరకు విక్రయించారు. ఈ సీజన్ ప్రారంభంలో పంట దిగుబడి లేకపోవడంతో బంగినపల్లి రకం టన్ను ధర రూ. 50 వేల వరకు పలికి, క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.15 నుండి 20 వేలకు చేరింది. అలాగే తోతాపరి కూడా ప్రారంభంలో కొంత మెరుగ్గా ఉన్నా ప్రస్తుతం ధర రూ.10 వేలకే పరిమితమైంది. రాష్ట్రంలో బంగినపల్లి, తోతాపరి, సువర్ణరేఖ వంటి రకాలు ఎక్కువగా సాగులో ఉన్నాయి.

ఖమ్మం, మంచిర్యాల, వనపర్తి వంటి జిల్లాలు మామిడి సాగులో ముందంజలో ఉన్నాయి. మరోపక్క మామిడి సాగు వరుస నష్టాలు, తుపానుల ధాటికి క్రమంగా తగ్గుతూ వస్తోంది. మామిడి తోటలను తొలగించి ఆ స్థానంలో పామాయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో పూత ఆలస్యమైంది. వచ్చిన పూత కూడా నల్లతామర తెగులుతో సుమారు 50 శాతానికి పైగా దిగుబడి తగ్గింది. దీంతో మామిడి రైతులు డీలా పడుతున్నారు. పెరిగిన పెట్టుబడులకనుగుణంగా ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఆశించిన ధర రాకపోవడంతో కోతలు చేపట్టకుండానే తోటలను వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్డు పక్కన, డంపింగ్ యార్డుల్లో మామిడికాయలను పారబోస్తున్నారు.

# మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సీటు ఖరారు చేయడం హర్షణీయం: చిన్నారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యత్వాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేయడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో బాధ్యతలను నిర్వహిస్తూ సాధారణ జీవితం గడుపుతున్న మీనాక్షి నటరాజన్ సేవలను గుర్తించి రాజ్యసభ సభ్యత్వాన్ని ఖరారు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీకి, వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీకి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుంది అని చెప్పడానికి మీనాక్షి నటరాజన్‌కు దక్కిన గౌరవం తాజా ఉదాహరణ అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

## కీలక ఖనిజాల కోసం గ్లోబల్ సప్లై చైన్

# అబ్జర్వేటరీ ఉపగ్రహ కేంద్రం

## యుకె, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

## ఉపగ్రహ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** కీలక ఖనిజాల కోసం గ్లోబల్ సప్లై చైన్ అబ్జర్వేటరీ ఉపగ్రహ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఇండియా, యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లై చైన్ అబ్జర్వేటరీ ఉపగ్రహ కేంద్రాన్ని ప్రారంభించడంతో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో, కీలక ఖనిజాల కోసం ఒక సరఫరాగొలుసు అబ్జర్వేటరీని-2025లో ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రయోగం జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, యూకే విదేశాంగ కార్యదర్శి యెవెట్ కూపర్‌తో కలిసి ఈ ఉపగ్రహ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, సుస్థిరమైన మరియు విశ్వసనీయమైన కీలక ఖనిజాల సరఫరా గొలుసులను నిర్మించడంలో ఈ అబ్జర్వేటరీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. స్వచ్ఛ ఇంధనం, అధునాతన సాంకేతికతలు మరియు డిజిటల్ పరివర్తన వేగంగా విస్తరించడంతో, కీలక ఖనిజాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మెటీరియల్ ఫ్లో మ్యాప్‌ను అభివృద్ధి చేయడంలో ఈ అబ్జర్వేటరీ కేంద్రంగా ఉంటుందని ఆయన వివరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలన్న ప్రధాని మోదీ దార్శనికతలో భాగంగా, కీలక ఖనిజాల రంగంలో స్వావలంబనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆ లక్ష్యానికి మద్దతుగా, ఖనిజాల ఆవిష్కరణ, అన్వేషణ, శుద్ధి, పునరుపయోగం, నూతన ఆవిష్కరణల రంగాలలో వ్యవస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీ 4 బిలియన్ డాలర్ల జాతీయ కీలక ఖనిజాల మిషన్‌ను ప్రారంభించింది. కీలక ఖనిజాల పునశ్చరణను ప్రోత్సహించడానికి, ప్రభుత్వం 180 మిలియన్ డాలర్ల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించి, దేశవ్యాప్తంగా తొమ్మిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

# ఆర్‌టిసిలో ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి నియామకం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)లో జరగబోయే కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం హైదరాబాద్ జంట నగరాల కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీత గోపాల్‌దాస్‌ను కార్మిక శాఖ రిటర్నింగ్ అధికారిగా నియమించింది.ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక సంఘాల గుర్తింపునకు సంబంధించిన నిర్దేశిత విధానం, మార్గదర్శకాలకు అనుగుణంగా, ఆర్‌టిసి ఉద్యోగుల ప్రాతినిధ్య కార్మిక సంఘాన్ని నిర్ధారించడానికి ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూసేందుకు రిటర్నింగ్ అధికారి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

# టిఎంసి కీలక సమావేశానికి 8 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలే హాజరు

**కోల్‌కతా, జూన్ 5:** తృణమూల్‌కాంగ్రెస్‌లో ముసురుకున్న అసమ్మతి రోజురోజుకూ పెరుగుతోంది. తొలినాటి సమావేశానికి దుమ్మొకొట్టిన 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటుప్రకటించి ప్రత్యేకకూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందూచా తర్వాత టిఎంసి కాలిఘాట్ నివాసంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కీలక సమావేశానికి కేవలం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఆరుగురు ఎంపిలు మాత్రమే హాజరుకావడం విశేషం. టిఎంసికి 28 మంది లోక్‌సభ ఎంపిలుంటే కేవలం నలుగురు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం 11 మంది



రాజ్యసభ ఎంపిల్లో 11 మంది ఈ సమావేశానికి హాజరుకాలేదు. మమతామేనల్లుడు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఒబ్రెయిన్, డోలాసేన్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎమ్మెల్యేల పరంగా మదన్ మిత్రా, బీనా మోండల్, ఆశిమా పాత్ర, ఫిర్హాద్ హకీమ్, కునాల్‌ఘోష్, సోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ్, బిమన్ బెనర్జీ, అశోక్‌దేబ్ వంటి ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. అయితే ఈసమావేశం జాతీయ స్థాయి వర్కింగ్‌కమిటీ సమావేశం అని అందరు ఎమ్మెల్యేలు, ఎంపిలు హాజరుకానవసరంలేదని పార్టీ తర్వాతప్రకటించింది. మహువామోయిత్రా, సుస్మితాదేవ్, ముకుల్ సంగ్మా, రాజేశ్ త్రిపాఠి వంటి వారు జాతీయ స్థాయి వర్కింగ్‌కమిటీలో ఉన్నారు. అయితేవీరంతా వర్చువల్‌గా హాజరయినట్లు సమాచారం. తిరుగుబాటు కూటమి నేత విపక్షనాయకుడు రితబ్రత బెనర్జీ మరికొందరు ఎమ్మెల్యేలు మా గ్రూపులో చేరతారని ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. మావద్ద మూడింట రెండొంతులకుపైగా ఎమ్మెల్యేలున్నారని, అందువల్ల మేం అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగానే కొనసాగుతామన్నారు. ఎంపిలకూటమిపై మాట్లాడుతూ గడచిన ఏడురోజుల్లో తాను ఒక్క ఎంపితోకూడా మాట్లాడలేదని రితబ్రత తెలిపారు.

# అక్రమ స్పా సెంటర్లపై పోలీసుల ఉక్కుపాదం

**- అనుమతులు లేకుండా డార్క్ రూమ్స్‌ల నిర్వహణ**

**-చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : కమిషనర్ సుమతి**



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుమతి

**మన్సూరాబాద్, జూన్ 5 , ప్రభాతవార్త :** అక్రమ కార్యకలాపాలు, అనధికారిక క్రాస్ మసాజ్ సేవలు, భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భారీ స్పెషల్ డ్రైవ్ ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఎస్వోటీ బృందాలతో కలిసి మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 113 సెంటర్లు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 46 సెంటర్ల నిర్వాహకులు, మేనేజర్లపై క్రిమినల్ కేసుల ను నమోదు చేశారు. ఎల్బీనగర్ లోని క్యాంపు కార్యాలయంలో సీపీ సుమతి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా స్పా సెంటర్లలో నిబంధనలు ఉల్లంఘన తో పాటు చాలావరకు స్పా సెంటర్లు అవసరమైన అనుమతులు, అప్రూవల్స్ లేకుండా, సక్రమంగా రికార్డులను నిర్వహించడం లేదని అన్నారు. స్పా సెంటర్ సూచించే డిస్‌ప్లే బోర్డులు లేకుండా సెంటర్లు ఉన్నాయని అన్నారు. జోన్లవారీల తనిఖీల వివరాలుఎల్బీనగర్ జోన్ లోని ఐదు పోలీస్ స్టేషన్ పరిధిలోని 47 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 17 కేసులు నమోదు చేశామనీ సీపీ తెలిపారు . ఉప్పల్ జోన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 30 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేశామన్నారు. మల్కాజిగిరి డివిజన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 17 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 7 కేసులు నమోదు అయ్యాయన్నారు. కంటోన్మెంట్ జోన్ లో ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు . నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు , అనుమానాస్పదంగా, అనధికారంగా, అక్రమంగా నడుస్తున్న స్పా సెంటర్ల గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కమిషనరేట్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను పోలీస్ కమిషనర్ సుమతి కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు, ఎస్వోటీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిసి గురుకుల పాఠశాల సిబ్బంది నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణిలో 718 దరఖాస్తులు

**పలు సమస్యలపై భారీగా తరలి వచ్చిన దరఖాస్తుదారులు**

**దరఖాస్తులు స్వీకరించిన ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి**

**బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 228వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 718దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 333దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 251దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 48దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 85దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు ఎండార్స్ చేసి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కుక్స్,స్వీపర్లు, వాచ్‌మెన్లు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇప్పించాలని,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరగా స్పందించిన చిన్నారెడ్డి బీసీ గురుకుల పాఠశాలల ఇంచార్జ్ కార్యదర్శి మల్లయ్య భట్టుతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేసారు.వేసవి కాలంలో వనస్థలి పురం ప్రభుత్వ పాఠశాల విధ్యార్ధులు గణితం,ఆంగ్లభాష,విషయాల్లో శిక్షణ పొంది గొప్పగా రాణించిన బాల బాలికలు సీఎం ప్రజావాణీకి వచ్చి తమ ప్రతిభను చాటారు.వారికి చిన్నారెడ్డి ఆశీస్సులు అందజేసారు.ఇలాంటి శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే విష యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసికెళ్తామని చిన్నారెడ్డి అన్నారు.కస్తూర్బా పాఠశాల నాన్ టీచింగ్ సిబ్బంది తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు.విద్యాశాఖ అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసారు.శుక్రవారం సీఎం ప్రజావాణీకి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్,ఎన్ఆర్ఐ సమన్వయ మండి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,సీఎం ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్ రెడ్డి వివిధ శాఖల అదికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కాపాడుకుందాం

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హారగోపాల్**




విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్ హారగోపాల్

**ధర్నాచౌక్, జూన్ 5, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కపాడుకుందామని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హారగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలను నిరసిస్తూ కవాడిగూడ ఏసిటిసి కాలెజి నుంచి ఇందిరాపార్కు ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ చక్రధరరావు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమం నుద్దేసించి ప్రొఫెసర్ హారగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 21ఏ ప్రకారం ఉచిత, నిర్బంధ విద్య ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును కాపాడాల్సిన ప్రభుత్వమే ఈరోజు విద్యను అంగట్లో సరుకుగా మార్చి, కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థను మతీకరణ, కేంద్రీకరణ చేస్తున్నారని, ఎన్‌టిఏ వంటి సంస్థల వైఫల్యం వల్ల నీట్ పరీక్ష రాసిన 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రాజ్యాంగా ఉండాల్సిన ప్రభుత్వం, కార్పోరేట్ కంపెనీలాగా మారటం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రొఫెసర్ చక్రధరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కార్పోరేటీకరణ విధానాలనే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, కేవలం కమీషన్ల కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ధర్నాకు సంఫీుభావం తెలిపిన అనంతరం మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అనేది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడే సామాన్య, పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు టీఎస్ఈసీ చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. సమాచార హక్కు మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేయటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం చట్టాలను నీరుగారుస్తూ, సామాన్యులకు విద్యను దూరం చేసే విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నేత పోటు రంగారావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జే.చలపతిరావు, టి.హన్మండ్లు, ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ నాయకులు ఎం.గంగాధర్, ఎ.నర్సింహారెడ్డి, మీరా, టీఎస్ఈసీ నాయకులు ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ, టిపిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. అనిల్‌కుమార్, టి.లింగారెడ్డి పాల్గొన్నారు.




# ప్రపంచ వేదికపై పోచంపల్లి చేనేత వైభవం

**చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యంగా 'థ్రెడ్ పోచంపల్లి'**

**నేతన్నల ప్రతిభకు ప్రపంచ మార్కెట్ దిశగా అడుగులు: మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి**

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త :** తెలంగాణ చేనేత కళా వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ లో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప రంగం చేనేతేనని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ కళ తెలంగాణకు మాత్రమే కాకుండా దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. జీఐ ట్యాగ్ ద్వారా పోచంపల్లి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, ఈ ప్రత్యేకతను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో రూ.1,400 కోట్లకు పైగా వ్యయం చేసిందని తెలిపారు. నేతన్నల ఉపాధి భద్రత, ఆధునిక శిక్షణ, మార్కెటింగ్ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చేనేత కుటుంబాల యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి నేతన్నల ప్రతిభ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందన్నారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసిన ఘనత పోచంపల్లి చేనేత కళాకారులదేనని కొనియాడారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాళ్లు వంటి ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టాయని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, మెరుగైన ఆదాయం అందించడం లక్ష్యంగానే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 చేనేత స్టాల్స్‌తో పాటు స్వయం సహాయక సంఘాలు, అనుబంధ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు చేనేత ఉత్పత్తుల వైవిధ్యాన్ని పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని, వారి కృషికి తగిన గుర్తింపు దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వేలాది కుటుంబాలకు చేనేత రంగం జీవనాధారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేయడం, నేతన్నలకు కొత్త మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 5 నుంచి 7 వరకు మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు, టై అండ్ డై సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు పాల్గొంటున్నారు. చేనేత రంగానికి విశేష సేవలందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్యలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన చేనేత రంగానికి కొత్త ఉత్సాహాన్ని, నేతన్నలకు విస్తృత మార్కెట్ అవకాశాలను తీసుకురానుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి టి నాగిరెడ్డి, చేనేత జౌళిశాఖ అధికారి శ్రీనివాస్, భువనగిరి డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, డిపిఆర్ఓ అరుంధతి ,గుండాల చేనేత సహకార సంఘం చైర్మన్ దడక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదిని ఈదిన కలెక్టర్ లక్ష్మీశా



ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కృష్ణానదిని ఈది వినూత్న సందేశాన్ని అందించారు. ఆక్వాడెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ లక్ష్మీశా అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఉదయం విజయవాడలోని భవానిఘాట్ నుండి కృష్ణానదిని ఈదుతూ అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. అవతలి ఒడ్డున మొక్కలు నాటారు. కలెక్టర్ ధైర్యసాహసాలకు పలువురు అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదులు కేవలం నీటివనరులు మాత్రమే కాదని, జీవవైవిధ్యానికి, వ్యవసాయ, తాగునీటి అవసరాలకు, పర్యావరణ సమతుల్యతకు మూలాదారమని పేర్కొన్నారు. నదులను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమంలో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు.

**యోగాడేకు సర్వం సిద్ధం :** ఈనెల 7వతేదీ నుండి 21వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం సిపి రాజశేఖరబాబుతో కలిసి మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 7వతేదీ పోలీస్‌సిబ్బందితో కలిసి విజయవాడలోని బిఆర్‌టిఎస్‌రోడ్‌లో థీమాటిక్ యోగా, 10వతేదీ పవిత్ర సంగమం వద్ద, 13వతేదీ బెరంపార్కు వద్ద, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బిఆర్‌టిఎస్‌రోడ్‌లో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు నిత్యయోగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ 21న జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని, ఇందులో 300మంది మాస్టర్ ట్రైనర్లు, 5వేల మంది యోగాశిక్షకులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ ఈకార్యక్రమాల్లో పాల్గొని జయప్రధం చేయాలని పిలుపునిచ్చారు.

# గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యానికి రూ.2,500కోట్లు : మంత్రి సంధ్యారాణి




ఉత్తమప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** సరైన రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూ.2,500కోట్ల నిధులు కేటాయించి, పలు గ్రామాలకు రహదారులు నిర్మించినట్లు రాష్ట్రగిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇటీవల విడుదలైన పదవతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షాఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్ధినీవిద్యార్థులను, వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సత్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు నేతృత్వంలోని తమ ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతభుత్వం ప్రతివిద్యార్ధిపై దాదాపు లక్షరూపాయలు వరకు ఖర్చుచేస్తున్నట్లు వివరి ంచారు. గతంలో గంజాయి సాగు చేసిన ప్రాంతాల్లో గంజాయిని నిర్మూలించి ప్రస్తుతం అక్కడ రెండు లక్షల ఎకరాల్లో కాఫీతోటల పెంపకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు, టార్పాలిన్‌లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు అందచేస్తున్నట్లు మంత్రి తెలియచేసారు. పల్నాడు జిల్లా ఎత్తిపోతల ఆశ్రమపాఠశాల విద్యార్థులు పాములను ముందుగానే గుర్తించే ప్రోటోటైప్‌షూ రూపొందించి రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించటం గర్వకారణమన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని గిరిజన విద్యార్థులు ఐఏఎస్, ఐపిఎస్ వంటి అత్యున్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. 600మార్కులకు గానూ 591 సాధించిన పార్థు, 590మార్కులు సాధించిన జాస్మిన్‌లు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈసందర్భంగా 176మంది విద్యార్థులకు మొమెంటోలు అందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో సోషల్‌వెల్‌ఫేర్ కార్యదర్శి యం.మల్లిఖార్జుననాయక్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి, గురుకులం విద్యాసంస్థల కార్యదర్శి యం.గౌతమి, ట్రైకార్ యండి మణికుమార్, గిరిజన సంక్షేమశాఖ జేడి ప్రతిభాభారతి, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ, గోదావరి సంగమంలో పుణ్యనదీ హారతులు



నవహారతులను పూజాదికాలతో ప్రారంభిస్తున్న పండితులు

**ఇంద్రకీలాద్రి, జూన్ 5, ప్రభాతవార్త** పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం వద్ద పుణ్యనదీ హారతులు శుక్రవారం సమర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ కమిషనర్ వార్ల ఆదేశాల ప్రకారం ఎన్.టి.ఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో ఈరోజు సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం (పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం) వద్ద పుణ్యనదీ హారతులు కార్యక్రమం లాంచనంగా పునః ప్రారంభం జరిగింది. మొదటగా దేవస్థానం స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక పూజా కార్యక్రమములు జరిగి, నదీమతల్లికి పసుపు కుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవస్థానం వైదిక సిబ్బంది పవిత్ర నదీమతల్లులకు పంచ హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయంలో ఆలయాలు,నదుల ప్రాముఖ్యత ఎనలేనిదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పుణ్య నదీ హారతి కార్యక్రమం శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం నుండి నిర్వహించడానికి ఏర్పాటు చేశామని, గతంలో మాదిరిగా వైభవంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహణకు పూర్తి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు జీవి నాగేశ్వరరావు, అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు, సరోజినీ దేవి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్,

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమా దేవి తదితరులు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో యూత్ టైం బ్యాంక్ సేవలు ప్రారంభం అయ్యాయి.

# కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీ ప్రాజెక్టు

**విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**విశాఖపట్నం,జూన్ 05: (ప్రభాత వార్త )** బే సిటిగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పై సీఎం 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ ఈ బేసిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. వీఈఆర్ పై ఓ ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు ఇచ్చారు. గ్రేహౌండ్స్ కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించాలని ఆదేశించారు. అలాగే కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ ఆహ్లాదం కలిగించేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్ తో పాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులు చేపట్టేలా పెట్టుబడులను ఆహ్వానించాలన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శన శాలను కూడా ఆధునీకరించి పర్యాటకుల్ని ఆకర్షించేలా చూడాలని సూచించారు. విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధక్షేత్రాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు లాంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణ.

# బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

**చిక్కడపల్లి జూన్ 5 ( ప్రభాతవార్త ) :** దేశంలో 75 కోట్లకు పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా జూలై చివరి వారంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీ బహిరంగ సభ, జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు జనాభా ప్రకారం తగిన వాటా దక్కలేదని, గత పాలకులు బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదిత ఢిల్లీ మహాసభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బీసీ నాయకులు, ప్రజలు తరలివస్తారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల అగ్రనేతలు కూడా ఈ సభలో పాల్గొంటారని వెల్లడించారు. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపుపై వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుడిగా, విశ్వగురువుగా గుర్తింపు పొందారు. ఇంతటి బలమైన నాయకత్వంలోనే బీసీలకు న్యాయం జరగకపోతే, భవిష్యత్తులో మరే ఇతర పాలకుల వల్లా అది సాధ్యం కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందనడానికి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడమే నిదర్శనమని కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బీసీలకు స్థానం కల్పించడంతో పాటు, నలుగురిని గవర్నర్లుగా చేశారని గుర్తుచేశారు. ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిగా, దళిత వర్గానికి చెందిన వ్యక్తిని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించి, దేశంలోని ఉన్నత పదవులన్నింటినీ బిసి, ఎస్సి, ఎస్టీ లకే అందించిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహా నిర్ణయాలు తీసుకోలేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించడం, ఓబీసీ కులాల వర్గీకరణ కోసం జస్టిస్ రోహిణి కమిషన్‌ను నియమించడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

# ఎపిలో కొనసాగుతున్న విభిన్న వాతావరణం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మరో మూడు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా గూడూరులో 44.6 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.7, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.3, కృష్ణా జిల్లా కానుమోలు, మన్యం జిల్లా సాలూరులో 43.1, ప్రకాశం జిల్లా కరేడులో 43, విజయనగరం జిల్లా రాజాంలో 42.7, అనకాపల్లి జిల్లా రాజాంలో 42.6, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, ఏలూరు జిల్లా నారాయణపురం, తిరుపతి జిల్లా పూలతోటలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# అందానికే అందానివై పఫ్ టాప్స్

ఫ్యాషన్ ఫ్యాషన్



అమ్మాయిల అందాన్ని వికసించిన పూలతో పోలుస్తుంటారు కవులు. అలాంటి సోయగాన్ని అందమైన బొకేలో అమరిస్తే ఎలా ఉంటుంది. అని డిజైనర్లకి ఆలోచన వచ్చిందేమో! అందుకే ఈ పఫ్ టాప్‌లను తీసుకొచ్చినట్టున్నారు. ప్లెయిన్ నెక్ స్టైల్.. చేతుల దగ్గర లేయర్డ్ పఫ్‌హ్యాండ్స్, కిందకొచ్చేసరికి సన్నగా బెల్ట్‌ను చుట్టుకొని కుచ్చులుగా కనిపిస్తూ.. ఈ టాప్‌లు అలాగే తోస్తాయి మినిమమ్ మేసేజ్ దీని ప్రత్యేకత. వస్త్రం. మొత్తాన్నీ దీనిలో వాడేస్తారు. కటింగ్ పాళ్లు చాలా తక్కువ. ఎక్కువగా కనిపించేది ఆర్గంజానే అయినా సిల్క్, కాటన్, నెట్ వస్త్రరకాల్లోనూ దొరుకుతున్నాయి. బెల్‌బాటమ్, పెన్సిల్ ప్యాంట్, లెహంగా, స్కర్ట్ ఏదైనా సరే.. పఫ్‌టాప్ మీదకి చక్కగా సెట్టయిపోతోంది. బాటమ్ వేర్ హెవీ డిజైన్లతో ఉంటే ఇది కాంట్రాస్ట్‌గా ప్లెయిన్ లుక్‌తో వస్తుంది. అదే కాస్త గ్రాండ్‌గా కావాలనుకుంటే సీక్వెన్లు, పూలు, బీడ్స్ వర్క్‌తో ఉన్న పఫ్ టాప్‌లను ఎంచుకుంటే సరిపోతుంది. హోరెత్తించే పార్టీలే కాదు.. సంప్రదాయ వేడుకలకూ తగ్గ డిజైన్లున్నాయి. ఏ వేడుకకి ఎంచుకోవాల న్నది మీవంతు. పఫ్ టాప్‌తో పూలగుత్తిలా మెరవడానికి సిద్ధం











# ఆమె గాత్రం సుమనో హారం



ఒకప్పుడు లతామంగేష్కర్ గాత్రాన్ని ఎంతగా అభిమానించారో అదే స్థాయిలో పాడే మరో గాయని ఉన్నారంటే నేటి తరం వాళ్లకేమోగానీ, పాత తరంవారందరికీ తెలుసుంటుంది. ప్రతిష్టాత్మక విశిష్ట పద్మభూషణ్ బిరుదు కూడా పొందారామె. ఆమె హిందీ, బెంగాలీ, మరాఠీ, అస్సామీ, గుజరాతీ, కన్నడ, అంగికా, భోజ్‌పురి రాజస్థానీ ఒడియా పంజాబీలతో పాటు అనేక భాషలలోని సినిమాలకు పాటలు పాడింది.ఓ మధురమైన బాణీ, శ్రుతులతో వినిపించే ఎంతో మధురమైన పాటల్ని ఈ నాటికీ గుర్తుంచుకుంటాం. అలాంటి పాటల్ని 'లత'గొంతు పోలిన శ్రావ్యమైన స్వరంతో వినిపించే మరోగాయని సుమన్ కళ్యాణ్ ఉన్నారు. ఇద్దరి స్వరంలో తేడా వెంటనే కనిపెట్టలేం. అందుకే 'బనాకాగీత్‌మాలా' పాటలు వింటున్నప్పుడు లతా మంగేష్కర్, సుమన్ కళ్యాణ్‌పూర్ పేర్లను ప్రత్యేకించి వేర్వేరు యాసలలో చెప్పడం తెలిసిందే. లేకుంటే అదెవరిగొంతో గుర్తుపట్టడం కష్టం. ఒకటేనని భ్రమపడే గ్రాతం వారిద్దరిదీ. 1962లో 'బాత్ ఏక్ రాత్'కి సినిమాలో ఓ మధురగళం వినిబడినప్పుడు అది లతాదో సుమన్ కళ్యాణ్‌పూర్‌దో గుర్తు పట్టలేనంతగా అప్పటి నుంచి వారి గాత్రాలను విడివిడిగా గుర్తించే శ్రోతలు ఎక్కువయ్యారు. పాతతరం సంగీత ప్రియులకు సుమన్ కళ్యాణ్‌పూర్‌ది బాగా గుర్తు పట్టే గళం. 'బ్రహ్మచారి' సినిమా మీరెవరైనా చూసి ఉంటే 'ఆజ్ కల్ తేర్ మేర్ ప్యార్‌కీ.. హార్‌జబాన్' అనే పాట వింటుంటే రఫీ, సుమన్‌లు కలిసి పాడిన యుగళగీతం అందర్నీ కాస్తంత హుషారెక్కిస్తుంది. గంతువేయిస్తుంది. ఇప్పటికీ మంచిపోలేని మాధుర్యం ఎన్నో సూపర్‌హిట్ పాటలకు నేపథ్యగాయనిగా ఆమె శ్రోతలను అలరించారు. గాత్ర శుద్ధి ఉన్న సుమన్ లతాతో పోటీ పడ్డారని చెప్పాలి. అలనాటి ఆ పాత మధురాలను మనకు వదిలి 89వ ఏట ఇటీవలనే ఈ లోకాన్ని వీడి వెళ్లారు. □

# ఆరోగ్య భాగ్యం శనగలు

శనగలంటే చిన్న చిన్న గుండ్రటి ఆకారంలో ఉండే పప్పు దినుసులు. వీటిని సాంప్రదాయ వంటకాల్లో, ఆరోగ్యం కోసం వాడుతారు. ఎందు కంటే పోషకాలు ప్రోటీన్స్ సమృద్ధిగా ఉండే పోషకాల పవర్‌హౌస్ కాబట్టి. ఇది 20-80 సెం.మీ ( 2 అడుగులు) పెరిగే వార్షిక మొక్క. వీటిని ఎక్కువగా భారత్‌లో పండస్తారు. 5,970000 టన్నుల శనగ ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటిది. తర్వాత టర్కీ, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇరాన్, మయన్మార్, కెనడా. ఇథియో పియా, అమెరికాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇవి లేత గోధుమ రంగు బఠానీ ఆకారపు చిక్కుళ్ళు అని చెప్పవచ్చు. వీటి పరిఆణం 5-12 మి.మి ఉంటుంది. శనగపప్పు యొక్క బుషెల్ బరువు 60 పౌండ్లు ఉంటుంది. కాల్చిన చీక్‌పీస్‌ని ఐరోపాలో కాఫీకి బదులుగా తయారు చేస్తారు. భారత్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రా, యుపి. కర్నాటకలో ఎక్కువగా పండస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా పండించడే పప్పుదినుసుల్లో దీన్ని సాగు చేస్తు న్నారు. ప్రపంచ పోషకాహార వంటకాల్లో ఇటు సాంప్ర దాయకంగా అటు ఆధునికంగా సుస్థిర పాత్రని సంపాదించిన శనగలు గురించి ఎంత చెప్పిన అలవి కాదు. 12,600 ఏళ్ళ క్రితం అడవుల్లో పెరి గిన శనగల నుంచి దాదాపు 60 రకాల్ని గుర్తించడమైంది. వీటిని సలాడ్స్, తాలింపుల్లో కూరలో ఎక్కువగా వాడుతారు. కొన్ని సంస్కృతలో శనగల్ని పాప్‌కార్న్‌లాగా పాప్‌చేసి పిండిలో రుబ్బుతారు. చిన్న పిల్లలు తినేందుకు వీలుగా శెనగలతో చేసిన పాలు, బట్టర్ వంటి ఎన్నో ఉత్పత్తుల్ని మోడ్రన్ లైఫ్ స్టయిల్‌తో వచ్చే అనారోగ్య సమస్యల్నితగ్గిస్తుంది. అంతేగాకుండా శెనగలతో చేసిన చిక్ పీ ఆయిల్‌ని జుట్టు చర్మం, కీళ్ళ నొప్పులు తగ్గించడానికుపయోగిస్తారు.

**రకాలు :** వీటిలో కొన్ని ముఖ్యమైన రకాల గురించి తెలుసుకుందాం. **దేశీ శనగలు :** ఇవి చిన్నవిగా గట్టివిగా మరియు గోధుమ రంగు లేదా ముదురు గోధుమ రంగులో కన్పిస్తాయి. వీటిలో పైబర్ అధికంగా ఉండడంవల్ల వీటిని మైక్రోస్పెర్మా అని అంటారు. **కబూలీ శనగలు :** ఇవి మెత్తగా పెద్దవిగా, తెల్లగా ఉండి ఉండి తక్కువ పైబర్, అధిక ప్రోటీన్‌తో ఉంటుంది. వీటని ఎక్కువగా సలాడ్స్-హమ్మస్, వంటి అంతర్జాతీయ వంట్లో ఉపయోగిస్తారు. ఇవి వండటానికి తేలికగా ఉంటాయి వీటినే మారోస్పెర్మా అని అంటారు.

**బ్లాక్ చిక్పీస్:** ఇవి ముదురు రంగులో ఉండే చిన్న రకమైన శనగలు బ్లాక్ యిక్పీస్, కాలా నల్లరకమైన శనగలు అంటారు. వీటిలో పైబర్ ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గి జీర్ణ కోశ వ్యవస్థకి మేలు చేస్తాయి. **గ్రీన్ చిక్పీస్:** తాజాగా కోసంన పచ్చి శనగలు, ఇవి సీజనల్‌గా, తాజా రుచితో అధిక పోషకాలతో నిండి ఉంటుంది. □

ఏ పేరంటం జరిగినా, ఇంట్లో, గుళ్లో పూజలు నైవేద్యంగా, ప్రసాదంగా ఇచ్చేది శనగలు అనే చెప్పాలి. అంతేగాకుండా చరిత్రలో మొట్టమొదటగా పండించిన కూరగాయల్లో ఇది ఒకటి దీన్ని 8500 బిపిలో ఆగ్నేయా టర్కీలో, ఫ్రాన్స్‌లో 6790 బిసిలో మొదట గుర్తించడమైనది. వీటిని ఛనా, చనా, చన్నా, గర్బంజో, ఈజిప్టియన్ బఠానీ, చిక్పీ అని అంటారు. చీక్పి అనేది చిచేపీస్ నుండి వచ్చింది. ఇది లాటిన్ నుండి వచ్చింది. సిసర్లు, గార్బొంజో అనే పదం ఆధునికి స్పానిష్ నుండి వచ్చింది. అరబిక్‌లో చిక్‌పీస్ అంటే హమ్మస్ అనే అర్థం కూడా ఉంది. ఇంగ్లీష్- చక్‌పీ, గార్బంజో బీన్, చిక్ పీ. స్ప్లిటపీస్, ఈజిప్టియన్ పీస్ హిందీ- ఛానా, కాలాఛనా, కబూలీ చనా తమిళ్ : కొత్తు కడలై, సనాగులు, కన్నడ: కడ్లే, మరాఠీ : హార్బరా, పంజాబీ: చోలే, గుజరాతీ: చాన్య, చన్, బెంగాలీ : చోళ, కాశ్మీరీ : చాను, సంస్కృతం : చనన. తెలుగు : శనగలు, సనగలు, తాడి బఠానీ, బొంగారాలు/బొంగడాలు అని వివిధ పేర్లతో వ్యవహరిస్తారు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# విశ్వరూపం



**కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు** విశ్వరూపాన్ని దర్శింపచేశాడు. అంతేనా.. ఆ పరంధాముడు తన విశ్వ రూపాన్ని బాల్యావస్థలోనే పెంపుడు తల్లి యశోదకు తొలుత చూపించాడు. మన్ను తిన్నావా? అని దండించ వోయినప్పుడు నోరు తెరిచి తన నిజస్వరూపాన్ని చూపాడు. ఉద్యోగ పర్వంలో రాయబారం కోసం ధృతరాష్ట్రుని కొలువుకు వెళ్లినప్పుడు కౌరవులు శ్రీకృష్ణుణ్ణి బంధించాలని ప్రయత్నించారు. వారిని హెచ్చరించటానికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శించాడు. కురుక్షేత్ర యుద్ధసమయంలో భగవద్గీతను బోధిస్తూ విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శింపజేయడం జగ ద్విదితమే! ఇక చివరిసారి మహా భారత యుద్ధం తర్వాత శ్రీకృష్ణుడు సోదరి సుభద్రను తీసుకుని ద్వారకకు బయల్దే రాడు. మార్గమధ్యంలో ఉదంకుడు అనే రుషి అతిథ్యాన్ని స్వీకరించాడు. యుద్ధ విషయం తెలియని ఆ మహర్షి కౌరవుల క్షేమ సమాచారాలు అడి గాడు. వారు సమరంలో చనిపోయారని శ్రీకృష్ణుడు చెప్పాడు. అది విన్న ఉదంకుడు అతడిపై అగ్రహించాడు. నీకు యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్నా! ఆపలేదు అంటూ శపించ బోయాడు. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ ' ఓ మునీ! నీ తపోశక్తిని వృథా చేసుకోవద్దు. నేను సర్వాంతర్యామిని అంటూ తన విశ్వ రూపాన్ని ప్రదర్శించాడు. ఇలా భారత, భాగవతాల్లో నాలుగుసార్లు శ్రీకృష్ణుడు తన దివ్యమైన విశ్వరూపాన్ని చూపాడు. □


**చెలి**

సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# తెర

# నూతన చిత్రం 'మొహబ్బత్' ప్రారంభం

సంతోష్ కల్వచెర్ల, శ్రేయాసి సేన్ జంటగా ఏబీఎస్ ప్రొడక్షన్ బ్యానర్ మీద అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న నూతన చిత్రం 'మొహబ్బత్' ఈ చిత్రానికి స్క్రీన్ ప్లేని అందిస్తూ మ్యాక్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీ ప్రారంభోత్సవం శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ చిత్ర పూజా కార్యక్రమాలకు చిన్న శ్రీశైలం యాదవ్ , ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి నవీన్ యాదవ్ క్లాప్ కొట్టగా చిత్ర నిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం నవీన్ యాదవ్ గారు చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని కూడా లాంచ్ చేశారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. 'మొహబ్బత్' సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు ధన్యవాదాలు. దర్శకుడు సలీమ్ మాలిక్ (మ్యాక్) మాట్లాడుతూ.. నిర్మాత అఫ్రోజ్ గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా'మొహబ్బత్'ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. నిర్మాత అఫ్రోజ్ షేక్ మాట్లాడుతూ.. నా ఏబీఎస్ ప్రొడక్షన్ బ్యానర్ మీద మొదటి ప్రాజెక్ట్‌గా'మొహబ్బత్'ను నిర్మిస్తున్నాను. ఈ మూవీ మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. మ్యాక్ మంచి దర్శకుడు. సంతోష్, శ్రేయాసిలకు ఈ సినిమాతో మంచి సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నాను. .హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ.. 'మొహబ్బత్' చిత్రంలో అన్ని రకాల అంశాలుంటాయి. ఈ కథ నాకు చాలా నచ్చింది. .హీరో సంతోష్ కల్వచెర్ల మాట్లాడుతూ.. .. అఫ్రోజ్‌కి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. మా డైరెక్టర్ మ్యాక్ అద్భుతమైన టాలెంటెడ్. ఇలాంటి ఓ ప్రేమ కథకు సంగీతం ప్రధానం. సునీల్ కశ్యప్‌తో పని చేస్తుండటం ఆనందంగా ఉంది అని అన్నారు.



# 'సోల్ ఆఫ్ లెనిన్'కి అద్భుతమైన స్పందన



మనం ఎంటర్ ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్య దేవర నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం'లెనిన్'. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలలో నటించిన ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో అంచనాలు మరింతగా పెంచేశాయి. ఇటీవల మేకర్స్ 'సోల్ ఆఫ్ లెనిన్' అంటూ ఆడియెన్స్‌ని సర్ ప్రైజ్ చేశారు. 'పెద్ది' సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. 'పెద్ది' ప్రదర్శనలకు ఈ 'సోల్ ఆఫ్ లెనిన్'ను జోడించారు. ఈ పాటలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే ప్రేమ, వారి బాండింగ్‌ను చక్కగా చూపించారు. ప్రేమ కంటే గొప్ప యుద్ధం లేదు అనే క్యాప్షన్‌తో ఈ పాట సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం, వాగ్దేవి గాత్రం ఈ పాటను మరింత అందంగా మలిచాయి. ఈ పాటలోని ప్రతి ఫ్రేమ్, ప్రతి విజువల్ భావోద్వేగాలతో కూడిన ఒక కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుందని హామీ ఇస్తున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని థమన్ ఎస్ అందించారు. పాటలు, నేపథ్య సంగీతం ఈ సినిమా స్థాయిని మరింత పెంచుతాయని భావిస్తున్నారు. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రం జూన్ 26, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



# 'దూత' నాగార్జున క్లాప్‌తో ప్రారంభం

లుయువ సామ్రాట్ నాగచైతన్య అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'దూత'తో ఓటీటీలో సంచలన అరంగేట్రం చేశారు. 'దూత' ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించింది. ఈ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ పలు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రేక్షకులను ఆకట్టుకుని గ్లోబల్ ఫెనామెనాన్‌గా నిలిచింది.తొలి సీజన్ నాగచైతన్యకు డిజిటల్ ప్రేక్షకుల్లో మరింత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, నటుడిగా ఆయనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీతో తన అనుబంధాన్ని మరింత ముందు కు తీసుకెళ్తూ, నాగచైతన్య సీక్వెల్ కోసం నిర్మాతగానూ మారుతున్నారు. శరత్ మరార్‌తో కలిసి అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. మొదటి సీజన్‌కు ప్రధాన బలంగా నిలిచిన తన అద్భుత కథన శైలితో విక్రమ్ కె కుమార్ రెండో సీజన్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను నేడు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కింగ్ నాగార్జున అక్కినేని క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు.తండేల్ బ్లాక్‌బస్టర్ విజయానంతరం 'వృషకర్మ' చేస్తున్న నాగచైతన్య తన తదుపరి ప్రధాన ప్రాజెక్ట్‌గా 'దూత 2'ను ఎంచుకోవడం విశేషం. అంతేకాక నిర్మాతగా కూడా భాగస్వామి కావడం, ఈ కథపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. ఈసారి విక్రమ్ కె కుమార్ మరింత ఉత్కంఠభరితమైన, మిస్టరీతో నిండిన కథను సిద్ధం చేశారు. ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తున్నారు. బసుజల్: ది వోర్టెక్స్' తొలి సీజన్‌కు పనిచేసిన వి.ముకేశ్వరన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఈషాన్ ఛాబ్రా సంగీతం సమకూరుస్తున్నారు.

# 2027లో వెంకీ, అనిల్ రావిపూడి మూవీ



విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే లక్ష్యంతో త్రివిక్రమ్ శరవేగంగా షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. ఇదిలా ఉండగా, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో వెంకటేష్ చేయబోయే నెక్స్ట్ ఎంటర్‌టైనర్ కూడా పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. అనిల్ రావిపూడి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేయగా, ఈ నెలలోనే సినిమాను ప్రారంభించనున్నాడు. జూన్ 15న హైదరాబాద్‌లో ఈ చిత్రానికి సంబంధించిన గ్రాండ్ పూజా కార్యక్రమం జరగనుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ మరొక హీరోగా నటిస్తుండటం విశేషం. జూన్ మూడో వారంలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటగా వెంకటేష్ లేని కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. మరోవైపు వెంకటేష్'ఆదర్శ కుటుంబం' షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి, జూలై చివరి నాటికి అనిల్ రావిపూడి సెట్స్‌లో జాయిన్ అవ్వాలని ప్లాన్ చేస్తున్నాడు.ఈ మల్టీస్టారర్ ఎంటర్‌టైనర్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్‌లుగా నటిస్తుండగా జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఫైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జీ స్టూడియోస్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఈ భారీ వినోదాత్మక చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# 'సిగ్మా' ఎనర్జిటిక్ ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్



సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా' జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ సెన్సేషన్ ఎస్. తమన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. తాజాగా హీరో దుల్కర్ సల్మాన్ 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ 'సిగ్మా స్టైల్'ను లాంచ్ చేశారు. తమన్ స్వయంగా కంపోజ్ చేసి ఆలపించిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్ మాస్ బీట్‌లతో అదిరిపోయింది. థమన్ సిగ్నేచర్ స్టైల్ మ్యూజిక్, హైవోల్టేజ్ రిథమ్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందీప్ కిషన్ తన స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, ఫారియా అబ్దుల్లా కూడా టు అదిరిపోయే డ్యాన్స్ స్టెప్స్‌తో పాటకు మరింత కలర్ తీసుకొచ్చింది. జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్, థమన్ మాస్ ట్యూన్, సందీప్ ఫారియా డైనమిక్ పెర్ఫార్మెన్స్ కలిసి'సిగ్మా స్టైల్'ను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. ఈ సాంగ్‌తో సినిమాపై క్యూరియాసిటీ, ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి. ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. హరిహరసుతన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు.

# థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం

## 'ఓ అందాల రాక్షసి' హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ ఆవేదన



రిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదు.చిన్న సినిమాలను చంపేస్తున్న మాఫియా. ఎక్కువ థియేటర్స్‌లో వస్తేనే సినిమా ఓటీటీకి అర్హత దొరుకుతుంది. న్యాయం జరిగే వరకు నా పోరాటం కొనసాగుతుంది. తెలుగు సినిమా పరిశ్రమలో మాఫియా చిన్న సినిమాలను చంపేస్తోందని 'ఓ అందాల రాక్షసి' హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రిలీజ్ కే కాదు, రీరిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఇవ్వడం లేదని, థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం అన్నారు. తెలుగు ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ,"మంచి సినిమాలను కిల్ చేస్తున్నారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు. నైజాం ఏరియాలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వలేదు.చిన్న సినిమాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని,"ప్రపంచంలో ఎక్కడా లేని పరిస్థితి మన ఇండస్ట్రీలో ఉంది. బాలీవుడ్‌లో కూడా ఇలా ఉండదు" అని వ్యాఖ్యానించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయని, తిదీదిది వంటి చార్జీలు కూడా నిర్మాతలను కుంగదీస్తున్నాయని తెలిపారు.చిన్న సినిమాలకు థియేటర్లు, సరైన అవకాశాలు కల్పించకపోతే కొత్త ప్రతిభ ఎదగడం కష్టమవుతుందని,

# ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ ఫీవర్



ఎత్తు 37 సెం. మీ
బరువు 6 కిలోలు
18 క్యారెట్ల బంగారం

**ఫిఫా ప్రపంచకప్‌కు వేళవుతోంది. ప్రపంచ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు మరో అయిదు రోజుల్లో తెరలేవ నుంది. నెలరోజులకు పైగా ప్రపంచాన్ని ఉర్రూత లూగిం చనుంది. ఇప్పటికే ప్రపంచానికి ఫుట్‌బాల్ జ్వరం పట్టుకుంది. భారత జట్టు ఈ టోర్నీలో లేకు న్నా... మనదేశానికి సాకర్ ఫీవర్ అంటుకుంది. అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా... ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్పెయిన్, పోర్చుగల్ వంటి జట్లు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి.**

**న్యూయార్క్:** ఫిఫా ప్రపంచకప్ ఆరంభానికి సమయం సమీపిస్తుండడంతో ఈ టోర్నీ సంబంధించిన అంశాలపై ప్రపంచం ఆసక్తిగా గూగుల్‌లో సెర్చ్ చేస్తోంది. ముఖ్యంగా ఫీఫా ట్రోఫీ ఇపుడు అందరి దృష్టిని విశేషంగా ఆకట్టు కుంది. ఈ ట్రోఫీని మొదటిసారి 1970లో రూపొందించారు. ఇది 37 సెంటీ మీటర్ల ఎత్తు, 6 కిలోల బరువు ఉంటుంది. దీన్ని 18 క్యారెట్ల బంగారంతో తయారుచేశారు. అడుగుభాగం ఆకుపచ్చ మలాకైట్ ఖనిజంతో అలంకరింప బడింది. దీని విలువ ప్రస్తుతం 170 కోట్లకు పైగానే ఉంటుంది. భూమిని పైకి ఎత్తిపట్టుకున్న ఇద్దరు మానవ ఆకృతుల రూపంలో అద్భుతంగా ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని ఇటాలియన్ శిల్పి సిల్వియో గజానిగా రూపొందించారు.

**బ్రెజిల్ సొంతమైన పాత ట్రోఫీ**

బ్రెజిల్ జట్టు 1970లో మూడో ప్రపంచకప్ నెగ్గి పాత జులెస్ రిమెట్ ట్రోఫీని శాశ్వతంగా సొంతం చేసుకుంది. దీంతో 1974 నుంచి కొత్త ట్రోఫీ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ట్రోఫీ డిజైన్ల కోసం పోటీ సైతం నిర్వహించగా, గజానిగా రూపొందించిన నమూనా ఎంపికైంది. 1974 నుంచి విజేతలకు ఈ ట్రోఫీని అందజేస్తున్నారు. తొలిసారి జర్మనీ కెప్టెన్ బెకెన్ బాయర్ అందుకున్నాడు. గత అనుభవం వల్ల ఫిఫా ప్రపంచకప్ అసలైన ట్రోఫీని గెలిచిన జట్టు అందుకుంటుంది. కానీ అది తమ వెంట తీసుకెళ్లడానికి అనుమతించారు. అసలైన ట్రోఫీ ఫిఫా వద్దే ఉంటుంది. ఫైనల్ ముగిసిన వెంటనే దానిని జ్యూరిచ్‌లోని ఫిఫా ప్రధాన కార్యాలయానికి విమానంలో తిరిగి పంపిస్తారు. దానికి బదులుగా, గెలిచిన దేశానికి బంగారు పూత పూసిన కంచు ప్రతిరూపం రెప్లికా ట్రోఫీని అందజేస్తారు. దీనితోనే విజేత జట్టు స్వదేశానికి చేరుకుంటుంది. అందుకే ఫిఫీ ప్రపంచకప్ ట్రోఫీని వరల్డ్ స్పోర్ట్స్‌లో అత్యంత విలువైన, గుర్తింపు పొందిన ట్రోఫీలలో ఒకటిగా పరిగణిస్తారు.

# పాక్‌ను చిత్తు చేసిన యువ భారత్

## ఆసియా కప్ అండర్18 హాకీ ఫైనల్లో జపాన్‌తో ఢీ




**కకామిగహారా(జపాన్):** దాయాది పాకిస్థాన్‌ను యువ భారత్ చిత్తు చిత్తు చేసింది. కాకపోతే ఇది హాకీ మైదానంలో. జపాన్‌లో జరుగుతున్న ఆసియా-18 హాకీ కప్‌లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో చిర కాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 5-3 గోల్స్ తేడాతో ఓడించింది. సగర్వంగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జపాన్‌తో కప్ కోసం తలపడనుది.

ఆట ప్రారంభం నుండి భారత టీమ్ ఆధిక్యం చాటింది. పదే పదే పాక్ డిఫెన్స్‌ను ఛేధిస్తూ పాక్ గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. చివరకు 12వ నిమిషంలో సఫలమైంది. పెనాల్టీ స్ట్రోక్‌ను అశీష్ తాని గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మొదటి క్వార్టర్ ముగిసే వరకు భారత్ ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. రెండో క్వార్టర్‌లో పాకిస్థాన్ దూకుడుగా ఆడటం ప్రారంభించింది. 27వ నిమిషంలో అదిల్ గోల్‌తో పాక్ 1-1తో సమవుజ్జీగా నిలిచింది. నేడు ఆసియా కప్ ఫైనల్లో జపాన్‌తో తలపడనుంది.

అంతకుముందు భారత అండర్-18 బాలికల జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది. ఫెనాల్టీ షూటౌట్‌లో భారత్ వెనకడింది. చైనా 3-1 గోల్స్ తేడాతో నెగ్గి ఫైనల్లో ప్రవేశించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2-2తో సమవుజ్జీగా నిలిచాయి. నౌషీన్ నాజ్ 3వ నిమిషంలో, కిరణ్ ఎక్కా 54వ నిమిషంలో భారత్‌కు గోల్స్ అందించారు. దీంతో ఫలితం తేల్చడానికి పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా, చైనా మూడు అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. భారత్ ఆటగాళ్లు మూడింటిలో రెండు గోల్స్ చేయడంలో విఫలమయ్యారు. చైనా గోల్ కీపర్ లీ గ్జూ అద్భుతంగా అడ్డుకుంది.

# పతిరాగే 92.62 మీటర్లు నమోదు




**రోమ్:** ఇటలీలోని రోమ్‌లో జరిగిన డైమండ్ లీగ్‌లో శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేష్ పతి రాగే అత్యధికంగా 92.62 మీటర్ల దూరం నమోదుచేసి చరిత్ర సృష్టించాడు. తొలిసారి డైమండ్ లీగ్ స్వర్ణం అందుకున్నాడు. 2024 ఒలింపిక్ ఫైనల్ తర్వాత ప్రపంచంలోనే అత్యుత్తమ త్రోగా ఇది నిలిచింది. అలాగే ఆసియా అథ్లెటిక్ చరిత్రలో ఇది రెండో అత్యుత్తమ ప్రద ర్శన. ఈ క్రమంలో భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా(90.23 మీటర్లు)ను వెనక్కి నెట్టాడు.

ఈ మైలురాయి అందుకున్న తొలి శ్రీలంక జావెలిన్ త్రోయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ జావెలిన్‌లో శ్రీలంకకు కొత్త గుర్తింపు తీసుకువచ్చాడు.

శ్రీలంక జావెలిన్ త్రోయర్ పతి రాగే... ఈ డైమండ్ లీగ్ ఫైనల్ తొలి ప్రయత్నంలో 84.49 మీటర్లు నమోదుచేశాడు. రెండో ప్రయత్నంలో 90 మీటర్లకు పైగా విసిరాడు. చివరి ప్రయ త్నంలో ఏకం గా 92.62 మీటర్లు నమోదుచేశాడు. ఈ ప్రదర్శనతో రుమేష్ పతిరాగే ప్రపంచ ఆల్‌టైమ్ జాబితాలో ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. 90 మీటర్ల మార్కును దాటిన నాల్గవ ఆసియా జావెలిన్ త్రోయర్‌గా, మొత్తం మీద 28వ అథ్లెట్‌గా పతిరాగే నిలి చాడు. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 92.97 మీటర్లతో ఆసియా రికార్డు అతని పేరిట ఉంది.

భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మూడో స్థానానికి చేరాడు. శ్రీలంక అథ్లెటిక్ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలవనుంది.

# ఫ్రెంచ్ ఫైనల్లో జ్వెరెవ్, కొబోలీ

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో అనూహ్య పరిణా మాల మధ్య ఫైనల్ సమరం ఖరారైంది. గత కొన్నేళ్లుగా టైటిళ్లపై ఆధిపత్యం చెలాయించిన ఆటగాళ్లు టోర్నీ నుంచి నిష్క్రమించడంతో ఈసారి కొత్త గ్రాండ్‌స్లామ్ విజేత ఆవిర్భవించనున్నారు. మొదటి సెమీఫైనల్లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్ నాలుగు సెట్ల హోరాహోరీ పోరులో 7-5, 6-2, 3-6, 6-3తో చెక్ యువ సంచ లనం జాకుబ్ మెన్సిక్‌పై విజయం సాధించి ఫైనల్ చేరాడు. తొలి సెట్‌ను చెమటోడ్చి నెగ్గిన జ్వెరెవ్ తరువాతి సెట్‌ను అలవోకగా నెగ్గి ఆధిక్యం చాటాడు. ఈ దశలో పుంజుకున్న మెన్సిక్ మూడో సెట్ నెగ్గి ఊపుమీదకనిపించాడు. అనుభవజ్ఞుడైన జ్వెరెవ్ నాలుగో సెట్ నెగ్గి పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు.

మరో సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ ప్లావియో కొబోలీకి వాపోవర్ లభించింది. ప్రత్యర్థి ఇటలీకే చెందిన మాట్టియో అర్నాల్డి వైరల్ ఫీవర్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో తొలి గ్రాండ్ స్లామ్ ఫైన ల్లో అడుగుపెట్టిన కొబోలీ... జ్వెరెవ్‌తో టైటిల్ కోసం తలపడను న్నాడు. ఇప్పటివరకు గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవని ఈ ఇద్దరు ఆటగాళ్లలో ఒకరు ఆదివారం జరిగే ఫైనల్ అనంతరం తొలిసారి మెజర్ చాంపియన్‌గా నిలవనున్నారు. దీంతో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ సమరం అత్యంత ఆసక్తికరంగా మారింది.

# 34 ఎత్తుల్లో ప్రజ్ఞానంద గెలుపు

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద దూసుకెళ్తున్నాడు. వరల్డ్ చాంపియన్ గుకేశ్‌పై 34 ఎత్తుల్లోనే ఓడిం చాడు. వరుసగా మూడు విజయాన్ని తన ఖాతాలో నాలుగో రౌండ్‌లో గుకేష్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రజ్ఞానంద బదులు తీర్చు కున్నాడు. ఈ విజయంతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. 15 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వెస్లే 15.5 పాయింట్లతో అగ్రస్థానంలో, అలిరెజా ఫిరౌజా 14.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. గుకేష్8 పాయింట్లతో కొనసాగుతున్నాడు.

# లార్డ్స్ టెస్ట్‌లో బౌలర్ల హవా; పట్టు బిగించిన ఇంగ్లండ్

**లార్డ్స్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ పట్టు బిగించింది. ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగు లకే ఆలౌట్ చేశామన్న ఆనందం న్యూజిలాండ్‌కు ఎక్కువసేపు నిలవలేదు. కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే కుప్ప కూలింది. ఓవర్‌నైట్ స్కోరు 6 వికెట్లకు 61 పరుగులతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి ఎక్కువసేపు నిలవలేకపోయింది. న్యూజిలాండ్ జట్టులో కైల్ జేమీసన్ (38 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా.. గ్లెన్ ఫిలిప్స్ (34) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్‌సన్ 5 వికెట్లతో చెలరేగగా, జోష్ టంగ్ 3, అకిన్‌సన్‌లు రెండు వికెట్లు తీశాడు. దీంతో ఇంగ్లండ్‌కు 27 పరుగుల తొలి ఇన్నింగ్స్ స్వల్ప ఆధిక్యం లభించింది. రెండో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 166 పరు గులు సాధించింది. జేమీ స్మిత్ (31), అకిన్‌సన్ (7) పరుగులతో క్రీజులో ఉన్నారు. ఓపెనర్ ఎమిలియో గే (57) అర్ధసెంచరీ సాధిం చాడు. బెన్ డకెట్ (33) పర్వాలేదనిపించాడు.

కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ మూడు వికెట్లు తీయగా, విలియం రూర్కే 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 193 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. బౌలర్లకు విపరీతంగా అనుకూ లిస్తున్న లార్డ్స్ పిచ్‌పై బ్యాటర్లు క్రీజ్‌లో నిలదొక్కుకోవడం కష్టమే. మరో మూడు రోజులు ఆట మిగిలి ఉండడంతో ఇంగ్లండ్‌కు విజయా వకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# మార్కెట్లకు రెపోరేట్ ఎఫెక్ట్




## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, జూన్ 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త తలు తగ్గకపోవడం ఆర్థికవృద్ధి అంచనాలు కూడా ఆర్బీఐ తగ్గించడం వంటి వాటి ప్రభావంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల వెల్లడి అనంతరం ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 116.67 పాయింట్లు క్షీణించి 74,243.34 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 49.85 పాయింట్లు తగ్గి 23,366.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ట్రెంట్ 2.23శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.95శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.52శాతం క్షీణించి మార్కెట్లకు మరికొంత ప్రభావం చూపించా యి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2056 షేర్లు పెరిగితే 2138 షేర్లు క్షీణించాయి. మరో 217 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి మారకం విలు వలు 94.94వద్ద కొనసాగాయి. అంతకుముందురోజు 95.7450వరకూ కొనసాగిన సంగతి తెలిసిందే. అమెరికాపదేళ్ల బాండ్లరాబడులు 0.02శాతం క్షీణించి 4.476వద్ద కొనసాగాయి.

కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్లు 5 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 94.98గా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో ఆగస్టునెల సెటిల్‌మెంట్ పసిడిధరలు 0.86శాతం క్షీణించి రూ.1,58,180వద్ద కొనసా గాయి. వారాంతంలో యూరోపియన్ షేర్లు కూడా గరిష్టస్థాయిలోనే ముగిస్తే ఆసియా షేర్లుమాత్రం స్వల్పంగా క్షీణించాయి. టెక్‌స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు లాభా ల స్వీకరణకు ఆసక్తిచూపారు. ఇకవాల్‌స్ట్రీట్ మార్కెట్లు మిశ్రమంగా ఉన్నాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు874.86పాయింట్లుపెరిగింది. ఎస్అండ్‌పి 500 కూడా 0.41శాతం పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ సూచీ మాత్రం 0.09 శాతం క్షీణించింది. దేశీయ స్టాక్స్‌లో టాటా స్టీల్ 1.80శాతం క్షీణించింది. ఎసిఎంఇ సోలార్ 3.12పెరిగితే భెల్ 0.58శాతం క్షీణించింది. లూపిన్ 90.80శాతం పెరిగింది. అలెంబిక్ ఫార్మా 0.12శాతం బజాజ్ ఎలక్ట్రికల్స్ 2.55 శాతం, బ్లూస్ప్రింగ్ ఎంటర్‌ప్రైజెస్ 11.40శాతం చొప్పున పెరిగాయి. ఇక నెఫ్రో కేర్ హెల్త్‌సర్వీసెస్ 2.25శాతం పెరిగాయి. ఇక ఐపిఒల పరంగా హెక్సాగాన్ న్యూట్రిషన్ 1.61రెట్లు ఎక్కువ బిడ్డింగ్ జరిగింది. బిడ్డింగ్ 9వ తేదీ ముగుస్తుంది. ఇష్యూధర రూ.42నుంచి రూ.45గా నిర్ణయించారు. సిఎంఆర్‌గ్రీన్‌టెక్నాలజీస్ కూడా 126.87 రెట్లు బిడ్లు వచ్చాయి. ఇష్యూ ఈనెల 3వ తేదీ ప్రారంభం అయి శుక్రవారంతోముగిసింది. ఐపిఒ ఇష్యూ ధర రూ.182 నుంచి రూ.192గా నిర్ణయించింది.

# ఎన్‌ఆర్‌ఐలు, ఒసిఐల పెట్టుబడుల పరిమితి పెంపు

## ఈక్విటీలు పెంచేందుకు ఆర్బీఐ కొత్త నిబంధనలు




**ముంబయి:** భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకుఆర్బీఐ తన పాలసీ సమీక్షలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు 4.62లక్షల కోట్లుగా ఉండవచ్చని నిర్ణయించింది. ఎఫ్‌పిఐల ఈ పరిమితి దాటకూడదు. ఇక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులపరిమితిని రూ.1.53 లక్షలకోట్లుగామొదటి ఆరునెలల కాలానికి నిర్ణయించింది. సెబీ రిజిస్ట్రేషన్ లేకుండానే భారత స్టాక్ మార్కెట్లోని ఈక్విటీ షేర్లలో ఎన్ఆర్ ఐలు, ఓసీఐలు పెట్టే పెట్టుబడి పరిమితులను పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు.

ద్రవ్య పరపతి సమీక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన ఈ ప్రత్యేక సౌకర్యాన్ని విదేశాల్లో నివసిస్తున్న ఇతర వ్యక్తిగత ఇన్వెస్టర్లకు వర్తింప జేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోకి విదేశీ నిధుల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్‌బీఐ మరికొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. ప్రభుత్వ బాండ్ల మార్కెట్లోకి విదేశీ మూలధనాన్ని తీసుకురావడానికి ఫుల్లీ యాక్సెస్డ్ రూట్ (ఎఫ్ఏఆర్) కింద 15, 30, 40 సంవత్సరాల కాలపరిమితి గల కొత్త ప్రభుత్వ సెక్యూరిటీలను కూడా చేర్చుతున్నట్లు గవర్నర్ తెలిపారు. జనరల్ రూట్ కింద విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై ఉన్న స్వల్పకాలిక పెట్టుబడి పరిమితులు,ఇతర నిబంధనలను పూర్తిగా తొలగిస్తున్నట్లు చెప్పారు.

కేంద్రం ప్రకటించిన పన్ను మినహాయింపులు, ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా రావడానికి సహాయ పడతాయని సంజయ్ మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వెనక్కి తీసుకురావడానికి గల కాలపరిమితిని తిరిగి తొమ్మిది నెలలకు పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. భారత విదేశీ మారకపు రేట్ల విధానంలో ఎలాంటి మార్పులు లేవని రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గవర్నర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరతల వల్ల ఒక్కోసారి మార్కెట్లో అంచనాలకు భిన్నంగా తీవ్ర ఒడుదొడుకులు వచ్చే అవకాశం ఉందని గవర్నర్ చెప్పారు. అలాంటి సమయాల్లో ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతినకుండా ఆర్‌బీఐ కచ్చితంగా రంగంలోకి దిగి మార్కెట్‌ను నియంత్రిస్తుందని వివరించారు. తమ లక్ష్యం మార్కెట్ ఆధారిత మార్పులను అడ్డుకోవడం కాదని, కేవలం అస్తవ్యస్తమైన కదలికలను అదుపు చేయడమేనని స్పష్టం చేశారు

# 682 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా

**ముంబయి, జూన్ 5:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానా నిల్వలు 938 మిలి యన్ డాలర్లుపెరిగి 682.321 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆర్బీఐ వెల్లడించింది. గతనెల 28వ తేదీతో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర పెరిగాయని వివరించింది. అంతకుముందు వారిలో 7.511 బిలియ న్ డాలర్లు తగ్గి 681.384 బిలియన్ డాలర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27వ తేదీతోముగిసిన వారంలో ఫారెక్స్ కిట్టీ ఒక్కసారిగా ఆల్‌టైమ్ గరిష్టానికి పెరిగింది. 728.494 బిలియన్ డాలర్లకు చేరింది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావంతో కొన్ని వారాలపాటు రూపాయి క్షీణత కొనసాగడంతో ఒత్తిళ్లు ఎదురయ్యాయి. విదేశీ కరెన్సీ వినియోగా న్ని కట్టడిచేసేందుకు ప్రధానిమోడీ పదేపదే పొదుపుమంత్రం పఠించిన సంగతి తెలిసిందే. విదేశీ ప్రయాణాలు తగ్గించాలని, ఇంధన వినియోగం తగ్గించాలని, బంగారం కొంతకాలం కొనవద్దంటూ సూచనలుచేసిన సంగ తి తెలిసిందే. ఆర్బీఐ విదేశీ ఖజానా పటిష్టతకే ఇదంతా జరిగింది. ఇక విదేశీ కరెన్సీ ఆస్తులపరగా అయితే నిల్వలు 3.116 బిలియన్ డాలర్లు పెరిగి 546.148 బిలియన్ డాలర్లకు చేరాయి. కరెన్సీ ఆస్తులు అంటే డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్,యెన్ వంటి కరెన్సీల హెచ్చుతగ్గుల విలువలను కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలు మాత్రం 2.186 బిలియన్‌డాలర్లు క్షీణించి 112.6 బిలియన్ డాలర్లకు



చేరాయి. ఎస్‌డిఆర్‌లు కూడా స్థిరంగా 18.747 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఇక ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వు స్థాయి 8 మిలియన్ డాలర్లు పెరిగి 4.826 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తేలింది.



# ప్రాథమిక దశలోనే ప్లాస్టిక్ కరెన్సీ

**ముంబయి, జూన్ 5:** ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయం టూ జరుగుతున్న ప్రచారంపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతని చ్చారు. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని అన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతం గా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యా లపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వ డం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, ఆపరే షనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని భావించారు. అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

# రెపోరేట్ల జోలికి వెళ్లని ఆర్బీఐ

## 5.25% వద్దనే కొనసాగించాలని ఎంపిసీ ఏకాభిప్రాయం



**ముంబయి, జూన్ 5:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎంపీసీ రెపో రేట్లను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయిం చింది. మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణం గానే పాలసీ రెపో రేటును 5.25 శాతం వద్ద కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగిన సమావేశం అనంతరం ఆర్‌బీఐగవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ నిర్ణయాలను శుక్రవారం ప్రకటిం చారు. ఈనిర్ణయంతో స్టాండింగ్ డిపాజిట్ ఫెసి లిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5శాతం, మార్జినల్ స్టాం డింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 5.5శాతంగా కొనసాగుతాయి. దేశ ఆర్థిక వ్యవస్థ లోని తాజా పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాతే కమిటీ ఈ నిర్ణ యం తీసుకుందని గవర్నర్ వివరించారు. మరోవైపు, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను తగ్గించింది. గతంలో 6.9 శాతంగా అంచనా వేయగా, ప్రస్తుతం 6.6 శాతానికి సవరించింది. ప్రపంచవ్యాప్తంగా నెల కొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్త తలు, సరఫరా గొలుసులోఅంతరాయాలు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ద్రవ్యో ల్బణంపై హెచ్చరిక ద్రవ్యోల్బణం గురించి మల్హోత్రా మాట్లాడుతూ, ప్రస్తుతం రిటైల్ ద్రవ్యో ల్బణం (సీపీఐ) తక్కువగానే ఉన్నప్పటికీ, మూడో త్రైమాసికంలో ఇది ఆర్‌బీఐ గరిష్ఠ సహన పరిమి తికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ఏడాది సాధారణంకంటే తక్కువవర్షపాతం నమో దయ్యే సూచనలు, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలు ద్రవ్యోల్బణానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, కీలక మైన టోకు ద్రవ్యోల్బణం 3.7శాతం వద్ద స్థిరం గా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశమని తెలి పారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగాపటిష్టంగా ఉందని, ప్రైవేట్ వినియోగం వృద్ధికి మద్దతుగా ఉందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. అంత ర్జా తీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ సేవల ఎగుమ తులు బలంగా ఉంటాయని, వస్తు ఎగుమతులు కూడా వృద్ధిని నమోదు చేస్తున్నాయని, అయితే, పెరుగుతున్న వ్యయాల ఒత్తిడి వివిధ రంగాలపై ప్రభావం చూపుతోందని అంగీకరించారు.



# అంబానీని దాటేసిన చైనా బిలియనీర్

**బీజింగ్, జూన్ 5:** సంపదలో రిలయన్స్ ఇండ స్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని చైనాకు చెందిన టిక్‌టాక్ వ్యవస్థాపకుడు ఝాంగ్‌యిమింగ్ వెనక్కి నెట్టారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో జాంగ్ నికర ఆస్తి విలువ 92.8 బిలియన్ డాల ర్లకు చేరింది. ముకేశ్ అంబానీ 86.9 బిలియన్ డాలర్లతో మూడో స్థానానికి పడిపోయారు. ఝాంగ్ ఆసియాలోనే రెండో అత్యంత ధనవం తుడిగా, చైనాలోనే నంబర్1 కుబేరుడిగా అవత రించారు. ప్రస్తుతం ఈ జాబితాలో భారత్‌కు చెందిన గౌతమ్ అదానీ 117.4 బిలియన్ డాల ర్లు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

చైనాలోని ఫుజియాన్ ప్రాంతంలో జన్మించిన 43 ఏళ్ల ఝాంగ్ యిమింగ్ నాంకై విశ్వవిద్యా లయం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేశా రు. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన ఆయన 2012లో బీజింగ్‌లోని ఓ చిన్న అపార్ట్ మెంట్ రూమ్ నుంచి బైట్‌డ్యాన్స్ కంపెనీని ప్రారంభించారు. కేవలం అల్గోరిథమ్స్ ఆధారంగా యూజర్లకు నచ్చిన కంటెంట్‌ను అందించే టౌటియావో అనే న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను ఝాంగ్‌యిమింగ్ తెరిచారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.